# శ్రీ వివేకానంద
# జీవిత చరిత్ర



స్వామి వివేకానంద

రచన
మైథిలీ వెంకటేశ్వరరావు

ధర : 50/-

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

ప్రథమ ముద్రణ
జూలై 2008

ముఖచిత్రం
రమణ

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. సంవత్సరాల విషయంలో, సంఘటనల విషయంలో, అభిప్రాయ వ్యక్తిత్వ విషయాల్లో పొరపాట్లు రాసి ఉంటే క్షమించగలరు. నాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము.

- మైథిలీ వెంకటేశ్వరరావు

# స్వామి వివేకానంద

శివ ప్రేరితం



## మైథిలీ వెంకటేశ్వరరావు

సరస్వతీ పబ్లికేషన్ విజయవాడ వారి భారతదేశ

జాతిరత్నాల నుంచిలోకమాన్య బాలగంగాధర తిలక్

## మైథిలీ వెంకటేశ్వరరావు రచనలు
## మహనీయుల జీవిత చరిత్రలు
## భావి భారతపౌరులకు ఆదర్శప్రాయాలు
## ఇవే అత్యున్నత స్థాయికి చేర్చే నిచ్చెనలు

జాతిపిత మహాత్మాగాంధీ
స్వామి వివేకానంద
నేతాజీ సుభాస్ చంద్రబోస్
మదర్ థెరిసా
పండిట్ జవహర్ లాల్ నెహ్రూ
ఇందిరా గాంధీ
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
లోకమాన్య బాలగంగాధర తిలక్
లాల్‌బహదూర్ శాస్త్రి
శ్రీ రామకృష్ణ పరమహంస
రాజీవ్ గాంధీ
చంద్రశేఖర్ ఆజాద్





# స్వామి వివేకానందుల జీవిత చరిత్ర



స్వామి వివేకానంద

### వివేకానందుని పూర్వీకుల చరిత్ర

వివేకానందుని అసలు పేరు నరేంద్రుడు. ఈ నరేంద్రుడి పూర్వీకుల చరిత్ర సామాన్యమైనదేమీ కాదు. ఇతని వంశస్థులు కలకత్తాలోని సిమ్లా అనే పేటలో అనేక శతాబ్ధాలుగా నివాసమును ఏర్పరచుకొన్నారు. వీరు సిరిసంపదలతో తులతూగుతూ దాతృత్వానికీ, పాండిత్యానికీ, శక్తి సామర్థ్యాలకూ పెట్టని పేరుగా భాసిల్లారు. వీరిని కాయస్థ క్షత్రియులు, దత్తవంశస్థులని చెబుతారు.

### వివేకానందుడి తాత, తండ్రి గురించి

వివేకానందుడి తాత దుర్గాచరణ దత్తు. ఈయన సంస్కృత, పారసీక భాషల్లో అసమాన సాహిత్యాన్ని వంట పట్టించుకున్నవాడు. న్యాయశాస్త్రంలో ప్రావీణ్యం కలవాడు. ఇరవై ఐదేళ్ళ లోపే సంసారిక జీవితాన్ని విడనాడి సర్వసంగ పరిత్యాగం చేశాడు. దుర్గాచరణ దత్తు కుమారుడు విశ్వనాథుడు.

విశ్వనాథుడు కూడా పారసీక, ఆంగ్లభాషల్లోనూ, న్యాయశాస్త్రంలోనూ ప్రావీణ్యం సంపాదించి తరతరాలుగా చేస్తున్న న్యాయవాద వృత్తిని చేపట్టాడు. ఈయన తన వృత్తిలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈయన హయాంలోనే దత్తవంశం ప్రభువంశంగా వ్యాపించింది. మంచి పాండిత్యంతో పాటు ఈయనకి

దానధర్మాలు చేసే సుగుణం కూడా ఉంది. చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేసేవాడు. బాధితుల పట్ల అనంతమైన ప్రేమను చూపించేవారు.

## వివేకానందుని జననము

విశ్వనాథుడు సుగుణారాశి అయిన భువనేశ్వరీదేవిని వివాహమాడారు. ఈమె ఈశ్వర భక్తురాలు. భర్తకి తగిన ఇల్లాలు. నిత్యం రామాయణ, మహాభారత గ్రంథాలను పఠించేది. పరమేశ్వర వరప్రసాదమైన సంతానం తమకు లభించాలని భావించేది. కాశీ విశ్వేశ్వరుని ప్రతి నిత్యం పూజిస్తూ ఉండేది.

ఈమె ఒకనాడు ఒక దివ్య స్వప్నాన్ని గాంచింది. అందు పరమేశ్వరుడే స్వయంగా పుత్రరూపంలో దర్శనమిచ్చాడు. వెంటనే మేల్కొన్న ఆమె పరమానంద భరితురాలై సర్వేశ్వరుడు, జగద్రక్షకుడైన ఆ స్వామి తన కలను సఫలీకృతం చేశాడని అంజలి ఘటించింది. ఆమె కోరిక ఫలించి గర్భవతియై 1863 వ సంవత్సరం, 12వ తేదీన మగబిడ్డకు జన్మనిచ్చింది. స్వదేశంలోనే కాక పాశ్చాత్య ఖండాల్లో వేదాంత మత ప్రకాశాన్ని వ్యాపింప చేసేవాడు జన్మించాడని ఆమె ఆ క్షణం ఊహించి కూడా ఉండదు.

## నరేంద్రుడి బాల్యం

పరమేశ్వర ప్రసాది అయిన ఆ కుమారునకు నరేంద్రనాథ దత్తు అని నామకరణం చేశారు. బిడ్డని 'నరేన్' అనీ 'బిల్' అనే ముద్దుగా పిలుస్తూ అల్లారు ముద్దుగా పెంచసాగారు. అల్లారు ముద్దుగా పెరగటం వల్ల నరేంద్రునికి కొద్దిగా మంకుతనం ఏర్పడింది. ఒక్కచోట ఉండక ఎప్పుడు అటు ఇటూ తిరుగుతూ అల్లరి చేసేవాడు.

ఈ బిడ్డ అల్లరి తగ్గించడానికి భువనేశ్వరీదేవి ఒక మంత్రం లాంటి మాట చెప్పేది. "నీవు గనుక అల్లరి మాని బుద్ధిగా ఉండకపోతే శివుడు నిన్ను కైలాసానికి రానివ్వడు" అంటూ చన్నీటిధార క్రింద కూర్చోబెట్టేది. చిన్నతనం నుంచి తల్లి చెప్పే భగవద్గీత రామాయణంలోని కథలను అత్యంతాసక్తిగా వినే నరేంద్రునికి దేవుడంటే విపరీతమైన భక్తీ, ప్రేమలు ఉండటంతో కిమ్మనకుండా చన్నీటి ధార క్రింద కూర్చునేవాడు.

## నరేంద్రుని పట్ల తల్లిప్రేమ

ఎంత అల్లరి చేసినా బిడ్డ మీద తల్లికి కోపం రాదు. తల్లి విసుక్కున్నా కూడా ఆ విసుగులో లాలిత్యం ప్రస్ఫుటిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. అల్లరి నరేంద్రుని బుజ్జగిస్తూ శివనామాన్ని ఎక్కువగా వినిపించుతూ ఉండేది.





ఒకసారి విపరీతమైన అల్లరి చేస్తున్న నరేంద్రుని గట్టిగా పట్టుకుని "బిడ్డ కోసం శివుని ప్రార్థిస్తే ఆ స్వామి తన భూతగణాల్లోనుంచి ఒక దాన్ని నాకు బిడ్డగా పంపి ఉంటాడు" అంటూ ముద్దు ముద్దుగా విసుక్కుంది. ఈ మాటలు వింటూ నరేంద్రుడు శివతాండవం చేస్తూ ఇంకొంచెం అల్లరి చేసేవాడు.

## బైరాగులపై ప్రేమను చూపే 'నరేన్'

మూడేళ్ళ వాడైన నరేంద్రుడు ఎంత అల్లరిగా తిరుగుతున్నా 'బైరాగి' అనేవాడు కనపడగానే ఆట వదిలేసి వారినే ఆసక్తిగా ఇంతింత కళ్ళుపెట్టుకుని వీక్షించేవాడు. ఒకసారి ఒక బైరాగి "భవతీ భిక్షాందేహి" అని గుమ్మం ముందు కేకవేయుచుండగా బైరాగినే చూస్తున్న నరేన్ ఒక్కసారిగా చేతిలో ఉన్న ఖరీదైన వస్తువును బైరాగికి ఇచ్చేశాడు. తల్లి వస్తువేదని అడిగితే "బైరాగి అడిగాడు నేను ఇచ్చేశాను" అని ముద్దు ముద్దు మాటలతో చెప్పేవాడు.

పలుమార్లు ఈ విధంగా జరగటం వల్ల బైరాగి కనపడగానే గదిలో పెట్టి బంధించేవారు. ఐనా గది కిటికీలోంచి వంటిమీదున్న ఖరీదైన వస్తువులను వారిని పిల్చి మరీ ఇచ్చేసి ఆనందించేవాడు.

## బిడ్డలపై తల్లి ప్రభావం

పిల్లలు తను విద్యాభ్యాసాన్ని మొదటగా తల్లి వద్దే మొదలుపెడతారు. తల్లీ, తండ్రీ ప్రభావం పిల్లలపై ఈ వయసు నుంచే పడుతుంది. భువనేశ్వరీదేవి నరేంద్రునికి ఉగ్గుపాల నుంచే భక్తిబీజాలను నాటింది. రామాయణ భాగవతాలను వినసొంపుగా తెలిపేది. నరేంద్రునికి శ్రీరాముని దివ్యచరిత్ర అమితంగా ఆకర్షించగా సీతారాముల విగ్రహాలను తన ఆటలలో భాగంగా చేసుకునేవాడు.

ఆ విగ్రహాలకు పూజలు చేసేవాడు. ఒకనాడు నరేంద్రుడు కనపడకపోయేసరికి ఊరంతా వెదికారు. చివరగా మేడ మీదున్న గదిలో సీతారాముల విగ్రహాలను పెట్టుకుని వాటి ముందు ధ్యానం చేస్తూ ఉండిపోయాడు. అతడికి వీరి అరుపులు కూడా వినపడనంత దీర్ఘంగా ధ్యానంలో మునిగిపోయాడు. చివరకు తలుపులు పగలకొట్టి లోపలికి వచ్చారు వారంతా. పాలు తాగే బుడి బుడి అడుగులు వేసే చిన్న బిడ్డ అంతటి నిశ్చలధ్యాన నిమగ్నతలో ఉండటాన్ని అందరూ ఆశ్చర్యచకితులై చూశారు.

## జంతువులపై నరేన్ ప్రేమ

నరేంద్రుడికి జంతువులపై విపరీతమైన ప్రేమను చూపేవాడు. పావురాలు, నెమలి, కుందేళ్ళు, కోతుల వంటి అనేకరకములైన జంతువులను పెంచేవాడు.

వాటితో ప్రేమ పూరితమైన మాటలు మాట్లాడుతూ కాలాన్ని గడిపేవాడు. వాటి అరుపులను తను కూడా అనుకరించుతూ వాటితో ఆడేవాడు, గెంతేవాడు. గుర్రమన్నా, అశ్వారోహణం అన్నా భలే సరదా పడేవాడు. ఇంకా గుఱ్ఱాన్ని నడిపేవాడిని కళ్ళు విప్పార్చుకుని చూస్తూ దీర్ఘాలోచన చేసేవాడు.

అతడు పెట్టుకునే కుచ్చుటోపీ పెట్టుకుని, అతడు కూర్చునే ఆసనంలో కూర్చుని అశ్వాల్ని అధిరోహించే భంగిమలో ఉండి "ఇదే నా కోరిక" అని దీర్ఘశ్వాస తీసేవాడు. నిజమే గురువాజ్ఞతో జ్ఞాన శిఖరాన్ని అధిరోహించి, ధర్మం అనే దండాన్ని చేతపట్టి దారి తప్పి పయనిస్తున్న మానవజాతి అనే అశ్వజాతిని సక్రమమైన మార్గంలో నడిపిన ఈతడికి అతడి బాల్యంలోనే ఈ విద్య ప్రీతికరమవటంలో ఆశ్చర్యం ఏముంది?

## శివునిపై మక్కువను పెంచుకున్న నరేన్

ఒకనాడు నరేంద్రుని దగ్గర బంధువుల ఇంటిలో భార్యా భర్తల మధ్య వివాదం ఏర్పడి పెరిగి పెద్దదై ప్రాణాల్ని కూడా బలిగొన్నది. ఆ సంఘటన జరిగిన సమయంలో ఎవరో పెద్దలు వైరాగ్యంతో వివాహమే అనర్థహేతుమని, సంసారంలో పడిన వారి యాతనలు దుర్భరాలు అని నిరసించారు.

ఆ సంఘటన నరేన్ మనస్సునకు హత్తుకుపోయింది. అసలే బైరాగులంటే కుతూహలం చూపే నరేన్‌ని ఈ సంఘటన సీతారాములపై ప్రేమను కూడా దూరం చేసింది. అదే సమయంలో శివుడి పట్ల అతడికి ఉన్న ఆకర్షణ మరింత పెరిగింది.

## ధ్యానం చేస్తే జడలు

శివ వరప్రసాదుడయిన నరేంద్రుడికి శివునిపై ఉన్న ప్రేమను చూచి అతడి తల్లి భువనేశ్వరీదేవి ఆనందించేది. ఒకసారి డమరుకం చేతపట్టి పులిచర్మం చుట్టుకుని ఒళ్ళంతా విభూది రాసుకుని జడలతో ఉన్న శిరోజాలను పెట్టుకుని శివుని వేషధారణలో తల్లి ముందుకు వచ్చి తాండవం చేయసాగాడు. బుల్లి శివునిలా ఉన్న అతడిని తల్లిదండ్రులు ప్రేమగా దగ్గరకు తీసుకుని ముద్దాడారు.

శివుడి ధ్యానం వల్ల శిరోజాలు ఆ విధంగా జడలు కడతాయని చెప్పారు. అంతే ఆ రోజు నుంచి తలుపులు బిడాయించుకుని తన గదిలో శివుని విగ్రహం ముందు పద్మాసనం వేసుకుని సుదీర్ఘంగా ధ్యానం చేసేవాడు. మధ్య మధ్యలో కళ్ళు తెరచి జుట్టు పెరిగి జడలు కట్టిందో లేదో చూసుకునేవాడు.





ఎంతసేపైనా పెరగకపోయేసరికి తల్లి దగ్గరికి వెళ్ళి మారాం చేసేవాడు. తల్లి "ముందు నువ్వు ఈ అల్లరి మాని బుద్ధిగా ఉంటే శివుడే స్వయంగా నీ దగ్గరికి వచ్చి నీవు కోరినది ఇస్తాడు" అనేది.

## అరటితోటల్లో హనుమంతుడు

భగవంతుడి మీద ఎక్కువ ధ్యాస ఉండే నరేన్‌కి రామాయణ మహాభారతాలంటే అత్యంత ప్రియం. ఎవ్వరింటిలోనైనా గానీ, పందిర్లలో గానీ పురాణకాలక్షేపం జరుగుతుందని తెలిస్తే ముందుగా హాజరయి ముందు వరుసలో కూర్చుని మరీ ఆలకించేవాడు.

ఒకసారి ఒక హరికథలో రామాయణంలో హనుమంతుని పాత్ర గురించి వివరించుతూ చిరంజీవి అయిన హనుమంతుడు ఎక్కువగా అరటితోటల్లో నివసిస్తూ ఉంటాడని విన్నాడు. సహజంగానే పిల్లలకి రామాయణంలో హనుమంతుడి పాత్ర మంచి ఉత్సాహాన్ని ఇస్తుంది.

స్వయంగా హనుమంతుడే అరటితోటల్లో ఉంటాడని తెలిసేసరికి ఏ విధంగానైనా స్వామిని చూడాలనే కాంక్షతో తల్లిదండ్రులకు తెలియకుండా ఒక రాత్రంతా దగ్గరలో ఉన్న అరటితోటలో ఉండి హనుమ దర్శనానికై ఎదురుచూసాడు.

తల్లిదండ్రులు కంగారుగా అన్ని చోట్ల వెదకగా అరటితోటలో కనిపించాడు. తల్లి అతడిని దగ్గరకు తీసుకుని ఎందుకిక్కడున్నావని అడిగితే హనుమంతుని సందర్శనానికి అని సమాధానమిచ్చాడు. ఖంగుతిన్న ఆ తల్లి నెమ్మదిగా అతడిని దగ్గరకు తీసుకుని "శ్రీరాముడి ఆజ్ఞతో కార్యార్థియై ఎచటకో వెళ్ళి ఉంటాడు. మరొకసారి నీకు తప్పక దర్శనమిస్తాడు"అని బుజ్జగించింది.

## నరేన్ విద్యాభ్యాసం

ఈ విధంగా సాగుతున్న నరేన్ జీవితం ప్రైమరీ స్కూలులోకి ప్రవేశించింది. ఏకసంథాగ్రాహి అయిన నరేంద్రుడు సంస్కృత భాషను అత్యంత సులభంగా వంట బట్టించుకున్నాడు. రామాయణ మహాభారతమునందలి శ్లోకాలను తానే స్వయంగా చదువుతూ స్నేహితులకు వివరించేవాడు.

ఎంతటి గుణవంతుడికైనా ఒక్కొక్కసారి తప్పటడుగు తప్పదు. అనుకోకుండా జరిగిన చెడుసహవాసాల వలన కొన్ని చెడు మాటలు మాట్లాడటం నేర్చుకున్నాడు. ఒకసారి అతడి నోటి నుండి చెడుమాటలు విన్న నరేన్ తండ్రి విపరీతమైన అసహనానికి గురి అయ్యాడు.

వెంటనే నరేన్‌ని బడి మాన్పించి ఒక ట్యూషన్ టీచర్‌ని పెట్టి ఇంట్లోనే విద్యాభ్యాసాన్ని సాగించమని చెప్పారు. నరేన్‌కి తోడుగా కొంతమంది విద్యార్థులను కూడా ఉండనిచ్చారు.

## గురువునే ఆశ్చర్యపరచిన నరేంద్రుడు

ఏకాసంథాగ్రాహి అయిన నరేంద్రుడు ఒక్కొక్కసారి నిశ్చలంగా కూర్చుని ధ్యానంలోకి వెళ్ళిపోయేవాడు. ఇదంతా గమనిస్తున్న గురువు కొన్నిసార్లు మిన్నుకుండిపోయారు. కానీ ఒకరోజు ఎంతో ముఖ్యమైన పాఠాన్ని చెబుతున్నప్పుడు నరేంద్రుడు ధ్యానంలోకి వెళ్ళడం చూసి విపరీతమైన అసహనంతో అతడి వద్దకు వచ్చి గట్టిగా పట్టుకుని “ఏం చేస్తున్నావు నువ్వు? నేనిక్కడ ముఖ్యమైన పాఠ్యాంశాన్ని చెబుతుంటే” అని గద్దించాడు.

“నాకంతా అర్థం అయింది” అని సమాధానం ఇచ్చాడు నరేంద్రుడు. ‘అయితే నేను చెప్పిన పాఠాన్ని అప్పగించు’ అన్నాడు. అంతే నరేంద్రుడు గురువునే ఆశ్చర్యపరిచేలా పాఠం మొత్తం చక్కగా ఒప్పగించాడు.

ఇంకొకసారి గురువు వద్దకు సంస్కృతంలో రామాయణాన్ని గానం చేసే కొందరు గాయకులు వచ్చారు. బాలుర సమక్షంలో వారిని రామాయణ గానం చేయమని కోరారు. నరేన్‌కి బంధువైన ఒక ముసలి తాత ద్వారా నరేన్ సంస్కృతంలో మంచి ప్రావీణ్యం సంపాదించుకున్నాడు.

భారతీయ విజ్ఞానాన్ని పునరుజ్జీవింప చేయటానికి సంస్కృత భాష పాత్ర ఎక్కువగా ఉందని గ్రహించే నరేన్ బంధువు అతడి అమరకోశాన్ని చాలావరకు కంఠస్థం చేయించాడు. అటువంటి అమరశ్లోకాలనే వంట పట్టించుకున్న నరేన్ గురువు వద్దకు వచ్చిన గాయకులు రామాయణాన్ని గానం చేస్తుండగా వారి కథనంలో తప్పులను సరిదిద్ది గురువుని మరింత ఆశ్చర్యచకితులని చేశాడు.

## బాల్యంలో భావౌన్నిత్యం

1869 సంవత్సరములో నరేంద్రుడి పినతాత కాశీప్రసాద దత్తు గారికి ఆరోగ్యం క్షీణించింది. తనకు మరణం అతి సమీపంలో ఉన్నదని గ్రహించిన ఆయన కుటుంబ సభ్యులందరిని తన చెంతనే ఉండమన్నాడు. పిల్లలలో ఎవ్వరినైనా భగవత్కథాశ్రవణం చేయమని కోరారు. తాత ఆ విధంగా ఉండేసరికి చూస్తున్న పిల్లలు మరింత బెంబేలుపడి ఎవ్వరికి వారే శ్రవణం చేయమని చెప్పారు. కానీ అంత వ్యథలోనూ నరేంద్రుడు ధైర్యంగా గుండెను దిటవు చేసుకుని భాగవత్కథాశ్రవణం చేయటానికి ముందుకు వచ్చాడు.





భక్తిజ్ఞానాలు అనే పక్షాలతో జీవుడు ఆత్మైక్యభావానికి ఎలా చేరతాడో సూచించే గురుడుని ఊర్ధ్వగమన ఘట్టాన్ని సమయానికి తగు విధంగా ఎంచుకుని తాతగారి ఎదుట అత్యంత శ్రవణానందకరంగా చదివాడు. కాశీప్రసాద దత్తు గారితో సహా అందరూ అభిమానంతో నరేంద్రుని చూచారు. తాతగారు నరేంద్రుణ్ణి దగ్గరకు పిలిచి “అత్యంత మహోన్నతమైన భవిషత్తు నీకు ఉందని” ఆశీర్వదించి పరమపదించారు.

## నరేంద్రుని గుండె ధైర్యం

దైవభక్తీ, విద్యతో పాటు నరేంద్రుడికి ధైర్యసాహసాలు కూడా అలవడి ఉన్నాయి. దానికి ఉదాహరణగా ఎన్నో సంఘటనలు అతడి జీవితంలో చోటు చేసుకున్నా యి. ఒకసారి శివుని విగ్రహం ముందు కూర్చుని ధ్యానంలో నిమగ్నమై ఉన్నాడు. అతడు కూర్చుని ఉన్న స్థలం నది ఒడ్డు. నరేంద్రుని చుట్టూ పిల్లలు కూడా ఉన్నారు. అంతలో వారి వద్దకు ఒక పాము వచ్చింది.

దాన్ని చూసిన పిల్లలంతా అరుస్తూ చెల్లాచెదురై నరేంద్రుని కూడా లేచి పరిగెత్తమని అరవసాగారు. పాము మాత్రం కదలకుండా కూర్చుని ఉన్న నరేన్ చుట్టూ ఉండిపోయింది. ఎటువంటి కదలిక లేని నరేంద్రుని గూర్చి పిల్లల్లో ఆందోళన మొదలైంది. ఒకరు అతడి తల్లి వద్దకు వెళ్ళి విషయాన్ని చెప్పారు.

భువనేశ్వరీదేవి పరుగున నరేంద్రుడు ఉన్న స్థలానికి వచ్చింది. పాము కనపడలేదు. నరేంద్రుడు మాత్రం ధ్యానంలోనే ఉండిపోయాడు. భువనేశ్వరీదేవి నెమ్మదిగా అతడిని సమీపించి చెవిలో శివనామాన్ని మూడుమార్లు స్మరించగా నరేంద్రుడు కళ్ళు తెరిచాడు. ఎదురుగా చెమటలు పట్టి గట్టిగా ఊపిరిని పీలుస్తున్న తల్లిని చూశాడు.

తల్లి విషయాన్ని వివరించి పాము వలన అపాయం ఏమైనా కలిగిందా అని అడుగగా అతడు ఎటువంటి అనర్థం జరగలేదని చెప్పి అసలు తాను పామునే చూడలేదని చెప్పాడు. పాము తనని అంటిపెట్టుకుని ఉన్నదని నరేంద్రునికి తెలియటంతో చెప్పలేని ఆనందానుభూతిని పొందాడు. అతని తల్లి మాత్రం కుమారుడి వైఖరికి ఆనందంతో పాటు ఆశ్చర్యాన్ని పొందింది.

## శాంతి పట్ల నరేంద్రుని మనోభావములు

బాలనరేంద్రుడు తోటి బాలురతో కలసి ఆడుకునే ఆటలలో ‘రాజుల’ ఆటలు ఉండేయి. ఆ ఆటలు ఆడుతున్నప్పుడు నరేంద్రుడు రాజుపదవిని అలంకరించేవాడు. మిగతా వారు సేనాధిపతులు, సామంతులు, మంత్రులుగా

ఉండేవారు. అన్యాయం. అరాచకత్వం రాజ్యంలో ఏ మాత్రం వినిపించడానికి కూడా నరేంద్రుడు ఇష్టపడేవాడు కాదు. "రాజాధిరాజా! ధర్మపరిపాలకా!" అనే సంబోధనలతో నరేంద్రుని అంతా పిలిచేవారు.

తన రాజ్యంలో అంతా సంతోషంగా ఉండాలని, వారి క్షేమము తనకు ముఖ్యమని చెప్పేవాడు. ఇంకా పరుగు పందాలు, కుస్తీపోటీలు వంటి ఆటలలో ముందుండే వాడు. ఆటల్లో ఏదన్నా తగవు వస్తే నరేంద్రునినే న్యాయం చెప్పమని అంతా కోరేవారు. నరేంద్రుడు ఎల్లప్పుడు ఇరుపక్షాలను శాంతిపరిచేవాడు.

## కులమత వివక్షత లేని నరేన్

నరేంద్రుడి బాల్యంలో న్యాయవాదియైన తండ్రి దగ్గరకు వచ్చే అనేకమందిని గమనిస్తుండేవాడు. అక్కడి వారి వారి వర్ణాల కనుగుణంగా వారి మర్యాదకొరకు 'హుక్కాలు' అమర్చబడుతుండేవి. ఒకసారి ఒక మహమ్మదీయుడు 'అల్లాహో అక్బరు" అంటూ హుక్కీ పడుతున్నాడు.

నరేంద్రుడు హఠాత్తుగా అతని దగ్గరకు వెళ్ళి అతడి హుక్కీను పీల్చాడు. ఆ మహామ్మదీయుడు ఎక్కువగా నరేంద్రుడుని దగ్గరికి దీయటం వలన నరేంద్రుడు అతడిని 'మామా' అని సంబోధిస్తూ చనువుగా ఉండేవాడు.

ఇది గమనించిన నరేంద్రుడి తండ్రి నరేంద్రుని మందలించగా నరేంద్రుడు "జాతి, మత బేధాలు నాకు ఇష్టం ఉండదు. నా దృష్టిలో అందరూ సమానమే" అని చెప్పాడు. మహమ్మదీయుని వద్ద మిఠాయిను తింటూన్న నరేన్‌ను పూర్వాచార పరాయణులంతా వ్యతిరేకిస్తూ వున్నా విశ్వనాథుడు ఎటువంటి భావం లేకుండా చిరునవ్వే సమాధానంగా అందరికి అందించేవాడు.

## నరేంద్రుడి గాయం

ముద్దుగా ఉండే నరేన్ చేసే ప్రతి పనిలో ఏదో ఒక అద్భుతం ఉండేది. ఒకసారి నరేన్ తోటి స్నేహితులతో ఆడుకొంటున్న సమయంలో పొరపాటుగా దేవాలయం మెట్లపై నుంచి జారి పడిపోయాడు. ఆ పడటంలో అతడి తల రాయికి తగిలి దెబ్బ తగిలింది. కాలక్రమేణా ఆ దెబ్బ మానినా మచ్చ మాత్రం మిగిలిపోయింది. ఈ మచ్చ కుడికంటిపై భాగంలో ఏర్పడింది.

తర్వాత కాలంలో నరేంద్రుడికి గురువైన శ్రీరామకృష్ణులు ఆ మచ్చను చూసి "నరేంద్రుడి శక్తిసామర్థ్యాలు ఆ ప్రమాదంలో కొంత బలహీనపడ్డాయి. అదే గనుక జరగకపోతే నరేంద్రుడి వల్ల లోకం మరింత లోతుగా ప్రభావితం అయి ఉండేది" అని వ్యాఖ్యానించారు.





## ఆస్థి గురించి తండ్రిని ప్రశ్నించిన నరేంద్రుడు

నరేంద్రుడికి బీదల పట్ల జాలి ఉండేది. కానీ బద్ధకస్థులూ, అడుక్కునే వారంటే ఇష్టం ఉండేది కాదు. కానీ తండ్రి అటువంటి వారికి నీడను కల్పించడం ఆర్థికంగా సహాయం చేయటం చూసి ఆగ్రహంతో తండ్రిని "వారికి డబ్బిచ్చి మీరు వారిని మరింతగా పాడు చేస్తున్నారు" అని అనేవాడు. అంతట విశ్వనాథుడు "నరేంద్రా నిజమే. కానీ వీరంతా రకరకాల సమస్యల వల్ల ఈ స్థితికి వచ్చారు. వారికి కొంచెం నీడను కల్పించితే వారెంతో ఆనందాన్ని పొందుతారు. దాని వల్ల మనం నష్టపోయేది ఏమీ లేదు కదా" అన్నాడు.

అంతట నరేంద్రుడు "మీరు కష్టపడి సంపాదించిన సంపదను నాకు ఏ మాత్రం దాయకుండా ఈ విధంగా ఖర్చు చేయటం ఎంత వరకు న్యాయం" అని ప్రశ్నించాడు. వెంటనే విశ్వనాథుడు నరేంద్రుడికి అద్దం ముందు నిలబెట్టి "నాయనా! ఈ అద్దంలో కనిపించే ఈ శరీరాన్ని మాత్రమే నేను నీకు ఇచ్చే సంపద. నీవు నీ కాళ్ళ మీదే నిలబడవలసి ఉంది. నువ్వు ఏ సమయంలోనూ ఇతరుల నుంచి సహాయాన్ని ఆర్జించకూడదు" అని చెప్పారు..

తండ్రి మాటల్లోని సత్యాన్నీ, దృక్పథాన్నీ గమనించిన నరేంద్రుడు తన ఆలోచనలకి తానే సిగ్గుపడి పశ్చాత్తాపబడ్డాడు. తర్వాత ఏనాడు తండ్రిని ఏ విధమైన ప్రశ్నలూ వేయలేదు.

## ఆంగ్లం పట్ల నరేన్ అభిప్రాయం

1870 వ సం॥లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ పాఠశాలలో ప్రారంభమైన అతడి చదువు వివిధ మలుపులు తిరిగింది. సంస్కృతంలో అత్యంత ప్రావీణ్యం సాధించాడు. ఏకసంథాగ్రాహి అయిన నరేన్ ఆటపాటల్లో కూడా ముందుండేవాడు. గురువులు అతడి పట్ల ఉన్న కోపాన్ని పలు సంఘటనల ద్వారా అభిమానంగా మలచుకున్నారు కూడా. అన్నింటా ముందుండే నరేంద్రుడు ఆంగ్లాన్ని అభ్యసించటం పట్ల వ్యతిరేకి. పరాయిభాషను నేర్చుకోవటానికి ఇష్టపడలేదు.

కానీ తల్లీ, తండ్రీ, ఉపాధ్యాయుల నిర్బంధంపై చివరికి అంగీకరించాడు. ఇవ్వవలసిన సందేశం ఉండటం వల్లనేమో లేకపోతే స్వాతంత్ర్యానికి ప్రాధాన్యతనిచ్చే నరేన్ ఒకరి బలవంతంపై ఏ పని చేయడుకదా. అంతా ఈశ్వరప్రేరితం అని భావించవచ్చు. అప్పుడు నేర్చుకున్న ఆంగ్లం, ఆంగ్ల భాషలో రచించిన వివేకానంద వచనామృతం నూతన శకాన్ని నిర్మించింది.

## సత్యం పలికితే ధైర్యం

నరేంద్రుడి ఉపాధ్యాయులలో ఒకరు దుష్ట స్వభావంతో ఉండేవాడు. ఒకనాడు ఏదో విషయమై చర్చ. ఎప్పటి నుండో నరేంద్రునిపై కోపాన్ని మనస్సులో ఉంచుకున్న ఆ ఉపాధ్యాయుడు ఓ నిందని నరేంద్రుడిపై వేశాడు. అతడి చెవిపట్టుకుని ఆ తప్పుని అంగీకరించాలని గద్దించసాగాడు. దానికి నరేంద్రుడు ససేమిరా ఒప్పుకోలేదు. ఆ ఉపాధ్యాయుడు రక్తం వచ్చే విధంగా చెవిని మెలిపెట్టసాగాడు. నరేంద్రుడిని నాయకుడిగా, వీరుడిగా ఇష్టపడే తోటిబాలురు ఈ సంఘటనలతో చేష్టలుడిగి పోయారు. అంతలో నరేంద్రుడు హఠాత్తుగా ఉపాధ్యాయుని చేయి గట్టిగా పట్టుకుని నువ్వెవరివి నన్ను కొట్టడానికి అని ధైర్యంగా ప్రశ్నించి తాను ఈ పాఠశాలలోనే చదవనని వెళ్ళబోయాడు. అంతలో అదృష్టవశాత్తు పాఠశాల సంస్థాపకుడైన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అక్కడికి వచ్చారు. జరిగినదంతా విని ఉపాధ్యాయుణ్ణి మందలించి పంపివేశారు.

నరేంద్రుడినితో "ఉపాధ్యాయుడ్ని అంత ధైర్యంగా ఎలా ఎదురించావు" అని అడుగగా "నేనేం తప్పుచేయలేదు సత్యాన్ని పలికాను. అటువంటప్పుడు ఎదిరించడానికి అధైర్యం ఎందుకు" అని సమాధానమిచ్చాడు. తనలో దోషం లేకపోతే భయం లేకుండా న్యాయం కొరకు హరిహరబ్రహ్మాదులు అడ్డుపడినా ఎదురించమని తన తల్లి చెప్పిందని స్నేహితులకు చెప్పాడు. తన మానసికాభ్యుదయానికి తన తల్లే కారణమని మనసారా భావించుతానని పేర్కొన్నాడు వివేకానందుడు.

## మూఢవిశ్వాసం పట్ల విముఖత

మూఢవిశ్వాసముల పట్ల కూడా నరేన్ వ్యతిరేకి. దెయ్యాలూ, భూతాలంటే అస్సలు నమ్మేవాడు కాదు. ఒకసారి స్నేహితుని ఇంట్లో ఆడుకుంటున్నారు. అప్పుడు నరేన్ అక్కడే ఉన్న చంపకవృక్షాన్ని ఎక్కి కొమ్మలపై ఊగుతూ ఆడుకొంటుంటే అక్కడే ఉన్న స్నేహితుడి తాత చెట్టు పూలూ పండ్లూ రాలిపోతాయనీ నరేంద్రుడు కూడా పడిపోతాడనే ఉద్దేశ్యంతో నరేంద్రునితో "ఒరేయ్ బాబూ! ఆ ఊగటం ఆపు. లేకపోతే చెట్టు మీద ఉండే బ్రహ్మరాక్షసి నిద్రలేచి నిన్ను పట్టుకుంటుంది" అని అరిచాడు.

స్నేహితుడు భయంతో వృక్షము దిగిపోతుంటే నరేంద్రుడు "నిద్రలేచేదే అయితే ఈ పాటికే లేచి ఉండి మనల్ని తినివేసేది కదా" అని అన్నాడు. అంతటి విశ్లేషణ ఆత్మవిశ్వాసమున్న మహనీయుడు వివేకానందుడు.





## తాతను మెప్పించిన నరేంద్రుడు

నరేంద్రుడు మాటలు విన్న ఆ స్నేహితుడి తాత నెమ్మదిగా మంచి మాటలతో వారిని చెట్టు క్రిందకి దింపి "ఏరా నాయనా? నీవు ఈ విధంగానే ఆటలతో కాలక్షేపం చేస్తావా? చదివే పని ఉందా?" అని మందలించాడు. నరేంద్రుడు వెంటనే తాత మాటలకి "నేను రెండూ చేస్తాను. ఆటలూ ఇష్టమే, చదువూ ఇష్టమే" అని జవాబిచ్చాడు. "మరి నీవు ఎక్కువ సేపు ఆడుకుంటే చదువు వంటబడుతుందా" అనగా "నాకన్నీ కంఠతమే" అన్నాడు.

తాతకు ఆతడి సమాధానం కొద్దిగా అసహనాన్ని తెప్పించింది. వెంటనే తన మనవడి పుస్తకాలు తెప్పించి మొదటనుండి చివరి వరకు ప్రశ్నలు వేశాడు. ఎక్కడా తప్పుపోకుండా జవాబులిచ్చిన నరేన్‌ని చూసి నరేంద్రుని మనసారా ఆశీర్వదించాడు.

## తార్కిక జ్ఞానం ఉన్న నరేంద్రుడు

వృత్తిపరంగా నరేంద్రుడి తండ్రి విశ్వనాథుడు కలకత్తా నుండి మధ్య పరగణాలలోని రాయపూర్‌కు వెళ్ళవలసి వచ్చింది. ఆ సమయంలో విశ్వనాథుడి వద్దకు ఎక్కువగా పండితులు వచ్చేవారు. విశ్వనాథుడి గూర్చి నిరీక్షించే సమయములో వారిలో వారు ప్రసంగాలూ, చర్చలూ చేసేవారు. ఒకసారి వారు జరుపుతున్న చర్చల పట్ల తన భావాలను వ్యక్తం చేశాడు.

అది ఆరంభం ఎంతటి వృద్ధులతోనయినా చర్చలు జరిపి వారిని ఒప్పించేవాడు. ఒకనాడు దీర్ఘ చర్చ వంగభాషాప్రవీణుడైన ఒక వృద్ధునితో జరిగింది. గ్రంథాలపట్ల, శాస్త్రముల పట్ల అవగాహనతో ఉపన్యసించి ఆ ముదుసలిని సైతం మెప్పించాడు. నరేంద్రుడి తార్కిక జ్ఞానానికి ముగ్ధుడైన ఆ వృద్ధుడు "నీ కీర్తి జగద్వ్యాపితమయ్యే సమయము ఎంతో దగ్గరిలో ఉంది" అంటూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

## దేహదారుఢ్యం కొరకు వ్యాయామం

నరేంద్రుడు తన బుద్ధిబలానికి దేహబలం కూడా ఉండవలసిందే అని భావించేవాడు. అందుకునే ఒక వ్యాయామమండలిని స్థాపించాడు. నిత్యం తాను వ్యాయామసాధనలు చేస్తూ స్నేహితులకీ, తెలిసినవారికీ వ్యాయామం చేయమని, వ్యాయామం చేయటం వలన వచ్చే ఉపయోగాలు వివరించేవాడు. కత్తిసాము, గారడీ, కుస్తీ, మొదలైన విద్యలలో ఆరితేరాడు. బలప్రదర్శనలలో,

వ్యాయామప్రదర్శనలలో, మల్లయుద్ధం వంటి వాటిలో ఉత్తమ బహుమానాల్ని అందుకున్నాడు.

## కార్యసాధనలో చతురత

ఒకసారి నరేంద్రుడి మిత్రులు ఆంగ్లేయుల నౌకను చూడాలని అనుకున్నారు. నౌకను వీక్షించాలంటే అక్కడ పనిచేసే ఉద్యోగి వద్ద అనుమతి పత్రం కావాలని తెలుసుకున్నారు. ఈ విషయం నరేంద్రుడితో చెప్పి అనుమతిపత్రాన్ని తీసుకురావలసినదిగా కోరారు. నరేంద్రుడు ఆ ఉద్యోగిని కలుసుకోవాలని వారి కార్యాలయానికి వెళ్ళగా అక్కడ ఉన్న ద్వారపాలకుడు "లోపలికి వెళ్ళటానికి వీల్లేదు" అని అడ్డగించాడు.

అంతట నరేంద్రుడు ఒక నిముషం ఆలోచించి నెమ్మదిగా అక్కడి నుంచి వెనక్కి వచ్చి మేడ మెట్లు ఎక్కి సంబంధిత ఉద్యోగి వద్దకు వెళ్ళి నౌకా ప్రవేశపత్రముపై సంతకము పెట్టించుకుని ద్వారపాలకుడు ఉన్న ద్వారం గుండా బయటికి వచ్చాడు. నరేంద్రుని చూచిన ద్వారపాలకుడు "నీవు ఎప్పుడు, ఎలా లోపలికి వెళ్ళావు?" అని అడగగా నరేంద్రుడు "నాకు మ్యాజిక్ తెలుసు, మ్యాజిక్ చేసి లోపలికి వెళ్ళి పని ముగించుకున్నాను" అని నోరు తెరుచుకుని చూస్తున్న ద్వారపాలకుని చూస్తూ చిరునవ్వుతో వెళ్ళిపోయాడు.

## వాక్చతురత కలిగిన నరేంద్రుడు

మాట్లాడటము ఎవ్వరైనా మాట్లాడతారు. కానీ సందర్భోచితంగా మాటకు మాట ధీటుగా చెప్పగల వాక్చతురతను మనము నరేంద్రునిలో మెండుగా చూడవచ్చు. ఒకసారి క్రైస్తవ ప్రబోధకుడు హిందువుల విగ్రహారాధనను గూర్చి వ్యంగ్యంగా నిరసిస్తూ ప్రసంగాన్ని ఇస్తున్నాడు. చదువులేనివారు, చిన్న పిల్లలు ఇతడి ప్రసంగాన్ని వింటున్నారు. ఆయన ప్రసంగం మితిమీరి గీతను దాటింది.

అతను శ్రోతలతో "మీరు ఆరాధించే విగ్రహాన్ని నా చేతికర్రతో పూజిస్తే ఏం జరుగుతుంది" అన్నాడు. అప్పుడే అటుగా నరేంద్రుడు కళాశాల నుండి తన స్నేహితులతో ఇంటికి వెళుతున్నాడు. క్రైస్తవ ప్రబోధకుడు వేసిన అనుచితమైన ప్రశ్నకు ఏమి సమాధానం చెప్పాలో తెలియని శ్రోతలు మిన్నకుండిపోయారు. ఇదంతా గమనించిన నరేంద్రుడు సభాస్థలం వద్దకు వచ్చి "అయ్యా! మీరు చెప్పేదానికి సమాధానాన్ని ఆశించే ముందు మీరు నా ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసినదిగా కోరుతున్నాను" అన్నాడు. "నీ దేవుణ్ణి నేను దూషిస్తే ఏమి చేస్తావు" అన్నాడు.





అందుకు ఆ మతప్రబోధకుడు టక్కున "నీ మరణానంతరం నరకాగ్నిలో వుండగలవు" అని కోపంగా అన్నాడు. "అయితే మా విగ్రహాన్ని దూషిస్తున్న నీవు మరణించినప్పుడు మా విగ్రహము నిన్నూ అదే విధంగా చేస్తుంది" అన్నాడు నరేంద్రుడు. ఆ ప్రబోధకుడు పరమతాలను గౌరవించాలని తెలుసుకొని మారుమాట్లాడక తలవంచుకుని వెడలిపోయాడు.

## సంగీతంలో ప్రావీణ్యం

ఎన్నో విషయాలలో ఘటికుడైన నరేంద్రుడు, కళలపట్ల కూడా తన ప్రతిభను చూపాడు. ఇంటివద్దనే ఒక సంగీత విద్వాంసుని వద్ద సంగీతాన్ని అభ్యసించి ప్రవీణుడయ్యాడు. సంగీతంతో పాటు హార్మోనియం, ఫిడేలు వంటి సంగీత వాయిద్యాల పట్ల కూడా ప్రావీణ్యం సంపాదించాడు. అతని కంఠంలో గాంభీర్యంతో పాటు గానకౌశలం కూడా చేరటంతో కంఠం ఎత్తి గానం చేయగానే శ్రోతలు మంత్ర ముగ్ధులయ్యేవారు. ఎక్కువగా ఖాళీ సమయంలోనూ ఏదన్నా పని చేస్తూ కూడా నరేంద్రుడు పాడుతూ ఉండేవాడు.

## ఇంగ్లీషులో ప్రావీణ్యం

నరేంద్రుడు మెట్రిక్యులేషన్‌ను మొదట తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ సమయంలో అతడి వయస్సు15 సంవత్సరాలు. మెట్రిక్‌ను కలకత్తాలో పూర్తి చేశాడు. ఈ సమయంలోనే నరేంద్రుడు ఇంగ్లీషులో అనర్గళంగా స్పీచ్ ఇవ్వగలిగేవాడు. ఒక ఫంక్షన్‌లో ఇంగ్లీషులో అతడు ఇచ్చిన ప్రసంగానికి, అతడు ఉపాధ్యాయుడైన సురేంద్రనాథ్ వంద్యోపాధ్యాయి అతన్ని వెన్నుతట్టి అభినందించారు.

ఇన్ని ఘనతలున్న నరేంద్రుడు చాలా సాదాసీదాగా ఉండవాడు. ఎక్కువగా సాహిత్యము, చరిత్రల పుస్తకాలను చదువుతూ ఉండేవాడు. పాశ్చాత్య దేశ చరిత్రలను వంట పట్టించుకోవటము వల్ల పాశ్చాత్య తర్కశాస్త్రంలోను, తత్త్వశాస్త్రంలోను అపార పాండిత్యాన్ని గడించాడు. అతడు యువతకు కొత్త వికాసాన్ని, స్ఫూర్తిని కలిగించాడు.

## నరేంద్రుడి కాలేజి జీవితం

బాల్యం అంతా ఎంతో ఉల్లాసంగా, విజ్ఞానదాయకంగా, వినోదదాయకంగా గడిపిన నరేంద్రుడు, 1880 లో కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రవేశించాడు. ఏకసంథాగ్రాహి అయిన నరేంద్రుడు పాఠ్యపుస్తకాలను పరీక్షలకి రెండు మూడు నెలలు ముందు చదివేవాడు.

మిగతా సమయమంతా విజ్ఞానాభివృద్ధికొరకు వినియోగించుకొనేవాడు. మొదటి చివరి లైన్లు చదివి ఆ పేరాలోని విషయాన్ని అర్థం చేసుకోగలిగేవాడు. పుస్తకం మొత్తంలో అక్కడక్కడ చదివి పూర్తి చేసాడు. ఈ విధంగా చేసినా ఆ పుస్తకంలో రచయిత తెలిపిన భావం తనకి సంపూర్ణంగా స్పష్టత కలిగి అర్థమయ్యిందని తెలిపేవాడు.

గొప్ప పండితులనూ, స్కాలర్స్‌నూ కలిసి వివిధ విషయాలపై చర్యలు జరిపేవాడు. ఏ విషయంలో చర్చకయినా అవలీలగా సమాధానాలు తెలిపేవాడు. ఆ వయసులో వారికి ఎంతో కష్టం, అసాధ్యం అనే విషయాలు నరేంద్రుడికి అత్యంత తేలికయినవిగా ఉండేవి. మరి ఇటువంటి నిరుపమానమైన ధీశక్తి ఎవ్వరిని ఆకర్షించకుండా ఉంటుంది. వీటన్నింటికి అతడు స్వయంగా పెంపొందించుకున్న ఆలోచనా విధానం, జ్ఞాపకశక్తి ముఖ్య పాత్ర వహిస్తాయి. ఆ వయసులోనే వేదాలు, ఉపనిషత్తులతో పాటు సోక్రటిస్, అరిస్టాటిల్ సిద్ధాంతాల పట్ల అవగాహనను పొందాడు.

## హేస్టీ అభిప్రాయం

నరేంద్రుని ప్రతిభను చూచిన ఉపాధ్యాయులు నరేంద్రుని పట్ల విపరీతమైన అభిమానాన్ని పెంచుకున్నారు. ఒకానొక సందర్భంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడైన హేస్టీ నరేంద్రుని గూర్చి ఈ విధంగా అన్నాడు. “నరేంద్రుని వంటి అద్భుత ప్రతిభాశాలిని నేనెన్నడూ నా సర్వీసులో చూసి ఉండలేదు.

గ్రహణశక్తితో పాటు ధారణాశక్తిని కలిగిన ఇంతటి ధీసంపన్నుణ్ణి విదేశాలలోను చూడలేదు. తర్క, తత్త్వశాస్త్రాలలో ఈతడి ప్రతిభ లోకం మొత్తం గుర్తించే రోజులు తప్పక వస్తాయి” అన్నాడు.

ఈ హేస్టీనే ప్రప్రథమంలో శ్రీరామకృష్ణపరమహంస వంటి గురువును గూర్చి నరేంద్రునికి తెలిపాడు. ఆ గురువును సేవించియే నరేంద్రుడు వివేకానందుడయ్యాడు.

## నరేన్ పట్ల స్నేహితుల అభిప్రాయం

నరేంద్రుడిలో మానసికంగా ఏదో వ్యథ కలుగుతుండేది. ఒక్కొక్కసారి అతి తీవ్రంగా ఉండేది. ఆ సమయంలో అతడు స్నేహితులతో అనేక విషయాలను గూర్చి చర్చకు దిగి విమర్శించేవాడు. ఆత్మమోక్షసాక్షాత్కారం లభించని అతడిలో మానసిక పరివర్తన కలగటానికి అది ప్రారంభంగా ఉండేది. తినటం, నిద్రించటం వంటి వాటి వలన వచ్చే సౌఖ్యం జీవితం యొక్క పరమావధి కాదని అతడు





బాల్యంలోనే గ్రహించాడు. కానీ అసలైన ఆత్మజ్ఞానాన్ని అతడు పొందలేదు. అందువల్లనే అతడి ఆలోచనా విధానం పూర్తిగా వేరుగా ఉండేది. కానీ తన మనసులో అంతర్మథనం ఎవ్వరికి తెలియనిచ్చేవాడు కాదు.

ఎల్లప్పుడు ఉత్సాహంగా ఉంటూ అనేక విషయాలను గూర్చి స్నేహితులకి వర్ణించి చెప్పేవాడు. మృదుగంభీర కంఠంతో ఉండే అతని వచనాలు స్నేహితులకి అత్యంత ప్రియములై యుండేవి. అతడు చెబుతుంటే ఎంతసేపైనా వినాలనిపిస్తుందని స్నేహితులంతా అభిప్రాయపడేవారు.

## నరేంద్రుడి స్వతంత్ర భావాలు

నరేంద్రుని ప్రవర్తనలో ఎక్కువగా స్వతంత్ర భావాలు కనిపించేవి. అధైర్యం అంటే నరేంద్రుడు ఇష్టపడేవాడు కాదు. అతడు నెపోలియన్ చక్రవర్తి ధైర్యసాహసాల్ని అభినందించేవాడు. నాయకుడనేవాడు ఎంత ధైర్యసాహసాలతో ఉంటే ప్రజలు అంత సుఖంగా ఉంటారని చెప్పేవాడు. పరాధీనంలో ఉన్న భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందటానికి నరేంద్రుని సందేశాలు ఆచరణలో ఉంచటం ముఖ్యం అని పెద్దలు విశ్వసించేవారు. నిర్మలమైన అతడి మనోభావాలు, ప్రేమపూరితమైన అతడి నడవడిక అందర్నీ ఆకర్షించేవి.

పరోపకారానికి ఎక్కువగా ఇష్టం చూపేవాడు. ఎవరైనా ఆవేశపడినా తాను ఆవేశపడకుండా వారిని శాంతింప చేసేవాడు. ప్రతి ఒక్కరు ఆత్మానందం పొందటం ముఖ్యం అని చెప్పేవాడు. దేవుడి పట్ల విపరీతమయిన ఉత్సుకతను కనబరిచేవాడు. దినదిన ప్రవర్ధమానంగా అతడిలో దైవభక్తి అధికమవసాగింది.

## పరీక్షాసమయంలో నరేంద్రుడు

పరీక్షలకు రెండు మూడు నెలలు ముందుగా చదువును ఆరంభించే నరేంద్రుడు కొంచెం ఎక్కువగానే కష్టపడేవాడు. అహర్నిశలు చదవటం వలన ఒక్కొక్కసారి శిరోభారాన్ని పొందేవాడు. ఆహారం పట్ల నియమాన్ని కలిగి ఉండేవాడు. నిద్ర నుంచి దూరం కావటానికి అనేక మార్గాలను ఎంచుకునేవాడు. ‘విద్యాతురాణాం నసుఖం ననిద్రా’ అనే వాక్యాన్ని నమ్మిన నరేంద్రుడు దాన్ని అవలంబించేవాడు.

## మానసిక పరివర్తనమునకు మొదలు

చిన్నప్పటి నుండి దైవము పట్ల ప్రియత్వము ఉన్న నరేంద్రుడు దేవుడి దర్శనం కొరకు అనేకమార్లు ప్రయత్నించాడు. చదువుకుంటున్నా దేవుడు

ఎక్కడున్నాడు అనే ఆలోచన కలిగి ఉండేవాడు. ఎంతమందిని ప్రశ్నించినా సరయిన, తృప్తికరమైన సమాధానము అతడు పొందలేదు. ఒకసారి అనుకోకుండా నరేంద్రుడు కలకత్తాలో శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. రామకృష్ణుడి గూర్చి అతడి ప్రొఫెసర్ హేస్టీ చెప్పగా మొదటిసారి విన్నాడు. చూడటం అక్కడే ప్రథమం. ఆ సమయంలో కొన్ని పాటలను పాడాడు.

ఆ పాటలలో అతడి ఆత్మ ఐక్యమయినదా అన్నంత హృద్యమంగా ఉండటంతో రామకృష్ణుడు నరేంద్రుడి పట్ల అభిమానం చూపారు. అతడి గురించి హేస్టీ ఇంతకిత్రమే చెప్పటం వలన మరింత ప్రీతితో అతడిని సమీపించి "ఇంత ఆలస్యంగా నన్ను ఎందుకు కలుసుకున్నావు. నా మనస్సు ఈ రోజు ఎంతో ఆనందంగా తేలికగా, ఉంది" అంటూ తానే స్వయంగా పండ్లను నరేంద్రునికి ఇచ్చి ఆశీర్వదించారు.

## భగవాన్ శ్రీరామకృష్ణ

దక్షిణేశ్వరంలో కలిసిన శ్రీరామకృష్ణుల గూర్చి నరేంద్రుడు వివరంగా తెలుసుకున్నాడు. 1836, ఫిబ్రవరి 18 న జన్మించిన శ్రీ రామకృష్ణుడి జన్మస్థలం బెంగాల్ రాష్ట్రంలో హుగ్లీ జిల్లాలోని కామర్‌పుకార్ అనే చిన్న గ్రామం. ఎటువంటి విద్యను అభ్యసించలేదు. కోరికలతో నిండిన ప్రపంచానికి దూరంగా ఉన్నాడు. అతనికి శారదాదేవితో వివాహం జరిగింది. కానీ ఆమెను అతడు తాను ఆరాధించే కాళీమాత యొక్క అవతారముగా భావించాడు.

ఈయన దక్షిణేశ్వరం లోని రాణి రాస్మణి నిర్మించిన ఆలయ ఉద్యానవనములో చాలా సంవత్సరాలు నివసించారు. దైవత్వం కలిగిన ఆయన నివసించిన స్థలం మరింత పవిత్రము, పూజ్యనీయమైంది. రామకృష్ణుడు 'దైవం' గురించి తెలుసుకొనటమే కాక విశ్వపూజితురాలైన తల్లితో నిరంతరము సహవాసము కలిగి వుండేవారు. దైవత్వం నిండిన ఆ మూర్తి యొక్క జ్ఞానవంతమైన వాక్కులు ఎంతోమంది విద్యావంతులను ఆకర్షించాయి.

## బ్రహ్మసమాజ ఉపాసకుడు

శ్రీరామకృష్ణుని కలవకముందే నరేంద్రుడు రాజారామమోహన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజంలో ఉపాసకుడై ఉన్నాడు. ఉన్నతమైన, అభివృద్ధికరమైన భావనతో ఎంతో మంది యువకులను బ్రహ్మసమాజం ఆకర్షించి వుంది. భగవంతుడు నిరాకారుడని బ్రహ్మసమాజ అభిమతం. బ్రహ్మసమాజస్థుడయినా నరేంద్రుడు శుద్ధమయిన మనస్సుతో భగవంతుడిని ప్రార్థిస్తే ఆయన సాక్షాత్కారం





తప్పక ఉంటుందని భావించేవాడు. భగవత్సాక్షాత్కారం లేని జీవితం వ్యర్థం అని అభిప్రాయపడేవాడు. ఈ అభిప్రాయము చేతనే బ్రహ్మసమాజం అతడికి మనశ్శాంతిని కలిగించలేకపోయింది. తిరిగి భగవంతుని గూర్చి అన్వేషణ ఆరంభమైంది.

## సన్యాసాలోచనలతో నరేంద్రుడు

రత్నం వంటి నరేంద్రుడి దేహానికి యౌవనం సూర్యకిరణకాంతివలె తగలటంతో అతడి సుందర దేహం మరింత వికాసాన్ని పొందింది. కానీ అతడి మనస్సు తెలియని భావనతో సుస్పష్టం కావటం లేదు. ఒక్కొక్కసారి నిద్రిస్తున్న సమయంలో భిన్నములైన జీవనవిధానాలు గోచరించేవి.

ఒకవైపు అందమైన భార్యాబిడ్డలతో, సకలైశ్వర్యాలతో, విలాసవంతమైన, వైభవోపేతమైన, ఆనందకరమైన గృహస్థజీవన దృశ్యం కనిపిస్తుంటే మరొక వైపు అన్నింటిని త్యజించి లభించింది స్వీకరిస్తూ ప్రాప్తించిన తావులో నిద్రిస్తూ, సుఖదుఃఖాలకు అతీతంగా, పరమేశ్వరునికే మనసుని అర్పిస్తూ బ్రహ్మానందంతో మైమరిచిన శరీరుడై ఉన్న దృశ్యం కనిపించేది.

భిన్న దృక్పథాలతో ఉండే ఈ రెండు జీవన విధాలలో తాను అవలంబించ వలసిన జీవనశైలిని గూర్చి ప్రశ్న ఎదురయ్యేది. విసర్జించాల్సినది దేనిని? స్వీకరించాల్సినది దేనిని? అతడు ఎంత అంతర్మథనంతో ఉన్నా మనసు సన్యాస జీవన విధానం పట్లనే మొగ్గు చూపేది.

## గురు అన్వేషణ

ఏ జీవన విధానంలోనైనా తనకు ముఖ్యంగా కావలసింది భగవంతుడి సందర్శనం. ఆ సందర్శన మార్గాన్ని తెలుసుకోవడానికి ఎంతో మంది మాతాచార్యులను, సిద్ధులను దర్శించి, ప్రశ్నించినా సంతృప్తికరమైన సమాధానాన్ని పొందలేకపోయాడు. తన సంకల్పం నెరవేర్చే గురువు కొరకు అన్వేషించసాగాడు. ఆ అన్వేషణలో భాగంగా ఒకనాడు మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్ ఉత్తమ గణ్యుడని తెలిసి వారి వద్దకు వెళ్ళాడు. ఆయన ధ్యానాన్ని అధికం చెయ్యమని తెలిపాడు. చేసినా ఎటువంటి ఫలితం కనపడని నరేంద్రుడు తిరిగి అతడిని దర్శించాడు.

ఆ సమయంలో ఆ మహర్షి ధ్యానినిమగ్నుడై ఉన్నారు. భగవంతుని పట్ల శరీరమంతా పరితాపంతో ఉన్న నరేంద్రుడి కళ్ళు ఆ సమయంలో దివ్యతేజంతో ప్రకాశిస్తున్నాయి. మహర్షి కన్నులు తెరవటంతోనే నరేంద్రుడు కనిపించాడు.

మహర్షి, కన్నాముందే నరేంద్రుడు, "స్వామీ మీరు దేవుడ్ని గాంచినారా" అని ఆవేశపూరితంగా అడిగినాడు. అందుకు ఆ యోగి "నాయనా! నీవి యోగినేత్రాలు" అంటూ మౌనం వహించి అతడి ప్రశ్నకి 'లేదు' అనే సమాధానాన్ని ఇచ్చాడు.

## శ్రీరామకృష్ణుని సందర్శనాలోచన

ఆ సంఘటన అనంతరం నరేంద్రుడి భగవత్‌సందర్శనా పరితాపం మరింత తీవ్రమయింది. తను అభ్యసించిన గ్రంథాలూ, విద్యలూ, వేదాలూ, ఉపనిషత్తులూ అన్నీ కూడా భగవంతుని దర్శనం లభింపచేయకుంటే వ్యర్థములై పోతాయని అనిపించసాగాయి. భగవంతుణ్ణి సందర్శించాలనే అతడి సంకల్పాన్ని తీర్చేవారెవరు? అటువంటి భావావేశ సమయంలో నరేంద్రునికి శ్రీరామకృష్ణులవారు జ్ఞప్తికి వచ్చారు.

పూర్వం సురేంద్రనాథ మిత్ర గృహములో శ్రీరామకృష్ణుని కలిసిన సందర్భంలో తన గానంతో తన పట్ల ప్రీతులైన ఆ స్వామి తన నివాసమున్న దక్షిణేశ్వరానికి రమ్మని ఆహ్వానించటం గుర్తుకు వచ్చి ఆ స్వామిని కలిసి తన సంకల్పాన్ని, తన మనసులో రగులుతున్న ప్రశ్నలను అడగాలని భావించాడు.

## నరేంద్రుని సంకల్పసిద్ధి చేకూర్చే శక్తి శ్రీరామకృష్ణునిలో ఉన్నదా?

ఎన్నో దశాబ్దాల చరిత్ర కలిగిన భారతీయ సంస్కృతి 19 వ శతాబ్దంలో పాశ్చాత్య పోకడలను జీర్ణం చేసుకోసాగింది. భగవంతుని ఆరాధనతో వచ్చే ఆత్మసంతృప్తి కన్నా ఐహికసుఖాలతో శరీరం పొంద గలిగే తృప్తి మానవులలో అధికమవసాగింది. భారతీయులలో అనాత్మవాదం, విశుద్ధ జీవనం, అనర్థ ప్రేలాపనలు, సనాతన ధర్మాల పట్ల దూషణ అధికం అవసాగింది.

1836, ఫిబ్రవరి18 వ తేదీన జన్మించిన శ్రీరామకృష్ణుడి అసలు పేరు గదాధరుడు. అతడు జన్మించిన కారణం పెరిగే కొద్ది అతనికి అర్థమవుతూ వస్తోంది. తండ్రి గతించిన తర్వాత అన్నగారి హయాంలో విద్యనభ్యసించటం ప్రారంభించిన గదాధరుడు అది ధనార్జన కొరికే అనే తెలిసి విధ్యనభ్యసించటం మాని వేసి 21వ సంవత్సరంలో రాణి రాస్మణి అనే భక్తురాలు నిర్మించిన ఆలయంలో అర్చకత్వం చేస్తూ కాళికాదేవిని భక్తిపూర్వకంగా అర్చించేవాడు.

విపరీతమైన భక్తిని పెంచుకుని దేవిని సందర్శించాలని అహోరాత్రులు తపస్సు చేసాడు. అతడి కోరిక ఫలించి అద్భుత దివ్యదర్శనాలు గోచరించి ఆత్మరహస్యాలు వెల్లడికాసాగాయి. జగన్మాతయే ఆ భక్తుడికి గురువై తత్త్వోపదేశం గావించింది. కానీ అతడి అసాధారణ ప్రవర్తనను గాంచిన అతడి బంధువర్గం





అతనికి శారదాదేవి అనే బాలికతో వివాహం చేశారు. నిత్యం కాళీ లగ్నమనస్కుడైన భర్త అడుగుజాడలలోకి తానే మారి భర్తనే దైవంగా భావించి పూజించింది. సర్వ మానవజాతి ఉద్ధరణకై ఆయన అవలంబించిన సాధనాలు అపూర్వం. అహంకార నిర్మూలనకై, బ్రాహ్మణ వంశస్థుడైన అతడు నిమ్నజాతి వారితో కలిశాడు. తీవ్రసాధనా క్రమాల చేత మనఃశరీరాలను మధించి అమృతత్వాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కామం, కాంచనం పట్ల విముఖత్వాన్ని చూపాడు. ప్రతి ఆడవారిలో తల్లిని గాంచాడు. కాంచనాన్ని నిద్రలో తాకించిన మనఃశరీరాలు ముడుచుకునే తత్త్వాన్ని మనఃశరీరాలకు సిద్ధింప చేసుకున్నాడు. ఆధ్యాత్మిక సాధనలో మునిగిన అతడికి ఒక యోగిచే సమస్త తాంత్రిక రహస్యాలు అవగాహన అయ్యాయి. తోతాపురి అనే యోగీంద్రుని ద్వారా దివ్యోపదేశం జరిగింది. సర్వమత సామరస్యం అతడిలో రూపుదాల్చింది.

ఆయన నిలువెల్లా ఉదయించిన సుగుణాల సౌరభం. ఆయన వచనముల ద్వారా ఆస్వాదించటానికి దేశం యావత్తూ సిద్ధపడింది. జాతిమత బోధలు లేకుండా, స్త్రీ, పురుషులు, పండిత శాస్త్రతత్త్వ వేత్తలు శ్రీరామకృష్ణుని సందర్శించసాగారు. భక్తిజ్ఞాన కర్మాదియోగములను సిద్ధించుకున్న శ్రీరామకృష్ణ పరమహంస నరేంద్రుడి సంకల్పాన్ని సిద్ధింప చేయకపోవటమనే సమస్యే లేదు కదా. దైవ సంకల్పం లేనిదే ఏ సంగమము జరగదు.

శ్రీరామకృష్ణాశ్రమము స్థాపనాచారుడై సనాతన ధర్మపునః ప్రతిష్ఠాపన చేయవలసిన బాధ్యతను అప్పగించిన ఆ దేవదేవుడే వీరిరువురిని కలపటానికి నిశ్చయించగా ఆపటం ఎవరి తరము కాదు అనేది పరమసత్యం.

## గురుశిష్యుల కలయిక

అనేక ఉత్కృష్ట సౌరభాలతో కూడిన ప్రాచీన భారతజాతీయ జీవనగంగా ప్రవాహము శ్రీరామకృష్ణుడు అయితే ప్రాకృతిక, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రమాణాలతో కూడిన నవీన భారతజాతీయ జీవనయమునా ప్రవాహమే నరేంద్రుడనబడే వివేకానందుడు.

నరేంద్రుడు శ్రీరామకృష్ణులవారిని సందర్శించటానికి బంధువులు సైతం ప్రోత్సహించారు. శ్రీరామకృష్ణుని దర్శించిన నరేంద్రుడు సూటిగా స్వామితో "స్వామీ! మీరు భగవంతుని దర్శించారా?" అని అడిగాడు. వెంటనే సమాధానంగా "నేను భగవంతుని సందర్శించి యున్నాను. ఏ విధంగా నిన్ను ఇక్కడ చూస్తున్నానో

అదే విధంగా, అదే స్పష్టతతో భగవంతుని కూడా దర్శించాను. భగవంతుడి దర్శనం చేసుకోగలము. ఆయనతో మాట్లాడగలము.

కానీ నా ప్రియమైన నరేంద్రా, మానవులు ఎల్లప్పుడు సంసారిక బాధలలో నిమగ్నమై, వారి జీవితాన్ని ధనార్జన కొరకు, ఇతరత్రా కోరికల కొరకు, కీర్తి ప్రతిష్ఠల కొరకు సమయాన్ని వెచ్చించుతారే కానీ భగవంతుని కొరకు సమయాన్ని వెచ్చించరు. నిజాయితీతో, భక్తితో భగవంతుని గూర్చి విలపించి పరితపించిన వారికి భగవంతుడు ప్రత్యక్షమై తీరుతాడు" అని అన్నారు. అత్యంత విలువైన రత్నాల వంటి ఆ వాక్యములు నరేంద్రుని మనోఫలకంలో శాశ్వతంగా ముద్రపడ్డాయి.

## ధ్యానసిద్ధుడు

నరేంద్రుడు నిద్రకుపక్రమించే తీరులో ఒక అద్భుతం జరిగేది. కనులు మూతలు పడగానే భ్రూమధ్యంలో ఒక దివ్యజ్యోతి ప్రత్యక్షమై పెరుగుతూ విస్తరించి చివరకు చెదిరిపోయేది. ఆ జ్యోతి ప్రసాదించెడి వెలుగులో పూర్తిగా తడిసి నరేంద్రుడు బాహ్యస్మృతి కోల్పోతాడు. నిద్ర అనే గాఢ సుషుప్తిలోకి జారుకుంటాడు. యవ్వనంలో శ్రీరామకృష్ణ సందర్శన సమయంలో స్వామి నరేంద్రుని "నిద్రించుచుతున్న సమయమున జ్యోతి దర్శనం కనిపిస్తుందా?" అని అడుగగా నరేంద్రుడు ప్రతి నిత్యం తను తడిసిపోయే జ్యోతి వెలుగు గూర్చి చెప్పగా రామకృష్ణుడు అతడిని ఆనందంతో తట్టి "నీవు సామాన్యుడవు కావు.... ధ్యాన సిద్ధుడవు" అని ఆశీర్వదించారు.

## నరేంద్రుని బ్రహ్మచర్యం

నరేంద్రుడి తండ్రి విశ్వనాథుడు కుమారుడికి వివాహం చేయాలని సంకల్పించారు. కానీ నరేంద్రుడు ససేమిరా ఒప్పుకోలేదు. ఒక ఐశ్వర్యవంతుడు తన కూతురుని నరేంద్రునకు ఇచ్చి వివాహము జరిపి చదువు నిమిత్తమై నరేంద్రుని విదేశాలకు పంపటానికి సంసిద్ధత చూపాడు. కానీ నరేంద్రునికి పెళ్ళి చేసుకుని గృహస్థుగా మారే ఆలోచనే లేదు. అతడు స్వచ్ఛమైన బ్రహ్మచారిగా ఉండటానికి ఇష్టపడ్డాడు. స్వచ్ఛమైన భావాలు అతడిలో గొప్పశక్తినీ, ఏకాగ్రతనూ, జ్ఞాపకశక్తినీ, ఆలోచనా విధానాన్ని పెంపొందించాయి.

అతడు శారీరకంగా మానసికంగా కూడా శక్తివంతుడే అయ్యాడు. కుమారుడిలో వివిధ భావాలను గమనిస్తున్న విశ్వనాథుడు ఏ విధంగానయినా అతడిని వివాహానికి ఒప్పించాలి అని రామకృష్ణునిచే చెప్పించారు. కానీ నరేంద్రుడు





వినలేదు. విశ్వనాథుడి తృప్తికై రామకృష్ణులు వివాహం చేసుకోమని చెప్పారు గాని నరేంద్రుడి సంకల్పం గూర్చి, ఆయన ద్వారా మానవాళికి లభించే ప్రయోజనం గూర్చి తెలియకకాదు.

## శ్రీరామకృష్ణుని సాన్నిధ్యంలో నరేంద్రుడు

నరేంద్రుడు శ్రీరామకృష్ణుని పారమార్థిక ప్రసంగాలను చూచి విరాగిగా మారాడు. తన పట్ల ఆయన చూపుతున్న పిచ్చి అభిమానానికి వశుడై పోయేవాడు. శిష్యులతో నరేంద్రుని ముఖంలో సరస్వతి జ్యోతి వెలుగుతుందని తెలిపేవారు. నిద్రలో జ్యోతిని గాంచుతానని చెప్పిన నరేంద్రను "నీవు జన్మతః ధ్యానసిద్ధుడవు" అని పలికేవారు.

రెండు రోజులు లేకపోతే దిగులుపెట్టుకునేవారు. నిరీక్షణానంతరం వచ్చిన నరేంద్రుని గట్టిగా పట్టుకుని "నీతో సంభాషించకపోయినా, నా ఆత్మానుభవాన్ని పంచుకోకపోయినా నా హృదయం బాధతో మెలికలు తిరుగుతుంది" అని పలికే రామకృష్ణుని చూచి నరేంద్రుడు ఆయన సాన్నిధ్యంలో తాను ఏదో తెలియని అపూర్వమైన ఆనందం, అనిర్వచనీయమైన సౌఖ్యం పొందుతున్నాడని గ్రహించాడు. ఆయనని దేవుని రీతిగా కొలిచే శిష్యుల ప్రక్రియ దిగ్భ్రాంతి కలిగించేది. ఆయన పట్ల మహోన్నత గౌరవభావాలు ఉన్నా ఆయనను గురువుగా మాత్రం ఆ సమయంలో అంగీకరింపలేకపోయాడు. దేనికయినా సందర్భం రావాలి కదా.

## మనసర్పించిన సంఘటనలు

ఒకనాడు భగవత్సంకీర్తనా సమయంలో నరేంద్రుని వద్దకు చేరి ఆతడి శరీరంపై కుడిపాదాన్ని ఉంచారు. ఆయన తాకగానే నరేంద్రుడికి లోకం అంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. ప్రపంచం అంతా శూన్యంలోకి యింకిపోతున్నట్లుగా భావన కల్గింది.

తన వ్యక్తిత్వం నశించుచున్నట్లుగా, మరణానికి, సమీపింపనున్నట్లుగా మైకం ఆవరించసాగింది. నాకేమౌతుంది అని బిగ్గరగా పలకటంతో శ్రీరామకృష్ణులు నరేంద్రుని ఛాతీని తట్టి ఇప్పటికి చాలు అని అన్నారు. స్పృహలోకొచ్చిన మరుక్షణమే తనకు కలిగిన భావన అంతా మాయమయింది. ఈ విధంగా ఎన్నో సార్లు నరేంద్రుని బాహ్యస్మృతిని కోల్పోయే విధంగా చేసి నరేంద్రుడు ఈ లోకంలోకి ఎందుకొచ్చాడో, ఏమి చేయబోతున్నాడో తెలుసుకునేవారు. నరేంద్రుడు ధ్యాన సిద్ధుడని, ఆత్మదృష్టి అయిన మహర్షి అనీ తానెవరో తెలుసుకున్న వెంటనే యోగమార్గంలో శరీరత్యాగం చేస్తాడని గ్రహించాడు.

శ్రీరామకృష్ణుల పాదస్పర్శలో అపూర్వమైన దివ్యానుభావం కలిగిన నరేంద్రునికి ఆ స్వామిపట్ల మనస్సులో భావం మారి అతడికి వశమైపోసాగాడు. శ్రీరామకృష్ణుని చరణసాన్నిధ్యంలో నరేంద్రుడి జీవితం దివ్యమైన అనుభవములతో, అద్వితీయమైన ఆదర్శభావనలతో, అనంతమైన, ఆత్మానందానుభూతిలలో విరాజిల్లసాగింది. వారి గురుశిష్యుల సంబంధం అత్యద్భుతం, శ్రీరామకృష్ణుని మూలంగా నరేంద్రుడి ప్రతిభాపాటవాలూ, హృదయవికాసమూ అత్యద్భుతమైన రీతిలో సమన్వయం గాంచాయి.

## బాధ్యతల నడుమ-నరేంద్రుడు

విశ్వనాథుడు ఎక్కువ కాలం నివసించలేదు. నరేంద్రుడు బి.ఎ.పూర్తి చేయకమునుపే కాలం చేశాడు. కుటుంబం కష్టాలల్లో కూరుకుపోయింది. ఎటువంటి ఆర్థికపరమైన చేయూత లేకపోవటంతో కుటుంబపోషణాభారం నరేంద్రునిపై పడింది. తల్లీ, చెల్లెళ్ళ బాధ్యతను ఆనందంగా మోయటానికి సంసిద్ధుడైయ్యాడు. కానీ వారిని పోషించటానికి ఎటువంటి ఉద్యోగాన్ని సంపాదించ లేకపోయాడు. ఎన్నో రాత్రులు ఆహారం లేకుండా గడిపినా తన బాధను తల్లీ, చెల్లెళ్ళను తెలిపేవాడు కాదు. ప్రతి వ్యక్తికీ భగవంతుడు పరీక్షపెడతాడు. ఆ సమయం అప్పుడు నరేంద్రునకు వచ్చింది.

చివరగా శ్రీరామకృష్ణుని సలహాతో కాళీమాతను పూజించాడే కాని తన కష్టాలను మాత్రం తెలుపలేదు. ఆమె సమక్షంలో బాధలన్నీ మరచి జ్ఞానాన్ని, భక్తి వైరాగ్యమును పెంపొందించమని వేడుకుని అలౌకికమైన ఆనందాన్ని అనుభవించాడు. ఎన్నిసార్లు తమ కష్టాలను గురించి విన్నవించాలని కాళీమాత దరిచేరినా ఏనాడూ విన్నవించుకోలేకపోయాడు. “తల్లీ! భక్తీ జ్ఞానాలను మాత్రమే నాకు అనుగ్రహించు” అని ప్రార్థించాడు.

## శ్రీరామకృష్ణుని లీల

ఆలయం బైటకి రాగానే తన కష్టాన్ని తల్లికి ఎందుకు విన్నవించు కోలేకపోయాడో అని మధన పడేవాడు. ఎందుకనో అంతటికీ తన గురువర్యులు రామకృష్ణ పరమహంసే కారణమని భావించి ఆయన వద్దకు చేరి “గురువర్యా! మీ ప్రభావము చేతనే దేవి సమీపంలో నన్ను నేను మైమరచిపోతున్నాను. మీరే నా ప్రార్థనను ఆలకించాలి” అని పలికాడు.

శ్రీరామకృష్ణుడు చిరునవ్వుతో “నరేంద్రా! నీవు సంసారసుఖాలను, ప్రాపంచిక సమస్యలను అనుభవించటానికి జన్మించలేదు. నీవు చేయవలసిన





ఉత్కృష్టమైన కార్యసాధన మున్ముందు ఉంది. నీ కుటుంబం గురించి చింత వలదు. మీ కుటుంబానికి అవసరమయ్యే అన్నవస్త్రాలకు ఇకమీదట ఎటువంటి లోటూ జరుగదు” అని అనుగ్రహించారు.

దీనికంతటికీ ఒక కారణము ఉంది. బ్రహ్మ సమాజములో చేరిన సమయములో నరేంద్రుడు విగ్రహారాధనకు వ్యతిరేకి. విగ్రహారాధన చేసే హిందూమత ప్రబోధకుడ్ని గేలిచేసాడు.

దాని ఫలితమే ఇప్పుడు అతడు అనుభవించింది. ఈ సంఘటనతో భగవంతుని పట్ల జగన్మాతృభావంతో పాటుగా విగ్రహారాధన విస్పష్టమయింది. తన ప్రియశిష్యుడిలో ఈ పరిణామాన్ని ఆశించిన శ్రీరామకృష్ణుడు ఎంతగానో సంతోషించారు.

## మనోవికాసాన్ని కలిగించిన శ్రీరామకృష్ణుని శిష్యరికం

వేదాంతసారాన్ని తనువంతా నింపుకొన్న శ్రీరామకృష్ణుల వారి ఉపదేశం ప్రత్యేకరీతిలో ఉండేది. ఏ విధంగా పువ్వులు నిశ్శబ్దంగా వికసించి తమ సుగంధాన్ని వెదజల్లుతాయో, ఏ విధంగా చంద్రుడు దిన దిన ప్రవర్ధమానమై భూమండలాన్ని ప్రకాశింపచేస్తాడో అదే విధంగా శ్రీరామకృష్ణుడు తన మహోపదేశాలను అతి సున్నితంగా శిష్యుల మనస్సులలో వికసింపచేసి దివ్యానుభవాలను వారి సొంతం చేసేవారు. వారు చేసే ధ్యానసాధనలను శ్రీరామకృష్ణుని ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా కొనసాగేవి.

ఒకనాడు ధ్యానసమయంలో నరేంద్రుడి సమీపంలో వస్తున్న ధ్వనిచేత మనస్సును నిమగ్నం చేయలేకపోసాగాడు. గురువుగారితో విషయాన్ని చెప్పగా ఆయన నరేంద్రుని మనస్సును ధ్వనిమీద లఘ్నం చేయమన్నారు. అంతే నరేంద్రుని సమస్య తొలగిపోయింది.

ఇంకొక సమయంలో ధ్యానకాలంలో పూర్ణశరీర విస్మృతి కలుగటం లేదని తెలిపాడు. అంతట రామకృష్ణులు నరేంద్రుని నొసటిపై గోటితో నొక్కిపట్టి ఆ స్పర్శానుభావం మీదనే మనస్సును లగ్నం చేయమని చెప్పారు. అదే విధంగా చేసిన నరేంద్రుడు నిశ్చల సమాధిలో నిమగ్నమివ్వగలిగాడు.

“ఆత్మసాక్షాత్కారమే మానవుడి పరమావధి. ఆత్మానందపరిపూర్ణమైన హృదయంలో ఎటువంటి వాదోపవాదములకు చోటు ఉండదు. ధ్యానం చేత జ్ఞానోదయము కలుగగానే సంశయమనే అంధకారం తొలగిపోతుంది” ఇదే శ్రీరామకృష్ణపరమహంస గురువరేణ్యులు బోధన.

## నరేంద్రునిపై శ్రీరామకృష్ణుని అభిమానం

"సనాతన ధర్మతత్త్వం సజీవాకృతిలో శ్రీరామకృష్ణునిగా మన ముందు నిలిచింది" అని గాంధీమహాత్ముడు శ్రీ రామకృష్ణుని పట్ల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "బ్రహ్మానందము పలు రూపాలుగా ప్రకాశించి శ్రీరామకృష్ణులు జీవితంలో సామరస్య దేవాలయాన్ని నిర్మించింది" అని రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయ పడ్డారు. ఇటువంటి మహోత్కృష్టమైన గురువరేణ్యుడికి నరేంద్రునికి అతడి బంధువులు వివాహప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి కాళికాదేవికి సాష్టాంగపడి నరేంద్రుని సంసార సాగరంలోకి లాగ వద్దని వేడుకున్నాడు. అణుమాత్రమైన నరేంద్రుడు దుష్టజన సహవాసం చేస్తే శ్రీరామకృష్ణుడి అతడిని కఠినంగా మందలించేవారు.

నరేంద్రునికి కుటుంబ పోషణ భారం మీదపడినప్పుడు నరేంద్రుని స్నేహితునితో అతడి కష్టాల్లో భాగం పంచుకోవాల్సిన ఆవశ్యకత స్నేహితులపై కూడా ఉందని అన్నారు. స్నేహితుడు వెళ్ళగానే అభిమానధనుడైన నరేంద్రుడు గురువర్యా! నా స్నేహితుని ముందు నా అసమర్ధతను ఎందుకు వ్యక్తపరిచారు" అన్నాడు. వెంటనే రామకృష్ణులు "నరేంద్రా! నీ కొరకు నేను బిక్షాటన చేయుటకు కూడా సంసిద్ధుడనే" అని తన అభిమానాన్ని తెలిపారు. సన్యాసదీక్షను పొందిన నరేంద్రుడు తన మనస్సుకు వజ్రకాఠిన్యమును అలవరచుకొనసాగాడు.

## శ్రీరామకృష్ణుని వారసుడిగా నరేంద్రుడు

ఆది శంకరాచార్యుల అఖండధీశక్తి, బుద్ధభగవానుడి సర్వజీవకారుణ్యము, చైతన్య ప్రభువు సొంతం అయిన వినిర్మల ప్రేమా..... ఈ ముగ్గురి భావావేశాలు ఏకమై సనాతన ధర్మాసముద్ధరణ కొరకు శ్రీరామకృష్ణుడిగా అవతరించారని భావించే తన గురువు శ్రీరామకృష్ణుల అభిమానాన్ని చూరగొన్న నరేంద్రుడు గురువు గారితో ఉన్న ఆరు సంవత్సరాల కాలాన్ని తన జీవితంలోకి అమితానందమైన, మహోత్తరమైన దశగా పరిగణించాడు.

సద్గురు సాన్నిహిత్యంలో తనకు లభించిన బోధనలు, జ్ఞాన సముపార్జనతో నిండిన ఆ కాలాన్ని తన జీవితాంతం మరవ లేదు. కామం, కోరిక, ఆవేశాగ్రహాల వంటి శత్రువర్గాలను వివేక వైరాగ్యములతో జయించి, ధ్యానధారణనే ఉపాయములతో ఆత్మ సామ్రాజ్యానికి రాజై, తాను సముపార్జించిన తత్త్వజ్ఞాన నిధికి శ్రీ నరేంద్రుని 'వారసునిగా' శ్రీరామకృష్ణులు చేశారు.





ఇక మిగిలినదల్లా పాశ్చాత్యసుఖాలతో నిండిపోతున్న వాతావరణమును సంహరించి ఆత్మానందం అనే సామ్రాజ్యాన్ని దేశమంతటనే కాక ప్రపంచమంతటా కూడా వ్యాపింపచేసి ధర్మాన్ని ఉద్ధరించవలసిన బాధ్యత నరేంద్రునిపై ఉంది. ఇక ముందు నరేంద్రుడు తాను శ్రీరామకృష్ణుని నుంచి ఆర్జించిన సంపదను, రత్నరాసులను లోకానికి పంచిపెట్టవలసి ఉంది.

## క్షీణించిన శ్రీరామకృష్ణుల ఆరోగ్యం

ఇటువంటి సమయంలోనే శ్రీరామకృష్ణుల వారికి వ్రణం బయలుదేరింది. వైద్యంకొరకు తమ నివాసాన్ని దక్షిణేశ్వరం నుండి కలకత్తాకు మార్చటం జరిగింది. నరేంద్రుడి నాయకత్వంలో శిష్యులంతా గురువుని క్షణమైనను వదలకుండా సేవ చేయసాగారు. పేరుగాంచిన మహేంద్రలాల్ సర్కార్ అనే వైద్యుడు చికిత్స చేయ సాగారు. మాట్లాడవద్దని వారించినా వారికి తానివ్వవలసిన ఉపదేశాలను ఆపలేదు రామకృష్ణుల వారు. పుష్పము లోని సుగంధాన్ని, గంగా ప్రవాహాన్ని, సూర్యకాంతిని ఆపగలిగే వారెవరు. అమృతప్రాయములైన ఆ స్వామి తత్త్వబోధనలు ఆస్వాదించటానికి ఒక్కొక్కసారి వైద్యులు సైతం అత్యంతాసక్తిని కనబరుస్తూ ప్రపంచాన్ని మరిచి నిలబడి వింటుండిపోయేవారు.

శ్రీరామకృష్ణుల వారికి నరేంద్రుడు నిత్యం సేవలు, గానం అందించేవాడు. అది చూసి మహేంద్రలాల్ నరేంద్రుడి కౌగిలించుకుని తమ వంటి జ్ఞాన సముపార్జితులని కలుసుకొనటం వలన తన జీవితం ధన్యమైనదని తెలుపుతూ యువకులైన వారి అవసరం ప్రపంచానికి ఎంతో ఉందని అన్నారు. వైద్యంతో కొంత కూడా వ్యాధి ఉపశమనాన్ని పొందకపోవటంతో ఆవాతావరణం నుంచి దూరంగా కాశీపూర్ ఉద్యానవనంలో శ్రీరామకృష్ణుల వారి బసను ఏర్పాటు చేశారు.

## మనసునందున్న మాటను శ్రీరామకృష్ణులకు తెలుపుట

వ్యాధి ఎంత బాధపెడుతున్నా తన వారసుడిగా అతడి ఆధ్వర్యంలో జరగవలసిన మహోద్యమం కొరకు శిష్యులను సన్నద్ధులు చేయసాగారు. మరణశయ్యలో ఉండే తమ గురువుగారు సాగిస్తున్న మహాకార్యాన్ని చూసి శిష్యులు అంతటి గురువరేణ్యుణ్ణి గురువుగా పొందటమే లోకోత్తరమైన భాగ్యమని, ఆయన సేవ పరమావధి అని తలంచుతూ నిద్రాహారాలు మాని ఆయనను సేవించసాగారు. ధ్యాన ముద్రలో బాహ్యావిస్మృతి పొందటం అలవరచుకున్న నరేంద్రుడు గురువు

వద్దకు చేరి "గురువర్యా! దీర్ఘకాలం నిర్వికల్ప సమాధిలో వుండే శక్తిని ఎప్పుడు ప్రసాదిస్తారు" అని తన మనసులో మాటను శ్రీరామకృష్ణుల ముందు ఉంచాడు. సాధకులయిన ముముక్షువులకు యింతకంటే మహోన్నతాశయం ఉండదు. అదే సమాధిస్థితి.

కానీ దీనికంటే ఉత్తమమైన పురుషార్థాన్ని సాధించటానికి నరేంద్రుడు జన్మించాడు. తాను పరమావధిని పొందటమే కాక ఇతరులను కూడా తరింప చేయటమే అతడి జన్మలోని ఉద్దేశ్యం. అంతటి స్థితికి రావటానికి కావలసిన భక్తిజ్ఞానాలు నరేంద్రునికి అత్యంత చేరువులో ఉన్నాయని, దరిచేరతాయని రామకృష్ణులవారికి తెలుసు. వాటికొరకై అతడిని సంసిద్ధుణ్ణి చేయసాగారు.

## అద్వైత తత్త్వానుభవాన్ని తెలుసుకున్న నరేంద్రుడు

ఒకనాడు నరేంద్రుడు శ్రీరామకృష్ణుని సమీపించి "మహానుభావా! మీ వంటి సిద్ధపురుషులు సంకల్పం మాత్రం చేతనే ఎటువంటి వ్యాధినైనను నిరోధించుకోగలరని శాస్త్రాలు చెబుతున్నాయి. అటువంటి మీరు ఇలా....?" అన్నాడు. అంతట రామకృష్ణుడు "నరేంద్రా! తత్త్వరహస్యాన్ని అవపోసన చేసిన నీవు తుచ్ఛమైన ఈ శరీరం కొరకు వ్యాధిని మాన్పుకోమంటావా?" అని ఎదురు ప్రశ్నవేశారు.

కానీ మిగిలినవారందరి బలవంతంతో కాళీమాతకు వారి కోరికను నివేదింప అంగీకరించారు. కొంతసేపటికి కళ్ళు తెరచి "నరేంద్రా! నేను మాతతో వ్రణబాధతో ఏమి తినలేకపోతున్నాను. ఈ కాస్త తిను విధముగా చేయమని కోరగా ఆమె "ఏమి నాయనా? అందరి నోళ్ళగుండా నీవు భుజించుట లేదా?" అని అడిగింది అన్నారు. ఒక్కసారిగా నరేంద్రుడు ఆ మాటలకు ఖంగుతిన్నాడు. గురువు యొక్క శరీర విస్మృతిని గాంచి నిశ్చేష్టుడయ్యారు. అద్వైత తత్త్వానుభవాన్ని గ్రహించిన నరేంద్రుడు గురుదేవుల అపరోక్షానుభూతి అసమాన్యమైనదని గ్రహించాడు.

## గురువు గారి ద్వారా సిద్ధించిన శక్తి

ఇనుమును కాల్చితే ఏ విధంగా మనకు కావలసిన రీతిలో మారుతుందో అదే విధంగా రామకృష్ణులు తగు సంఘటనలతో నరేంద్రుని సన్నద్ధం చేయసాగారు. ఫలితంగా ధ్యానం అతడికి సుస్థిరమభ్యాసమయింది. దివ్యశక్తులు వశం అవసాగాయి. స్పర్శమాత్రం చేతనే దివ్యానుభూతిని ఇతరులకు ప్రసాదించే సమర్ధుడయ్యాడు. ఒకనాడు ధ్యాననిమగ్నుడై ఉన్న సమయంలో నరేంద్రునకు





అకస్మాత్తుగా తల వెనుక భాగంలో ఒక దివ్యజ్యోతిని చూశాడు. అది క్రమక్రమంగా పెరగసాగింది. ఆ కాంతిలో అతడు మునిగిపోయాడు. నరేంద్రుని మనస్థితి వర్ణనాతీతం. ఒక్కసారిగా "గోపాలా! గోపాలా! నా శరీరం మాయమయింది" అని అరిచాడు.

ఆ సమయంలో అక్కడ ఉన్న అద్వైతానందస్వామి అనే శిష్యుడు నరేంద్రుని వద్దకు వచ్చి చూశాడు. నరేన్ శరీరం బిగుసుకుపోయి ఉంది. కదిపినా స్పృహలోకి రాకపోయేసరికి నరేంద్రుని స్థితిని గూర్చి రామకృష్ణుల వారికి తెలుపగా "అతడిని కొంతసేపు అలాగే ఉండనివ్వు" అన్నారు.

నరేంద్రుడు ఉన్న ఆ స్థితే నిర్వికల్పసమాధి. ఆ సమాధి నుంచి బయటపడిన నరేన్ మోము అనిర్వచనీయమైన ఆనందాన్ని చూపుతోంది. అంతట రామకృష్ణులు అతడితో "నీవు కోరిన ఆ స్థితిని నీకు ఆ తల్లి చూపింది. ఈ దివ్యానుభూతి మళ్ళీ వెంటనే లభించదు. అదెప్పుడు లభించాలో అప్పుడే తిరిగి పొందగలవు. ఈ లోపు నీవు నెరవేర్చాల్సిన కార్యం ఉంది.

నీవు ఎల్లప్పుడు మనఃశరీరాలను గూర్చి విచక్షణతో మెలుగు. నీవు ఇక నుండి ఇతరులకు బోధించడానికి సంసిద్ధుడివై ఉండు. నా యోగ సిద్ధులన్నీ అచిరకాలంలో నీ నుండే వ్యక్తమవుతాయి" అంటూ అతన్ని తాకగా సూక్ష్మశక్తి తరంగాలు తనలోకి ప్రవేశించటంతో బాహ్యస్మృతి కోల్పోయాడు నరేంద్రుడు.

## శ్రీరామకృష్ణుని నిర్యాణం

ఆ తర్వాత అంతిమ సమయంలో శ్రీరామకృష్ణుడు మిగిలిన శిష్యులతో "నరేంద్రుడు ఇచ్ఛామరణాన్ని పొందగలడు. తన మానసిక ఆధ్యాత్మిక శక్తులతో లోకాన్ని మైమరిపింపచేసే స్థితిని నా ప్రార్థనతో తల్లి మరుగున పడవేసింది. అతనిచే కాగల కార్యం సిద్ధించిన ఆ స్థితి అతడికి అవగతమౌతుంది. ఆ క్షణాన అతడు శరీరం నుండి విముక్తి కాగలడు" అని చెప్పారు.

నరేంద్రునితో "నరేంద్రా! నీకు నేడు నా సర్వస్వం ధారపోసి ఆధ్యాత్మిక సంపద్విహీనుడనయ్యాను. నాచే సంక్రమించబడిన శక్తితో నీవు చేయగల కార్యాలను ఘనంగా నిర్వర్తించగలవు. ఆ తర్వాతనే నీకు కావలసిన స్థితిని పొందగలవు" శ్రీ రామకృష్ణుల వారి చరమ దశలో ఎన్నో శారీరక బాధలను భరిస్తూ నరేంద్రుడికి తన చరమోపదేశాన్ని ఇచ్చారు.

1886వ సం॥ ఆగస్టు 16వ తేదీన శ్రావణకృష్ణ భానువారం రాత్రి 1గంటకు శ్రీరామకృష్ణులవారు మహాకాళీమాతను జపించుతూ అఖండ

సిద్ధానందమయి పరబ్రహ్మం పొందారు. అత్యంత విచారకరమైన స్థితిలో నరేంద్రుడు, మిగిలిన శిష్యులు శ్రీరామకృష్ణుల వారి భౌతికకాయాన్ని అగ్నికి అర్పించారు.

ఆ తర్వాత నరేంద్రుడూ రామకృష్ణుని ఇతర శిష్యులూ అన్నింటినీ త్యజించి సన్యాసులుగా తయారయ్యారు. నరేంద్రుడు ప్రేమ, ఆత్మతత్త్వములతో ఆధ్యాత్మికసాగరంలో ప్రపంచాన్ని ముంచి వేయుటకు తన అనుచరులతో బయలుదేరుటకు సంసిద్ధులైయ్యారు.

## నరేంద్రుడు పరివ్రాజక జీవితము

శ్రీరామకృష్ణుని నిర్యాణం అనంతరం మఠాన్ని బారానగరానికి మార్చారు. శ్రీరామకృష్ణుల అస్థిసంచయాన్ని, విగ్రహాన్ని యోగోద్యానమనే పవిత్రస్థలంలో నెలకొల్పి శ్రీరామకృష్ణాలయం నిర్మించారు. ఆ తర్వాత నరేంద్రుడు భారత దేశమంతా తిరిగి ప్రజల మనోభావాలను, జ్ఞానాలను గూర్చి తెలుసు కోవాలనుకున్నాడు. ఒకే చోట ఉండి ప్రపంచజ్ఞానాన్ని తెలుసుకోగలగటం, తత్త్వాన్ని ప్రపంచానికి తెలియచేయటమనేది జరగదని భావించాడు. పరివ్రాజక జీవితేచ్ఛను కలిగిన నరేంద్రుడు మొదట దర్శించిన పుణ్య ప్రదేశం కాశీనగరం.

అక్కడ విశ్వేశ్వరుడిని దర్శించి పారవశ్యం పొందాడు. ఆ తర్వాత భారతదేశమంతా సంచార సన్యాసిగా తిరిగాడు. ఆయన సంచారంలో ఖరీదైన రాజమహలుల్లోని రాజులను కలుసుకున్నాడు. మారుమూల ప్రాంతాల్లో ఉండే బీదవారినీ వారి గుడిసెల్లో కలుసుకున్నాడు.

## పారిపోకు- ఎదురించు

గయ, బెనారస్ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలని దర్శించాడు. ఒకనాడు దేవాలయ ప్రాంగణంలో కోతులు వెంటపడగా నరేంద్రుడు పరిగెత్తాడు. అంతలో ఒక వృద్ధ సన్యాసి కంఠం వినపడింది. "పారిపోకు! ఎదురించు" అంతే నరేంద్రుడు వాటికి ఎదురు తిరగగా అవి చెల్లాచెదురైపోయాయి. ఆ తర్వాత శ్రీరామకృష్ణులు అన్నారని భావించిన నరేంద్రుని ఆనందానికి అవధులు లేవు.

## ఆళ్వార్ వెళ్ళిన నరేంద్రుడు

నరేంద్రుడు దేశ సంచార సమయంలో ఎంతోమంది బ్రాహ్మణ పండితులను కలుసుకుని చర్చలు సాగించాడు. అదే విధంగా పేదవారితో కలిసి కొంత కాలం జీవించి వారి కష్టాలను తెలుసుకున్నాడు. భారతదేశంలో ఎంతో





గొప్ప గొప్ప రాజుల చేత ఏలబడే ప్రదేశాలలో కూడా దారిద్ర్యం విలయతాండవం చేస్తుందని గ్రహించాడు. ఆయన తన ప్రయాణంలో ఆళ్వార్ ప్రాంతం వచ్చారు. ఆళ్వార్ ప్రాంతపు రాజయిన మంగళసింగ్‌ని కలిశాడు. విందులతో వేడుకలతో సమయాన్ని ఆనందంగా గడిపే ఆయనకు భగవంతుని యందు నమ్మకం లేదు. ఈ విషయం తెలుసుకున్న నరేంద్రుడు, మంగళసింగ్‌ని కలిశాడు. ఆ రాజు నరేంద్రుని సాదరంగా ఆహ్వానించాడు.

## మంగళసింగ్‌కు దైవం పట్ల భక్తిని పెంపొందించుట

నరేంద్రుడు దర్బారులో ఒక మంత్రిని పిలిచి మంగళసింగ్ ఛాయాచిత్రాన్ని తెమ్మని గోడకు తగిలించాడు.

నరేంద్రుడు మంత్రిని "ఆ చిత్రంలో ఉన్నది ఎవరో చెబుతారా?" అని అడుగగా మంత్రి "ఆయన మా రాజు. కళాకారుడు చిత్రించిన మా రాజు గారి ఛాయాచిత్రము" అని సమాధానమిచ్చాడు.

"నిజమే, కానీ ఆ చిత్రానికి ప్రాణం లేదు. ఒట్టి చెక్క ముక్కే కదా. అయినా నీవు దానిపై ఉమ్మివేయి" అన్నాడు.

హతాశుడయిన ఆ మంత్రి కోపంగా, "ఏమిటన్నారు  మీరు. అది మా రాజు ఛాయాచిత్రము. మమ్మల్నందరిని పాలించి మమ్ము రక్షించే ఆయన చిత్రంపై ఆ విధంగా చేయటం జరుగదు" అన్నాడు.

"నువ్వే అన్నావు గదా అది మా రాజు ఛాయాచిత్రం అని, మీ రాజు ఏమీ అక్కడ లేడుకదా. మరి నీ వెందుకు నే చెప్పిన పని చేయలేదు" అన్నాడు నరేంద్రుడు.

అంతట ఆ మంత్రి "స్వామీ! మా రాజు సజీవరూపంలో చిత్రంలో లేకపోయినా ఆ చిత్రాన్ని చూస్తున్నప్పుడు మా రాజు మా కళ్ళముందుంటారు. మీరు చెప్పిన పని చేయటమంటే ఆయనను అగౌరవపరచటమేకదా" అన్నాడు.

అతడి సమాధానము విన్న నరేంద్రుడు చిరునగవుతో సభనుద్దేశించి "అనగా మీరంతా ఆ చిత్ర ఛాయాచిత్రాన్ని గౌరవిస్తారు. అదే విధంగా విగ్రహాలలో దేవుడు వసించి ఉండకపోయినా ఆ విగ్రహాన్ని చూడటం పూజించటం అంటే భగవంతుడిని ఆరాధించటమే" అన్నాడు.

విషయమంతా గ్రహించిన ఆళ్వారు రాజు మంగళసింగ్ నరేంద్రుని వద్దకు వచ్చి తన అజ్ఞానాన్ని క్షమించమని కోరాడు. ఆనాటి నుండి అతడు దైవభక్తి పెంచుకునే ఆత్మానందాన్ని పొందగలిగాడు.

## దేశ పర్యటనలో నరేంద్రుడు

నరేంద్రుడు అయోధ్య చేరి శ్రీమద్రామాయణ వైభవాన్ని ప్రత్యక్షంగా చూసి ఆనందించాడు. ఆగ్రా వెళ్ళి తాజ్‌మహల్‌ను చూసి ప్రశంసించాడు. బృందావనంలో రాధాకృష్ణుల లీలాద్భుతాలను తలంచుతూ గోవర్ధనపర్వత ప్రదక్షిణ చేసి, రాధాకుండంలో స్నానమొనర్చాడు. భారతావనిలో ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకుంటూ హరిద్వారానికి చేరటానికి రైల్వేస్టేషన్‌లో రైలు కోసమై నిరీక్షించసాగాడు.

ఆ స్టేషన్ మాస్టర్ శరశ్చంద్రుడు అంతకు మునుపే నరేంద్రుని గూర్చి విని యుండుట చేత ఆయనకి భోజనాన్నిని సమకూర్చి, విచారవదనంతో ఉన్న స్వామిని కారణం అడుగగా "మా గురువర్యులు నాకు ఒక మహాకార్యాన్ని అప్పగించారు. దేశంలో అడుగంటుతున్న ఆధ్యాత్మిక జీవనాన్ని పునరుద్ధరించ వలసి ఉంది.

దారిద్ర్యంతో తాండవిస్తున్న ఈ దేశానికి నేను చేయవలసిన సేవ గూర్చి యోచిస్తున్నాను" అనగా శరశ్చంద్రుడు "నన్ను మీ శిష్యుడిగా స్వీకరింపగలరు" అని నరేంద్రుడు ప్రతిఘటించినా వినకుండా సర్వసంగ పరిత్యాగి అయి నరేంద్రుని శిష్యునిగా అతడి వెంట నడిచాడు.

## భగవంతుని లీల

ఆ తర్వాత నరేంద్రుడు వైద్యనాథపురం చేరి పహారిబాబా వద్దకు చేరి ఆయనను గురువుగా స్వీకరించి ప్రత్యక్షంగా హఠయోగ రహస్యాలను నేర్వకోరాడు. కానీ శ్రీరామకృష్ణుడి గంభీరవదనంతో కనిపించి మందలిస్తున్నదని భావించి తన సంకల్పాన్ని విడనాడాడు. తన సోదరశిష్యుడైన అభేదానందస్వామి హృషీకేశంలో మాన్యపు జ్వరంతో బాధపడుతున్నాడని తెలిసి అందించవలసిన సహాయాన్ని అందిస్తూ నరేంద్రుడు బృందావనం వెళ్ళి గోవర్ధన పర్వతాన్ని కాలినడకతో చుట్టసాగాడు.

ఆ సమయంలో ఆతడికి విపరీతమైన ఆకలి వేసింది. ఎటువంటి సమయంలోనూ, ఎంత ఆకలి వేసినా ఎటువంటి విషయానికైనా ఇతరుల ముందు చేయి చాచకూడదని పట్టు పెట్టుకుని యున్నాడు. నీరసంతో, ఆకలితో కళ్ళు తిరుగుతున్నా పూర్వం చేసిన పట్టుని వీడలేదు. ఆకలి తీవ్రం కావటంతో ధ్యానంలో కూర్చున్నాడు. అంతలో ఎవరో వచ్చి నరేంద్రుని భోజనానికి రమ్మని పిలిచారు. ఆశ్చర్యపోయిన నరేన్ అది దైవలీలగా భావించాడు.





## మైసూర్, మహారాజుతో నరేంద్రుడు

నరేంద్రుడు తన ప్రయాణంలో మైసూర్ చేరుకున్నాడు. అప్పటి దివాను కె.శేషాద్రి ఐయ్యర్ నరేంద్రుని మైసూర్ మహారాజుకి పరిచయం చేశాడు. మహారాజు బ్రిటీష్ వారి పట్ల అత్యంత వినయవిధేయతలు కలిగియుండుట గమనించాడు.

బ్రిటీష్ వారి చేతిలో దివాను ఆయుధంగా తయారయినాడని ఈ విషయాన్ని రాజుకి తెలియచేస్తే రాజు నరేంద్రుని తీవ్రంగా నిరసించి "ఈ విధంగా మాట్లాడిన యెడల బ్రిటీషర్ల చేత మీకు మరణశిక్ష లేదా జైలు శిక్ష తప్పదు" అని అరిచాడు. కానీ నరేంద్రుడు జంకకుండా "నిజమైన స్వచ్ఛమైన సన్యాసి చావుకి భయపడి అబద్ధం చెప్పడు" అని హుంకరించాడు. ఈ సంఘటన ద్వారా నరేంద్రుడు తన ప్రసంగాలలో "కష్టాలకూ, దుఃఖాలకూ, చావుకూ ఎన్నడు బెదరి వెనుతిరగకూడదు. వాటికి ఎదురునుంచుని పోరాడాలి. అప్పుడుగాని అవి తొలగిపోవు" అని చెప్పాడు.



## హరిజనుల ఆహారాన్ని స్వీకరించిన నరేంద్రుడు

బెంగుళూరు పర్యటించే సమయంలో ఒకానొక సమయంలో విపరీతమైన ఆకలి, నీరసం ఆవహించాయి. నరేంద్రుడు ఆ సమయంలో హరిజనవాడలో ఉన్నాడు. నీచజాతి వారని హరిజనులను సంఘంనంచి వెలివేశారు. నరేంద్రుడను కలుసుకుని మాట్లాడుతున్న హరిజనుడని తన కోసం ఆహారాన్ని తయారుచేయమనగా అతడు, వణుకుతూ తాను తక్కువ కులస్థుడనని, నాచే వండిన పదార్థం తినటానికి పనికిరాదని అన్నాడు.

నరేంద్రుడు "ఎందుకంత భయపడుతున్నావు.నువ్వు వంట ఏ విధంగా చేస్తావు. మంటని వెలిగించి గిన్నెపెట్టి నీరు పోసి కూరగాయలను ఉడికించుతావు. ఆ కూరలు ఉడకటానికి సహాయపడేది మంట. ప్రకృతి ప్రసాదించిన అగ్ని, ఆహారం, నీరు ఇవి అన్నీ అందరికి సమానమే కదా. మరి నీవు చేసిన వంట ఎందుకు అంటరానిది" అంటున్న నరేన్ మాటలకు అతడు ఆశ్చర్యం చెంది, వెంటనే తానే స్వయంగా వండి స్వామీజీ అని సంబోధిస్తూ నరేంద్రునికి సమర్పించాడు.

నరేంద్రుడు ప్రయాణం పర్వతాలకి రాజు అయిన హిమాలయాల నుండి మూడు సముద్రాల సంగమ ప్రదేశం అయిన కన్యాకుమారి వరకు సాగింది. భారతదేశమంతా దారిద్ర్యంతో నిండినదనీ, లక్షలమంది ప్రజలకి నివసించటానికి ఇళ్ళు కూడా లేవని గ్రహించాడు. ఎక్కడా శాంతి అనేది కనపడలేదు.

తమలో ఉన్న శక్తిని ఉపయోగించుకుంటే దారిద్ర్యమే దరిచేరదని భావించాడు. భారతీయులమనగా, హిందువులు అని చెప్పుకునే వారిలో ఎంతటి పనులైనా చేసే శక్తి వారికి ఉందని భావించాడు. అందుకనే అటువంటి ప్రదేశాలలో "సోదరులారా! రండి. అంతా కలిసికట్టుగా పనిచేద్దాం. నిద్రించటానికి కూడా సమయం లేనంత పని ఉంది. మనం చేసే ఈ పనిమీదే భారతదేశ భవిష్యత్తు ఆధారపడింది.

మీ జీవితాన్ని మీ కొరకు, భావితరాల వారికి మంచి చేయటం కొరకు అంకితం చేయండి, ప్రతి వ్యక్తి తనకు తాను సేవకుడిగా తలంచుతూ పనిచేయండి. ప్రతి భారతీయుడికి అన్నమూ, నీడా, బట్టా లభ్యమయ్యే వరకు ఎటువంటి రాజకీయాలని మీ జీవితంలోకి ఆహ్వానించకండి. క్రొత్త భారతావనిని ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయండి" అంటూ ఉపన్యసించాడు.

"ఎవ్వరికి ఎవ్వరూ సేవకులు కాదు. దాస్యత్వాన్ని తిరస్కరించి దేశానికిసేవ చేయటమే భారతజాతి లక్ష్యం. పూజించదగిన ఒకే ఒక్క దైవము, మానవదేహము నందుండెడి ఆత్మ మాత్రమే. స్వాతంత్ర్యం కొరకు పోరాడే ఏ వ్యక్తి పర్యవసానం గూర్చి ఆలోచించకూడదు. ప్రతి వ్యక్తి తనలోని రాజసిక శక్తిని బయటికి తీసి దేశం కోసం పోరాడాలి.

జాతీయ నెత్తురులో కొత్త బలాన్ని తెప్పించటాన్ని అంతర్గతాగ్నిని భారతదేశం కోరుకుంటుంది. మనందరికి కొత్త ఉత్సాహం, శక్తి, అనంతమైన అభివేశము అత్యంత ఆవశ్యకరములు. పూర్వీకులు మనకి బహుమతిగా అందించిన ఆత్మ స్వరూపతత్వాన్ని పదిలంగా దాచుకోవాలి. లేవండి. పనిచేయండి దానికి సమయం అరుదెంచింది. కండలను ఇనుపముక్కలుగా, మనసుని కఠినమైన రాయిగా చేసి మేఘగర్జన చేయండి. అనంతమైన శక్తీ, ధైర్యం, సహనం గొప్ప విజయాలను సాధిస్తాయి. మంచి పనికి వాటిని ఉపయోగించండి.

ఇతరుల కోసం పనిచేయండి. విస్తరించటం అనేది జీవించడం అయితే, కుంచించుకుపోవటం అనేది మరణించటం వంటిది. మనం అనుకున్న సరిహద్దును చేరేవరకు నిద్రించకండి" అంటూ భారతీయులలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపాడు నరేంద్రుడు.





## కన్యాకుమారిలో వివేకానంద స్థూపం

కన్యాకుమారి భారతదేశ సరిహద్దుగానే కాక పుణ్యప్రదేశంగా కీర్తిగాంచింది. ఇక్కడ మూడు సముద్రాల సంగమాన్ని చూడవచ్చు. ఈ ప్రదేశంలో 1892 నరేంద్రుడు ఒక రాయి ముందు కూర్చుని ధ్యానం చేసుకున్నాడు. ఈ ప్రదేశంలో హిందూ మత ప్రచారాన్ని చేశాడు. ఆయన ధ్యానం చేసిన స్థలంలోనే తర్వాత కాలంలో వివేకనందుని గుర్తుగా రెండు స్థూపాలను సముద్రమట్టానికి 200 మీ ఎత్తులో నిర్మించటం జరిగింది.

## మద్రాసులో నరేంద్రుడు

చెన్నైగా పిలవబడుతున్న మద్రాసులో పర్యటిస్తున్న సమయంలో నరేంద్రస్వామి చికాగోలో సనాతనధర్మాలను ప్రచారం చేయటానికి అవసరపడే విశ్వమత మహాసభ జరుగుతుందని తెలుసుకున్నాడు. దైవత్వానికీ, నీతిశాస్త్రమునకూ, వేదాంతమునకూ, మాధుర్యానికీ, గాంభీరత్వానికీ, ప్రేమకీ భారతదేశం మాతృభూమి. ఇటువంటి భూమిగురించి ప్రపంచానికి తెలియచెప్పే



చక్కటి అవకాశంగా ఈ విశ్వమత మహాసభ ఉపయోగ పడుతుందని భావించాడు. స్వామికి అనుచరులూ, అభిమానులూ కొంత పైకాన్ని సమర్పించారు. తర్వాత నరేంద్రుడు హైదరాబాదు చేరగా అక్కడి నవాబుతో సహా వేలమంది స్వామికి సత్కారం పలకగా, చికాగో చేరటానికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని నవాబు చెప్పారు.

## 'వివేకానంద' పిలుపుతో నరేంద్రుడు

1893 సం॥ మే 31 వ తేదీన శారదామాత ఆశీర్వాదంతో శ్రీరామకృష్ణుని దీవెనలతో ప్రయాణం చేయ తలపెట్టాడు. మద్రాసులోని ఖేత్రి మహారాజు మంత్రి ద్వారా ఆహ్వానం పంపగా ఖేత్రీ మహారాజుని కలుసుకున్నాడు. ఖేత్రీ మహారాజు తన కుమారుడిని ఆశీర్వదించమని స్వామిని కోరి ఆశీర్వాదాన్ని పొందారు.

నరేంద్రుని విదేశీయాత్రకు కావలసిన ధనాన్ని యావత్తు భక్తితో సమకూర్చారు. ఖేత్రీ మహారాజ్ నరేంద్రనాథ్ దత్తుని 'వివేకానంద' అని సంబోధించారు. ఆనాటి నుండి నరేంద్రుడిని వివేకానందుడిగా సంభోదించారంతా.

## చికాగో పయనం

1893 వ సం॥ మే31 తేదీన బొంబాయి నుండి 'పెనిన్సులర్' అనే ఓడలో చికాగో బయలుదేరారు. దారిలో హాంకాంగ్‌లో బౌద్ధమఠాలను సందర్శించారు. హైందవ, బౌద్ధ ఆలయాల మధ్య తేడాను గమనించారు. ఆ తర్వాత జపాన్ మీద వెళుతూ టోకియో, యెకహోమావంటి ముఖ్యపట్టణాలను చూశారు. అక్కడ జాతీయ సమైక్యంతో కూడిన జపనీయులు స్వశక్తితో, నిర్మాణదీక్షతతో చేసిన పరిశ్రమాభివృద్ధిని చూసి అచ్చెరువొందారు.

వెనువెంటనే మద్రాసునందలి శిష్యులకు అక్కడి వివరాలను తెలపేలేఖ వ్రాశారు. "అభివృద్ధి కోసం జపాన్ ప్రజలు, యువత ప్రస్తుత ఆధునిక యుగంలో స్వశక్తితో, నిర్మాణదక్షతతో, ఆత్మవిశ్వాసంతో పని చేస్తున్నారు. ప్రతి క్షణాన్ని వృధాగాకుండా నిర్మాణవ్యవస్థను అభివృద్ధి పరుస్తున్నారు.తరతరాల నుంచి వస్తున్న మూఢవిశ్వాసాలతో, రాక్షసశాసనాలతో, సేవాభావంతో మునిగిపోయిన యువత ఇకనైనా మేల్కోవాలి.

కులమత బేధాలు వంటి వాటిని కూకటి వేళ్ళతో పెకిలించండి. పరుల పంచన బ్రతకకు దేశం కొరకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడండి. ప్రతి ఒక్కరికి కావలసింది దేశభక్తీ, సహనమూ, నిరాడంబరమూ, స్థిరత్వమూ, పట్టుదల, కృషీ అంతేగాని కీర్తివాంఛా, కనకవాంఛా కాదని తెలుసుకోండి. యువతలో కొంతమందైనా జపాన్‌ను దర్శించాలని నేను కోరతాను" అంటూ తన మాటగా దేశ ప్రజలకు చెప్పవలసింది తెలిపారు.

## చికాగో చేరిన వివేకానందుడు

ఆ తర్వాత స్వామి 1893 వసం॥ జులై 28న చికాగో చేరారు. విశ్వమత మహాసభ ఆరంభం 1893, సెప్టెంబరు 11న జరుగుతుంది. కానీ అక్కడకు



వెళ్ళిన తరువాత ఏ దేశం తరపునయినా సభలో పాల్గొనటానికి నిర్దిష్టసంస్థల చేత పంపబడేవారిని మాత్రమే ప్రతినిధిగా అంగీకరిస్తారని తెలిసింది. పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవలసి తేదీ మించిపోయింది. కార్యవైఫల్యానికి ఖిన్నుడయ్యారు స్వామి. కానీ వివేకానందుని జ్ఞానసముపార్జనను గ్రహించిన మిసెస్ హేల్ అనే వృద్ధురాలు తన యింటికి ఆహ్వానించి ఆశ్రయాన్నిచ్చింది. తర్వాత ఎంతో మంది అమెరికన్లు





స్వామి ప్రతిభాపాటవముల గూర్చి తెలుసుకుని ఆయన్ని దర్శించి తమ సందేహాలను తీర్చుకొనసాగారు. మిసెస్ హేల్ తన పలుకుబడినంతా ఉపయోగించి స్వామిని మహాసభలో పాల్గొనే విధంగా చేసింది.

## విశ్వమత సభ సమావేశములలో నరేంద్రుడు

1893 వసం॥ సెప్టెంబరు 11, సోమవారమునాడు విశ్వమత మహాసభ ప్రారంభమయింది. ఆ సమావేశానికి ఆడవారు, మగవారు కలిపి దాదాపుగా 5000 మందికి పైగానే ఉన్నారు. సభ మొదలయింది. ప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు ప్రసంగించసాగారు.

ప్రపంచ నలుమూలల నుండి ఎంతో పేరుగాంచిన తత్త్వకోవిదులు, కళాప్రపూర్ణులు, పండితుల ప్రసంగాలు జరుగుతున్నాయి. 'రోమన్ క్యాథలిక్' సంస్థ సర్వాధికారి 'కార్డినల్ గిబ్బన్స్' సభామధ్యమంలో ఉన్నతాసీనుడై ఉండగా ఆయన రెండువైపుల పాశ్చాత్య ప్రతినిధులు అత్యంతాకర్షణీయమైన దుస్తులు ధరించి కూర్చుని ఉన్నారు. వారి నడుమ కాషాయధారియై బంగారుచ్ఛాయతో ఉండిన తలపాగాను ధరించి ఆజానుబాహువు అయిన వివేకానందులవారు సర్వజనాకర్షణీయుడై ఆశీసునులై యున్నారు. అందరి ప్రసంగాలు ముగిశాయి చివరికి సభాధ్యక్షులు వివేకానందుని పేరు ప్రకటించారు.

స్వామి ప్రసంగానికి సంసిద్ధులైనారు. ఆ సమయంలో వారి వదనం సహస్ర వజ్రకాంతి వెదజల్లుతోంది. సభ అంతా నిశ్శబ్దంగా ఉంది. స్వామి సరస్వతీదేవిని ప్రార్థించి ప్రసంగాన్ని ప్రారంభించారు. స్వామి మొట్ట మొదటి వాక్యం "అమెరికన్ సోదర సోదరీమణులారా!" అంతే సభికులను ఆయన సంబోధించిన తీరు అమూల్యం. ఆ రెండు వాక్యాలకే సభాప్రాంగణం కరతాళ ధ్వనులతో హోరెత్తిపోయింది. ఆ తర్వాత స్వామి ప్రసంగం గంగాజల ప్రవాహం వలె స్వచ్ఛంగా, లోకోత్తరంగా ముందుకు సాగింది. స్వామి తన ప్రసంగంలో–

"వివిధ ప్రదేశాల్లో పుట్టిన నదులు వివిధ ప్రదేశాల నుంచి పారుతూ సముద్రంలో సంగమం అవుతాయి. అలాగే వివిధ ప్రదేశాలలో జన్మించిన మానవులు వివిధ రకాల భావనములతో వివిధ రకముల ఆరాధనామార్గాలతో ప్రయాణిస్తుంటారు. ఆ మార్గాలు సరయినవి. అందరి గమ్యం పరమాత్మను చేరటమే. ఎవరు ఏ విధంగా, ఏ తీరులో భావించి పూజించినా వారిపై నా భావం ఒక్కటే.... వివిధ మతాల వారు నిర్వహించే మతారాధనలన్నీ భగవంతుని తత్త్వాన్ని తెలియచేసే పలు మార్గాలు మాత్రమే.

సర్వధర్మ సమన్వయమే వదనం. జనన మరణాలకు అతీతమయినది ఆత్మ.... అత్యంత శుద్ధమయినది ఆత్మ. మానవుడి జన్మ, అతడి ప్రస్తుత స్థితి అనేది పూర్వజన్మ ఫలితమే. అతడు చేసే ప్రస్తుత కర్మ భావిదశను నిర్ణయిస్తుంది. భగవంతుడు ఇచ్చిన బుద్ధి సక్రమమైన మార్గంలో పెట్టుకోవడమే మానవుడు పాటించవలసిన విధి. మంచిని మానవునికి తెలిపే శాస్త్రమే వేద శాస్త్రము. ఎవ్వరిచే ఈ ప్రకృతి తన విధులను నిర్వర్తిస్తుందో ఆ భగవంతుని సముఖానికి చేరే మార్గాన్ని తెలియచేయటమే వేదశాస్త్రముల ప్రముఖ్యోద్దేశ్యం.

ఏ గ్రంథాలలో ఎటునుంచి ఎటువైపుకి విషయాన్ని తెలిపినా ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత మానవుల పరమావధి. అటువంటి ధర్మాన్ని పాటించవలసిన రీతిని తెలిపేదీ ధర్మతత్త్వం. అదే సనాతన ధర్మతత్త్వం. విశ్వమత ధర్మతత్త్వం" అంటూ ఏ ప్రతినిధి ప్రసంగించని కోణాన్ని విశదీకరించిన వైనం అద్భుతం. సర్వమత సమరసభావాన్ని ప్రకటించిన స్వామి సందేశం సభాసదులను సమ్మోహితులని చేసింది.

## జగద్విఖ్యాత మహాప్రవక్త

స్వామి ప్రసంగించిన దేశకాల పరిస్థితుల అతీతమైన సనాతన ధర్మమే హిందూమత సారాంశం. యుగయుగాల భారతీయ విజ్ఞాన సంపద స్వామి సందేశంలో ఇమిడి ఉంది. "మా మతమే మోక్షానికి సంగమమయిన దారిని ఒసంగేది. మిగిలినవి అన్యమైనవి, దుఃఖహేతువులు" అంటూ వారి యొక్క మతాలను గూర్చి పొగిడి ఇతర మతాలను దూషించిన ప్రతినిధులు ఉన్నారే గాని మానవకళ్యాణానికి హేతుకారణమైన సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చింది స్వామి వివేకానందుడే. ప్రపంచానికి కావలసినది శత్రుత్వం కాదు శాంతితత్త్వం.

వివేకానందుని ప్రసంగముల ద్వారా ఆలోచనా పరంగా గాని, తత్త్వజ్ఞానం ప్రకారంగా అయినా గాని క్రైస్తవ మతానికి మించిన మతములు ఉన్నవని పాశ్చాత్య ప్రపంచానికి వివేకానందుని ప్రసంగమే తెలియచెప్పింది. ఎటువంటి స్వకీర్తి ప్రయోజనాన్ని ఆశించకుండా ప్రపంచ శాంతి తద్వారా మానవ శ్రేయస్సును కోరిన వివేకానందుని కీర్తి ద్దిగంతాలు మారుమ్రోగిపోయింది. ఆయన జగద్విఖ్యాత మహాప్రవక్తయై నిలిచాడు.

## విదేశీ పత్రికాభిమానాన్ని పొందిన నరేంద్రుడు

సర్వమతములకు అమృతప్రాయమైన, మహోత్కృష్టమతాన్ని గురించి ప్రబోధించిన వివేకానందుడు గూర్చి స్వమతా అభిమాన పూరితులైన పత్రికలు





స్వామి గూర్చి ప్రశంసిస్తూ రాసాయి. న్యూయార్క్ హెరాల్డ్ అనే పత్రిక "సర్వమత మహాసభలో అగ్రగణ్యుడు వివేకానందుడు. ఆ స్వామి ప్రవచనాలను ప్రతి మతస్థులను ఆలకింపచేశాయి. ఆయన విజ్ఞాన, ధర్మార్థ ప్రవచనాలను విన్న తర్వాత ధర్మ నిలయమైన భారతావనికి మా క్రైస్తవ మత బోధకులను పంపటం ఎంత తెలివితక్కువ తనమో అని గ్రహించాము"

సభావేదికపై ఇతర మతబోధకుల ప్రసంగిస్తున్న సమయంలో సభికులు బయటకు వెళ్ళసంసిద్ధులౌతుండగా కార్యనిర్వాహకులు స్వస్తివచనాలకు ముందు వివేకానందుడు ప్రసంగం ఉంటుంది అని చెప్పటంతో ఆ స్వామి ప్రవచనముల కొరకు సభికులంతా చివరి వరకు వేచి యుండటం జరిగింది. కార్యనిర్వాహకులకు కూడా చివరలోనే తీపి తినిపించాలను తెలుసు కాబోలు నిరహంకారి, విద్యావంతుడు, జ్ఞానవంతుడు, సరళహృదయుడు అయిన వివేకానందుడు అందరి ఉత్సకాలకు మించి తన ప్రసంగాన్ని కొలంబస్ భవనంలోని సభికులకు అందచేసి వారి అభిమానాన్ని చూరగొన్నారు.

## అభినందన, విమర్శ

ఎక్కడ అభినందన ఉంటుందో అక్కడ విమర్శ అనేది కూడా సర్వసాధారణము. విమర్శ కూడా స్వామిజీ యొక్క కీర్తిని మరింత పెంచింది. కొంతమంది క్రైస్తవ మత ప్రచారకులు దివ్యజ్ఞాన సముపార్జకులైన వివేకానందుడిని సన్యాసిగా నీచకులస్థుడిగా వ్యాఖ్యానించారు. కొంతమంది భక్షకుడని హేళన చేశారు. స్వామి అఖండ విజయాన్ని విమర్శించాలని చూసిన వారికి ఆయన మొండి చెవి చూపించారు.

## స్వదేశము గూర్చి చింత

చికాగో నగరం వివేకానందుని నిలవెత్తు చిత్రపటాలతో నిండి పోయింది. అమెరికన్ ప్రజలు కొంత మంది స్వామిని విజ్ఞానగనిగా తలంచితే మరికొందరు



దేవుడిగా పూజించారు. నగరంలోని కోటీశ్వరులు స్వామికి ఆతిథ్యం ఇవ్వటానికి పోటీపడి ముందుకు రాసాగారు. ప్రతి రోజు ఆయన ప్రసంగాన్ని వినటానికి సభికులు వేల సంఖ్యలో రాసాగారు. ఒకనాడు స్వామి" హిందూమత వేదాలను చదివి అర్థం చేసుకున్న వారి సంఖ్య ఎంత ఉన్నదో తెలుసా?" అని అడుగగా

నలుగురైదుగురు మాత్రమే చేతులు ఎత్తారు. అప్పుడు స్వామి "ఇటువంటి ఏమీ తెలియని స్థితిలో  మీరు ఏ విధంగా మమ్మల్ని గూర్చి విమర్శిస్తున్నారు" అనగా విమర్శకులు సిగ్గుతో తల దించుకున్నారు.

ఒక రోజు తన ప్రసంగాన్ని అయిదు నిమిషాలతో ముగించబోతుండగా ప్రెసిడెంట్ స్వయంగా వచ్చి మరికొంతసేపు ప్రసంగించ వలసినదిగా కోరాడు. కిటకిటలాడుతూ ఉన్న జనవాహిని సైతం సూదిపడితే వినపడేంత నిశ్శబ్ధంతో స్వామి తెలియచేసిన హిందూ మత ఔన్నత్యాన్ని ప్రాథమిక సిద్ధాంతములను గూర్చి అత్యంత శ్రద్ధతో ఆలకించారు. జగద్విఖ్యాతి గాంచిన వివేకానందుడికి స్వర్గతుల్య వైభవంతో ఆతిధ్యాన్ని ఇచ్చారు.

ఇంతటి ఉత్కృష్టగౌరవాన్ని పొందిన స్వామి ఈ ఐశ్వర్యాన్ని కీర్తి ప్రతిష్ఠలను తలంచుతూ తన మాతృభూమి కొరకు దుఃఖించాడు. "తల్లీ! నా మాతృభూమిలో ఘోర దారిద్ర్యం తాండవిస్తుంటే నాకిక్కిడ ఇంతటి కీర్తి ప్రతిష్ఠలు అవసరమా? లక్షల మంది భారతీయులు దారిద్ర్యంతో తిండిలేక ప్రాణాలు కోల్పోతుంటే నాకిక్కడ విందు భోజనమా... ఐశ్వర్యంతో తులతూగుతున్న ఇక్కడ వీరిని చూస్తుంటే నీడలేక చెట్లక్రిందనే తలదాచుకుంటున్న నా సోదరులు గుర్తుకు వస్తున్నారు. 'మాతా! నా దేశ ప్రజలకు సహాయపడే మార్గాన్ని నాకు తెలుపుము' అంటూ మొరపెట్టుకున్నారు. అన్నీ సౌకర్యాలను తిరస్కరించారు. స్వామి ఇంతటి ఆవేదనను అనుభవించటానికి కారణం స్వామికి దీనులు, దరిద్రులు పట్ల అపరిమితమైన ప్రేమ, సానుభూతులు కలిగివుండటమే.

## స్వామి విదేశీ దిగ్విజయ యాత్ర

భారతదేశ హిందూమత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పటానికి వివేకానందునుకి చక్కటి అవకాశం వచ్చింది. అమెరికాలో ఉన్న సమయంలోని ఒక ప్రముఖ ఉపన్యాస సంస్థ అమెరికాలోని అన్ని ప్రదేశాలలో స్వామి ప్రసంగాన్ని ఇవ్వవలసినదిగా ఆహ్వానించగా తన ఆశయాలను తెలియచేయటానికి ఇదే మంచి అవకాశమని భావించి వారి ఆహ్వానాన్ని ఆమోదించారు.

ఆ తర్వాత స్వామి చికాగో, బోస్టిన్, న్యూయార్క్, వాషింగ్టన్, కేంబ్రిడ్జ్ వంటి ముఖ్య నగరాలలో సనాతన ధర్మాన్ని, హిందూమత ఔన్నత్యాన్ని, వేదాలలోని విజ్ఞానాన్ని చాటిచెప్పారు. ఈ యాత్ర పాశ్చాత్యదేశంలో, సనాతన ధర్మాన్ని వ్యాపింపచేసిన స్వామి దిగ్విజయయాత్రగా నిలిచింది. దాదాపు నాలుగేళ్ళు స్వామి విజయయాత్ర సాగింది. 1897 జనవరి 15న కొలంబో నుంచి కలకత్తాకు





చేరుకున్నారు. ఈ యాత్రలో స్వామికి ఎంతో మంది మనస్ఫూర్తిగా శిష్యులు అయ్యారు.

## ఇంగ్లాండులో వివేకానందుడు

కలకత్తాకు చేరక ముందు స్వామికి పాశ్చాత్య దేశమయిన ఇంగ్లాండులో ఆంగ్ల ప్రముఖులు కుమారి ముల్లర్, ఇ.టి.స్టర్టీ తమ దేశానికి రమ్మని ఆహ్వానం పలికారు. సర్వమానవ కళ్యాణమే ఆశయంగాగల నరేంద్రుడు ఈ ఆహ్వానాన్ని మన్నించి అమెరికా నుండి ఇంగ్లాండు చేరారు.

## పారిస్‌లో వివేకానందుడు

ఇంగ్లాండు నుండి వచ్చే దారిలో ప్యారిస్ మహానగరంలో కొన్ని రోజులు ఉండ  తలంచి అక్కడ ఆగారు. ఈ సమయంలో స్వామికి భారతదేశం నుంచి కొన్ని విషయాలు తెలిసినాయి. పాశ్చాత్యదేశాలలో తాను సాధించిన దిగ్విజయం



పట్ల కొంతమంది వ్యతిరేకులు తీవ్రమైన ఈర్ష్యాఅసూయలతో భారతదేశంలో స్వామిగూర్చి దుష్ప్రచారం చేయసాగారు. ప్రపంచం మొత్తం  తత్త్వజ్ఞానాల్ని తాము మాత్రమే వ్యాపింప చేయాలనుకునే కొంత మంది మత ప్రబోధకులు తమ ఆదాయం పూర్వం కంటే లక్షల తేడాతో తగ్గిపోవటంతో స్వామి కీర్తికి మచ్చని ఆపాదించాలనుకున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న స్వామి ఈ విధంగా అన్నారు.

"నన్నాదేశించటానికి, నాపై హక్కును చెలాయించటం అనవసరం. సన్యాసి అనేవాడు ఆచరించవలసిన నియమములను నేను ఏనాడు వ్యతిరేకించలేదు. నేను జన్మించిన భారతదేశం యొక్క ఆత్మానందాల్ని మేల్కొలుపుతున్నానో అదే విధంగా సనాతన ధర్మంతో ప్రపంచమంతా మేల్కొలపవలసిన అవసరం వుంది. నేను ఏ ఒక్క ప్రాంతానికి చెందిన వాడిని కాదు.

ప్రపంచానికి చెందిన వాడను. ప్రముఖులు, ఐశ్వర్యవంతులు వంటి వారు చేసే రాజకీయాలను నేను ఏ మాత్రం లెక్కచేయను. ధర్మచింతన ఉన్న ఏ మానవుడికయినా ధనవంతుడి ఆశీర్వాదం ఎల్లప్పుడు వెనువెంటనే ఉంటుంది" అంటూ మిత్రునికి తెలియచేశాడు మహాత్ముడైన వివేకానందుడు.

## లండన్‌లో వివేకానందుడు

లండన్‌కి చేరటంతోనే ఆయనకు అత్యంత ఘనసన్మానం ఎదురయింది. లండన్ ప్రతినిధుల ఇంట్లో ఆతిథ్యం జరిగింది. లండన్‌లోని ప్రజలు స్వామిని దర్శించడానికి రాసాగారు. అనుకున్న విధంగా అందరి కోరికపై బహిరంగ ఉపన్యాసం 'పిక్కడిల్లీ' లోని రాజభవనంలో ఏర్పాటు చేశారు.

వేలాది ప్రజల సమక్షంలో స్వామి సనాతన ధర్మాల గురించి వివరించి వారందరికి ఆత్మజ్ఞానాన్ని గూర్చి తెలిపారు. సభికులంతా అమితోత్సాహంతో గౌరవంతో స్వామి ప్రసంగాన్ని విన్నారు. ముఖంలో బుద్ధభగవానుడు గోచరిస్తున్న అతను హైందవ యోగి అంటూ లండన్ దినపత్రిక, వెస్ట్ మినిస్టర్ గెజెట్ అనే పత్రికలో స్వామిని విశేషంగా ప్రశంసలతో ముంచెత్తారు.

ఈ ప్రశంసలనన్నింటి కంటే మించిన ఉత్తమమైన విజయం స్వామికి లభించింది. కుమారి మార్గరెట్ నోబెల్ అనే విద్యాధికురాలు, ఒక విద్యాలయానికి అధ్యక్షురాలు స్వామి ప్రవచనాలను విని ఎంతో స్ఫూర్తిదాయకులై పాశ్చాత్య నాగరికత నుంచి స్వవిశేషాలను అన్నింటిని త్యజించి స్వామికి శిష్యురాలైంది. లండన్‌లోని ప్రజలూ, విద్యాధికులూ, అధికారులూ అంతా తమ వంతు సహాయాన్ని స్వామి ఉద్యమం కొరకు అందించి ప్రపంచ ప్రజాక్షేమకరమైన స్వామి ఉద్యమాన్ని వేనోళ్ళ కీర్తించారు.

## అమెరికాలో స్వామి ఉద్యమాన్ని నడిపించిన శిష్యులు

ఇంగ్లాండులో స్వామి తన అమూల్యమైన వేదాంత విజ్ఞానాన్ని వ్యాప్తి చేయుచుండగా, అమెరికాలో స్వామి తలపెట్టిన ఉద్యమాన్ని ఆయన శిష్యులు కృపానందస్వామి (పూర్వనామము లియోన్ లాండ్స్‌బర్గ్) అభయానంద (మ్మీ మ్యారీ లూసీ), హరిదాసి(మిస్ ఎస్.ఇ.వల్డో) అనే అమెరికన్‌లు విజయవంతంగా కొనసాగించారు. తిరిగి స్వామి అమెరికా వచ్చేనాటికి ఉద్యమం స్ఫూర్తి దాయకముగా నిలిచింది. ఆ తర్వాత స్వామి కార్యసాధన పూర్తిగావించారు.

## గ్రంథ ముద్రణ

స్వామి ప్రవచనాలను లిఖితపూర్వకంగా ప్రజలకు అందితే బాగుంటుందనే యోచన కొంత మందికి వచ్చినా ప్రచురణకర్తలు సరయినవారు లేక ఆచరణలోకి రాలేదు. కానీ జె.జె. గుడ్విన్ అనే అతడు స్వామి ప్రవచనాలను ముందుగా వ్రాయటానికి నడుం కట్టాడు. అతడు హిస్వలిపిలో (షార్ట్‌హాండ్) వివేకానందుడి





వచనామృతం ప్రపంచమంతా వ్యాపించటానికి మూలకారణం అయ్యాడు. నిర్విరామంగా స్వామి చేస్తున్న ప్రసంగాలను గాంచి వివేకానందుడిని 'ఉపన్యాస విద్యుల్లత' అని సంభోదించాడు.

## భారతదేశ పునరాగమనం

విదేశీపర్యటన అనంతరం వివేకానందుడు మాతృదేశోద్ధరణ చింతపట్టుకుంది. పరదేశంలో వ్యాపించిన వివేకానందుడి సనాతన ధర్మ ప్రచారం భారతదేశంలో వ్యాపించి ఉండకుండా ఉంటుందా. సుగంధ పరిమళభరితమైన పుష్పము యొక్క పరిమళం కొంత మేరకే వ్యాపించినా, ఆ పరిమళము యొక్క అనుభూతిని, తలుచుకుంటేనే ఎవ్వరైనా అనుభవించగలరు. పరిమళభరితమైన స్వామి ప్రవచనాసౌరభం స్వామి వేంచేసే సమయానికే భారతావని అంతా వ్యాపించి ఉంది. స్వామి రాకను గూర్చి వింటూనే భారతీయులలో నూతన ఉత్సాహం, నూతన ఉత్తేజం నిండిపోయింది. వివేకానందునికి ఘనమైన స్వాగతం లభించింది.

స్వామి రాక భారతదేశ హైందవమత చరిత్రలో నూతన శకారంభం అయింది. సనాతనధర్మ పునఃప్రతిష్ఠకు అంకురార్పణ జరిగింది. శ్రీలంకలో వివేకానందుడు 1897 వసం॥ జనవరి 15 వ తేదీన దిగారు. అశేష జనప్రవాహం యొక్క స్వాగతాన్ని పొందిన స్వామి కొలంబొ నగరంలో వేదాంత జ్ఞానాన్ని తన ప్రవచనాలతో ప్రజలకు అందించారు. ఆ తర్వాత సింహళంలో కాండి, జాఫ్నా, పాంబన్ వంటి పట్టణాలలో తమ దివ్య సందేశాన్ని ఇచ్చారు. ఆ తర్వాత రామేశ్వరాలయంలో పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఇక్కడ స్వామికి లభించిన ఘన సత్కారం గూర్చి తెలుసుకుందాం.

## ధర్మ విజయ విహారం



ఈ సమయంలోనే పాశ్చాత్య శిష్యులతో స్వదేశానికి విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని రామనాథపుర రాజు స్వామి మాతృదేశాగమన జ్ఞాపకార్థం నలభై అడుగుల విజయస్థూపాన్ని నిర్మించాడు. రాజాసేతుపతి నిర్మించిందని, శ్రీమద్వివేకానందస్వాములవారు విశ్వమానవాళికి ప్రీతికారులై పాశ్చాత్యులైన శిష్యులతో మాతృదేశానికి విచ్చేసి ప్రప్రథమంగా భూభాగంపై తమ దివ్యపాదారవిందములు మోపిన పవిత్ర స్థల

సూచకం అంటూ ఆనాటి తేదీని 27-1-1897గా స్థూపంపైన లిఖించారు. ఆ తర్వాత వివేకానందుల వారు మధుర, తిరుచునాపల్లి, కుంభకోణం, మద్రాసుల వంటి ముఖ్య పట్టణాలలో అఖండ గౌరవాన్ని పొంది తన అమూల్య సందేశములను వారికి అందచేసి కలకత్తా చేరారు.

## స్వప్రాంతమైన వంగదేశాగమనం

కలకత్తా నగరం యావత్తు స్వామి రాకకై  ఎదురు చూసింది. ఆ శుభముహూర్తం రానే వచ్చింది. అనేక జన వాహిని స్వామికి స్వాగతం పలికింది. ప్రతి ఒక్కరు స్వామి పాద స్పర్శకోసం తాపత్రయపడ్డారు. అది లభించని వారు కనీసం పాదధూళినయినా పొందాలని భావించారు. ఇండియన్ మిర్రర్ పత్రికాధిపతులు నరేంద్రనాథ్ సేన్ స్వామిని పూలమాలతో అలంకరించి అశ్వశకటంలో ఆసీనుణ్ణి గావించారు.

కానీ స్వామిపై అభిమానాన్ని నిలువెల్లా నింపుకున్న అభిమానులు అశ్వములను విప్పి వేసి స్వామి ఎక్కిన వాహనాన్ని స్వయంగా లాగసాగారు. పూలవర్షం కురుస్తుండగా  స్వామి ఎక్కిన వాహనం కాశీపురోద్యానవనమునకు చేరింది. అక్కడ ఏర్పాటు చేయబడిన సభలో హిందూమత సారాన్ని, హిందూమత విజ్ఞానాన్ని నూతన రీతిలో సభికులకు తెలియచేసి వారిలో నూతన దృక్పథాన్ని కలిగేలా చేశారు. ఆధునిక భారతావని ప్రవక్తగా ప్రముఖులచే ప్రశంసలను అందుకున్నాడు.

## శ్రీరామకృష్ణ సంఘసంస్థాపన

ఆ తర్వాత కొంత విశ్రాంతి అనంతరం స్వామి హిందూమత సాంఘిక వ్యవస్థను పరివర్తన చెందించటానికి ఎంతో కృషి చేశారు. నిర్విరామంగా వైదిక ధర్మాచారాలను నూతన పద్ధతులలో విశదీకరించారు. కొత్త కొత్త విధానాలతో ప్రజల దగ్గరకు రాసాగారు. ఆ తర్వాత కొన్ని రోజులకి శ్రీరామకృష్ణ పరమహంసల వారి జన్మదినోత్సవాన్ని దక్షిణేశ్వరంలో ఘనంగా జరిపారు.

ఆ సమయంలో వివేకానందుడు బోధనపూర్వకంగా, ఆచరణపూర్వకంగా హిందూమతం లోని ధర్మతత్త్వాలను సనాతన ధర్మతత్త్వంగా వ్యాప్తిచేయకోరి ఒక సేవాసంఘసంస్థను స్థాపించటం అవసరమనుకున్నారు. తన ఉద్దేశ్యాన్ని శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యులకు ప్రతిపాదించారు. వారంతా ఆమోదించారు.

ఈ సంస్థలో ఐహికాముష్మిక శ్రేయోదాయకులైన విద్యలను నేర్పించటానికి అర్హులయిన వారిని నియమింపచేయటం కళలను, పరిశ్రమలను వృద్ధిచేయటం, శ్రీరామకృష్ణులవారు సృష్టీకరించిన వేదాంతాది మతాభిప్రాయములను జనసామాన్యానికి అందచేయటం వంటి వాటిని సంఘకార్య నిర్వహణా మార్గాలుగా ఏర్పాటు చేశారు. సేవాభావంతో ఉండే కార్యకర్తలను ఈ సంఘానికి ఏర్పరచారు. బ్రహ్మానందస్వామిని సాధారణ అధ్యక్షుడిగానూ, యోగానందుణ్ణి ఉపాధ్యక్షుడిగానూ స్వామి నియమించి తాను సాధారణ అధ్యక్షుడుగా ఉన్నారు.

ఆ తర్వాత సంఘసేవాకార్యక్రమములు అనూహ్యంగా అభివృద్ధి గాంచటంతో 1909సం॥స్వామి ఈ సంస్థను శ్రీరామకృష్ణ సేవాసంఘమనీ, శ్రీరామకృష్ణమఠమనీ రెండు భాగాలుగా విభజించి సుశిక్షుతలైన, ధర్మాచారా పరాయణులైన సన్యాసులను సేవాసంఘ కార్యనిర్వాహకులుగా నియమించారు. స్వామి హిందూమత సిద్ధాంతాలు కేవలం భారతదేశంలోనే కాక పశ్చిమపాశ్చాత్య దేశాలలో కూడా వ్యాపింపచేయాలని భావించారు.

ఇంకా యీ సంస్థలో సన్యాసులతో పాటు గృహస్థునకు కూడా తమని తాము మలుచుకోవటమే కాక ఇతరుల సనాతన ధర్మాన్ని బోధించి వారిని మార్చే విధానాన్ని కూడా శిక్షణ ఇచ్చారు. ఇటువంటి శిక్షణ కొరకు కొన్ని ఆశ్రమాలను నెలకొల్పటం జరిగింది. శిక్షణ పొందిన సిద్ధులను విదేశాలకు పంపి సేవను చేయించారు. ఈ విధానం వలన భారత, విదేశాల మధ్య సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటాయనేది ముఖ్యోద్దేశ్యం.

స్వచ్ఛమైన జ్ఞానాన్నీ మరియు మానవ ధర్మాలనీ బోధించటమే ఈ సంస్థల యొక్క ముఖ్యోద్దేశ్యము. 1897 లో కలకత్తాలో సంస్థ స్థాపన చేసిన వివేకానందుడు, 1899 దక్షిణేశ్వరం దగ్గరలోని బేలూరులో మఠాన్ని స్థాపించారు. బేలూరులోని హిందూసేవాసంస్థ అయిన ఈ రామకృష్ణమిషన్ అన్నీ ఆశ్రమాలకి ప్రథమ విభాగం అయింది.

## దేశంలో రామకృష్ణ సేవా సంస్థలు

1897 లో వివేకానందుడిచే ఈ సంస్థ ప్రస్తుతం భారతదేశంలోని అన్నీ ముఖ్య పట్టణాలలోనే కాక ప్రపంచంలోని ఇతర ముఖ్య దేశాలలో కూడా శాఖలను విస్తరింపచేసింది. మానవ శ్రేయస్సుకొరకు చేసే ఈ మతాభివృద్ధియే స్వామి వివేకానందుని లక్ష్యమని తెలియ చెప్పారు.

స్వమతమే కాక ఏ మత గ్రంథములైనా సర్వమానవాళికి మంచి చేయమనే ప్రబోధిస్తుందని తెలిపారు. గ్రంథాలన్నింటిలో ఉండే విషయం ధర్మబద్ధమైంది, సమానమైందే అయితే దానిని ప్రవచించే వారి దృక్పథంతో ఆ అర్థం

మారిపోతుందని అన్నారు. 1899 మార్చిలో హిమాలయములలో మాయావతి అనే ప్రదేశంలో స్వామి వివేకానంద అద్వైత ఆశ్రమాన్ని స్థాపించారు.

## ఉత్తర భారతావనిలో స్వామి

అనేక కార్యక్రమాలతో నిర్విరామకృషి చేస్తున్న స్వామి ఆరోగ్యం కొంత దెబ్బ తినటంలో స్వామి ఉత్తర భారతంలోని హిమాలయములకు విశ్రాంతి కొరకు పయనమై అల్మోరా చేరారు. స్వామి రాకతో అల్మోరా వివిధ ప్రాంతాల ప్రజావాహినితో నిండిపోయింది. అశేష ప్రజానీకం స్వామికి ఘనమైన స్వాగతాన్ని పలికారు. 'సర్వేజనా సుఖినోభవంతు' అనే దృక్పథాన్ని కలిగిన స్వామి ప్రజలనుద్దేశించి ఈ విధంగా ప్రసంగాన్ని ఇచ్చారు.

"వివిధ వర్ణాల పేరుతో సమాజం విడిపోకుండా అంతా సమైక్యతతో ఉండి వివాహాలను జరపాలి. అపరిమితమైన సంతానంతో దేశానికి బానిసలను అందించటం కన్నా పరిమిత సంతానం అత్యవసరం. జనసామాన్యుల స్థితిని మెరుగుపరచటానికి విద్యావ్యాప్తి అత్యవసరం. విద్యసముపార్జన లేకుండా అమ్మాయిల వేదపఠనము పరిసమాప్తి జరగదు. మేధాసంపత్తిని పెంపొందించటానికి విశ్వ విద్యాలయముల స్థాపన అవసరం.

అంతఃకలహములు వీడి భారతావని సమైక్యతను కలిగి ఉండటం సర్వమానవాళికి శ్రేయస్సును అందచేస్తుంది. స్వార్థం, ద్వేషాలు వీడండి. త్యాగం, ప్రేమలు ఉత్తమ ఆదర్శములని ప్రతి మానవుడు గుర్తించటమే కాక ఆచరించాలి. సనాతన ధర్మతత్త్వాలను వంటబట్టించుకుని యువకులు పాశ్చాత్యదేశాలకు చేరి పాశ్చాత్యులను సనాతన ధర్మతత్త్వాలను బోధించటమే కాక అభివృద్ధి చెందిన సాంకేతిక విద్యలను నేర్చుకుని స్వదేశీ అభివృద్ధి పథానికి తోడ్పడాలి".

## స్వామి ఉద్యమంలో శిష్యుల పాత్ర

సన్యసించిన వారే కాక గృహస్థులు కూడా వివేకానందులచే వ్యాప్తించబడుతున్న సూత్రాలను ఆచరించారు. స్వామి నడిపే ఉద్యమంలో, నిర్వహణ బాధ్యతలలో స్వామి శిష్యుల భాగం ఉన్నదనటంలో ఎటువంటి సందేహం లేదు. బేలూరులో స్వామిచే 1898వ సంవత్సరంలో శ్రీరామకృష్ణమఠస్థాపనకు అయిన ఖర్చులో మూడో వంతు భాగాన్ని స్వామి శిష్యురాలైన కుమారి ముల్లర్ సమర్పించింది. ఆమె అమెరికన్ మహిళ, స్వామి శిష్యురాలైనను ఓల్‌బుల్‌సతి శ్రీరామకృష్ణుని పూజామందిర నిర్మాణ ఖర్చుని సమర్పించింది.





ఇంకా స్వామి శిష్యురాలలో ముఖ్యురాలైన కుమారి నివేదితగా మారిన మార్గరెట్ ఇనోబెల్, జోసఫైన్ యాక్లియోడ్, ఓల్‌బుల్ వంటి పాశ్చాత్యశిష్యులు బ్రహ్మచర్య దీక్షను స్వామిచే ఒసంగబడి గంగానదీ తీరంలో కుటీరాన్ని నిర్మించుకుని నివసిస్తూ స్వామి బోధించినట్టు తమ జీవితాన్ని దీనులకు తగు సహాయాన్ని అందిస్తూ గురూహ్య పరిపాలకులై ఆదర్శజీవనం సాగించారు.

## ప్లేగువ్యాధితో కలకత్తా నగర ప్రజలు

వివేకానందులవారు అల్మోరా నుండి డార్జిలింగ్ చేరారు. ఆ సమయంలో కలకత్తాలో ప్లేగు వ్యాధి ప్రజలను బలిగొంటుందనే వార్త విని తన వంతు సహాయాన్ని నిర్వర్తించటానికి కలకత్తా చేరి తన వద్ద ఉన్న ధనాన్ని వెచ్చించటంతో పాటు శారీరకంగా వ్యాధిగ్రస్థులకు సేవ చేశారు. ఒకానొక సమయంలో "ధనం కొరకు సేవాభావాన్ని కలిగిన వారు తగురీతిన ధనాన్ని సమకూర్చవలసినదని" దేశవ్యాప్తంగా ప్రకటనలిచ్చారు. డబ్బు లభ్యమవుతుందా, లభ్యమయినది సరిపోతుందో లేదో అని సందేహపడ్తున్న శిష్యునితో ధనము సమకూరకపోతే మనం స్థాపించిన మఠాదులను అమ్మి సేవచేద్దాం అన్నారు.

సన్యాసులమైన మనము చెట్టు క్రిందనైనా ఉండి మన సేవోద్యమాన్ని నడపసంసిద్ధులమై ఉండాలని శిష్యులకు బోధించిన మహోత్కృష్ట వివేకానందుడు తన భావాలను అందరికి చెప్పటమే కాక ఆచరించి చూపాలని చెప్పేవారు. కానీ అంత అవసరం లేకుండా స్వామి ప్రకటనకు ప్రతి స్పందన లభించి అవసరమైన ధనంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చాయి.


## నైనిటాల్‌లో స్వామి

నైనిటాల్‌లో స్వామి పురజనులకు తన ప్రవచనాలను ప్రసంగ రూపంలో సభికులకు అందించారు. తన ప్రసంగాలలో పాశ్చాత్యమత ప్రబోధకులకు మతపరమైన జ్ఞానం తక్కువ ఉండటం వలన వారు విషయాన్ని అందించలేరు అంటూ ఒక ఉదాహరణ చెప్పారు. ఒక పాశ్చాత్య మత ప్రబోధకుడు ఒక బొగ్గుగనిలో పనిచేసే కార్మికులకు వారి మతగ్రంథ విషయాలను ఓపికగా చెప్పాడు.

తర్వాత వారిని తమ 'దేవుడి' గూర్చి తెలిసినదా అని అడిగితే అతడు వారి దేవుడు కూడా ఒక కార్మికుడే అని భావించారు. అంటే విషయపరిజ్ఞానాన్ని పామరులకు అందచేయటంలో వారు విఫలులయ్యారు. అనగా వారి మత

గ్రంథ సారాంశం సవ్యంగా వారికే తెలియకపోవటమే వారి వైఫల్యానికి కారణం అంటూ" తన ప్రసంగానికి మోక్షోపాయి ఉపదేశాలను సులభరీతిలో జనప్రవాహానికి తెలిపారు.

## దేశభక్తి గూర్చి తెలిపిన స్వామి



స్వామి అల్మోరా నుంచి సుందరప్రదేశమైన కాశ్మీర్ చేరుకున్నారు. అక్కడి ప్రకృతినాస్వాదించి కొంతకాలం ధ్యాననిమగ్నులైన స్వామి శ్రీనగరానికి చేరారు. అక్కడ ప్రజలకు దేశభక్తి గూర్చి సందేశమిచ్చారు. దేశభక్తి విషయానికి వస్తే జపాన్‌వారి దేశభక్తి అసమాన్యం. అక్కడ వారు మాట్లాడరు. చేస్తారు. కార్యశూరులు వారు.

దేశం కోసం సమస్తం త్యాగం చేసే వారు అక్కడ ఉన్నారు. రాజకీయ హక్కులను దేశ సమైక్యతకు ఉపయోగిస్తారు. దేశద్రోహి అనే వాడు అక్కడ కనిపించడు. మనిషి దేశం కోసం నిర్వహించాల్సిన ధర్మాన్ని తెలిపారు.

## పరమేశ్వర నిలయమైన అమర్‌నాథ్‌లో స్వామి

శిష్యురాలయిన నివేదిత అనుసరించగా వివేకానంద స్వామి కొన్ని రోజులు ప్రయాణం అనంతరం అమర్‌నాథ్ చేరారు. ప్రయాణంలో తటస్థించిన పుణ్యతీర్థంలో స్నానమాచరించారు.

పూర్వాచార పరాయణులు పాశ్చాత్యదేశస్థురాళ్ళు స్వామి వెంట ఉండటాన్ని ముందుగా వ్యతిరేకించారు. కానీ స్వామి యొక్క వైరాగ్య ప్రతిభాతిశయమును, నివేదిత అనంత భక్తి సౌజన్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకుని స్వామికి పాదాక్రాంతులయ్యారు.

వివేకానందులవారు భగవత్ దర్శనానికి ముందుగా ఉపవాసం ఉండి స్వామిని దర్శించి, పూజించి, జపించి ఆలయ ప్రదక్షిణ గావించి అనంతరము ప్రసాదాన్ని ఇస్తారు.

అదే విధంగా ధవళగంగాధరుడైన స్వామి హిమలింగము ముందు సాష్టాంగ ప్రణామములు సమర్పించి భావసమాధిలో నిమగ్నులైనారు. ఆ తర్వాత హిమలింగ స్వరూపుడుని తాను సాక్షాత్కరించుకొని స్వేచ్ఛామరణం పొందేటట్లు వరం ప్రసాదించుకున్నానని శిష్యగణంకు చెప్పారు. దీనికి కారణం ధ్యానసమయములో స్వామి శరీరం ప్రకంపితమై అపూర్వపరిణామాన్ని పొంది అంతలో సూర్యకాంతి ప్రకాశితమైంది.





## పరివర్తిత మనస్కుడైన వివేకానందుడు

ఎంత ధర్మాచరణ పరాయణుడైన సన్యాసికయినా మారుమూల ఎంతో కొంత అహంకారం ఉండే ఉంటుంది. అది కూడా తొలగితే గాని ఆ జీవుడు పరివర్తిత మనస్కుడు అవడు. స్వామిలోనే ఉన్న ఆ భావం పూర్తిగా తొలగిపోయే మార్గాన్ని సాక్షాత్తు ఆ జగన్మాత కలిగింపచేసింది.

అమరనాథ్ యాత్రానంతరం స్వామి మనస్సు జగన్మాతృభావంతో నిండిపోయింది. శిష్యులందరిని వీడి ఒంటరిగా క్షీరభవాని ఆలయంలో కొన్ని రోజులు ఉండ తలచి అక్కడికి చేరుకున్నాడు. నిత్యం క్షీరభవానికి క్షీరంతో అభిషేకం చేసి, జపహోమాదులతో భక్తిభావనలతో పులకించిపోసాగాడు.

కానీ కొన్ని దినాల అనంతరం మహమ్మదీయులు దుశ్చర్యకు గురి అయిన క్షీరాభవానీ ఆలయాన్ని గమనించుతూ ఇంతకు దుశ్చర్యకు పాల్పడుతున్న సమయంలో హిందువులు ఏం చేస్తున్నారు. మహమ్మదీయులను ఎదురించకుండా ఎందుకు మిన్నకుండిపోయారు. నేను గనుక ఆ సమయంలో ఇక్కడ ఉంటే వారిని అడ్డగించి ఉందును గాక" అంటూ భావన ప్రకంపనాలతో ఊగిపోయారు.

అంతలో స్వామికి అశరీరవాణి పలికి "నాయనా! మతాంతరులు నా ఆలయాన్ని ధ్వంసం చేస్తుంటే వారిని ఆపటం నాకూ తెలుసును. నేను తలంచితే పెక్కు ఆలయాలను నిర్మించుకోగలను. నీ కెందులకీ తాపత్రయం? నీవు నన్ను రక్షిస్తావా? నేను నిన్ను రక్షించేదాన్నా?" అంటూ వినవచ్చాయి. అంతే స్వామిని ఆవరించిన 'నేనూ' అనే అహం మాయమైపోయింది. సమస్తం దైవాదీనమై గోచరించింది. పరివర్తితమనస్కుడైన స్వామి బేలూరు మఠానికి చేరుకున్నారు.

## పిశాచగణ శాంతికి స్వామి ప్రార్థన

అమర్‌నాథ్ యాత్రానంతరం బేలూరు మఠానికి వచ్చిన స్వామి కొంతకాలం దివ్యమైన అనుభూతులతో మెలగసాగారు. తన శిష్యులకంతా జరిగిన క్షీరభవానీదేవి వృత్తాంతాన్ని తెలిపారు. అంతట శిష్యులలోంచి ఒకరు "స్వామీ! మీరు దయ్యాలనెపుడైనా చూశారా..... మాట్లాడారా?" అని అమాయకంగా



ప్రశ్నించాడు. దేవత అశరీరవాణి తనకు వినిపించిందనగానే ఉద్భవించిన ఆ ప్రశ్నకి స్వామి చిన్నగా నవ్వుకుని ఈ విధంగా చెప్పారు. "నా దూర బంధువులలో ఒకామె పిశాచియై నాకు అప్పుడప్పుడు కన్పించుతూ దూరప్రాంతాలలో జరిగిన వృత్తాంతాలను కథలుగా చెప్పేది. కానీ నేను వాటి గురించి

వాకబు చేయగా అది తప్పు అని తెలిసింది. ఆ తర్వాత ఒక పుణ్యప్రదేశంలో ఆమె పిశాచజన్మ నివృత్తికై భగవంతుడిని ప్రార్థించాను. ఆ తర్వాత నాకెన్నడూ ఆమె కనిపించలేదు. ఇంకా ఇటువంటు సంఘటనే మద్రాసులో ఉండగా తటస్థించింది.

ఒకనొక సమయాలలో పిశాచములు గుంపుగా కన్పించి పిచ్చి వృత్తాంతాలను, కోర్కెలను తెలుపుతుండేవి. కొన్నిసార్లు తర్వాత వాటిని ఎందుకీ విధంగా గొడవ చేస్తున్నారు అని గద్దించగా తాము అనుభవిస్తున్న దుస్థితిని గూర్చి విచారం వ్యక్తం చేసాయి.

దానితో సముద్రతీరానికి చేరి ఇసుకతో ఆ పిశాచాలన్నింటికి పిండ ప్రదానం చేసి వాటికి ఆత్మశాంతిని చేకూర్చాను. ఆ తర్వాత అవి నాకు కనుపడలేదు" అని చెప్పారు. స్వామి ఎల్లప్పుడు గాంభీర్యతనే కాక కొంత చిలిపిదనాన్ని కూడా ప్రదర్శించేవారు. దానికి ఉదాహరణే వివేకానందుడు శిష్యుని కిచ్చిన సమాధానం.

## ధర్మాచరణ పట్ల స్వామి

స్వామి ఉపదేశములు శిష్యులకందరికీ సమానముగానే ఉండేవి. చిన్న విషయానికి కూడా ప్రతివ్యక్తి అత్యంత శ్రద్ధ వహించాలని హెచ్చరించేవారు. ఏకాగ్రత, పరిశుద్ధమనస్సుతో చేయని వంటలో రుచి ఉండదు. విశ్వాసము, శ్రద్ధ వంటివి శరీరంలో దివ్యత్వాన్ని ప్రకాశింపచేస్తాయి. శ్రద్ధాభక్తులు ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు.

మనుషులపట్ల బేధములు చూపటం, ఆచార వ్యవహారాలకు జంకకుండా, నిర్భయంగా సత్యాన్ని ప్రకటించటం ముఖ్యం. శుద్ధమైన మనస్సుతో చేసే ప్రతి పని విజయాన్ని సాధిస్తుంది.

స్వామి శిష్యగణంలో పాశ్చాత్యమహిళ అయిన నివేదిత నెలకొల్పిన బాలికాపాఠశాలను స్వామి మనసారా ఆశీర్వదించారు. ఎటువంటి అధిక్షేపణలు మించకుండా బ్రహ్మచర్య నియమాలన్నింటిని యధావిధిగా పాటిస్తూ ఆమె నిర్వహించిన కార్యక్రమాలు పురోభివృద్ధిని పొందాయి.

భారతీయులు నివేదితకు సముచితస్థానాన్ని మనస్ఫూర్తిగా అందచేసే విధంగా స్వామి ఆమెను తీర్చిదిద్దారు. నివేదిత వండినవి తాను భుజించటమే కాకుండా శిష్యగణమంతా స్వీకరించేలా చేశారు.





## నిర్భాగ్యులపట్ల స్వామి ప్రవర్తన

సర్వమానవాళి ఉన్నతిని కోరుకునే స్వామి ప్రేమాభిమానములు ప్రతి ఒక్కరి పట్ల ఒకేలా ఉండేవి. కానీ 'లోకులు కాకులు' అనే సామెత ఊర్కనే రాలేదు. స్వామి స్తుతి ప్రియులని, ఆయనను స్తుతించిన వారిని స్వామి మరింత అభిమానంతో ఆదరిస్తారని విమర్శపొందారు. ఆయన ఎటువంటి చలనము లేక మౌనంగా ఉండిపోయారు. స్వామి వ్యతిరేకించకపోవటం గురించి ఒక శిష్యుడు వివరము కోరగా స్వామి ఈ విధంగా బదులిచ్చారు.

"నాయనా! నీవు విన్నది నిజమే. కానీ ఏ వ్యక్తి ఎలాంటివాడో ఎందుకు నా వద్దకు వచ్చాడో అతనిని చూసినంతనే నేను గ్రహించగలను. దుష్టుడైన వాడినీ, ఎక్కువ స్తుతిని చేసేవాడినీ నేను ఆదరిస్తాను.

ఎందుకనగా పూర్వము వారు చేసిన పాపాల నుంచి నివృత్తులయి శాంతిపొందాలనే ఉద్దేశ్యంతోనే నావద్దకు చేరి వారి వారి అభిమతాలను బట్టి నాతో ప్రసంగిస్తారు.

అలాంటి స్థితిలో ఉన్న వారిని విమర్శించటం వలన ఎవ్వరూ లాభం పొందరు. మనోవ్యాధితో వచ్చిన వారి స్థితిని చూచి వారిని శాంతింపచేసి వారి మనోవ్యాధినే తీర్చాలి గాని అన్య విషయాల పట్ల శ్రద్ధ వహించటం అనవసరం" అన్నారు.

## శారీరకమైన ఇబ్బందులతో స్వామి

ఆరోగ్యపరంగా స్వామి ఎంతో జాగ్రత్త వహిస్తారు. శరీరమనే గృహములో మనము నివాసమేర్పరుచుకున్నందుకు జీవి చెల్లించాల్సిన అద్దె వ్యాధి అని శిష్యులతో చెప్పేవారు. అధిక రీతిలో శరీరాన్ని వాడుకుంటే అంతే అధిక వ్యాధుల బారినపడతామని, ఎంతో మితంగా శరీరాన్ని వాడుకుంటే అంత తక్కువగా వ్యాధి బాధలని అనుభవిస్తారు.

కానీ ప్రతి జీవి ఎంతో కొంత అద్దెను మాత్రము చెల్లించవలసిందే. స్వామి అమర్‌నాథ్ నుంచి తిరిగివచ్చిన తర్వాత జబ్బుతో కొన్ని రోజులు బాధననుభవించారు.

వైద్యులు శారీరక ఆరోగ్యం గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని చెబుతూ స్వామికి విశ్రాంతి చాలా ముఖ్యమని తెలిపారు. శారీరక బాధను అనుభవిస్తున్న సమయంలో స్వామి ఎక్కువగా ధ్యాననిమగ్నులై ఉండేవారు. శిష్యులు స్వామిని ఎల్లవేళలా కనిపెట్టుకుని ఉండేవారు.

## సమాజిక ఆచారములు

అనారోగ్యకారణంగా స్వామి విశ్రాంతి కొరకై వైద్యనాథానికి వెళ్ళారు. అక్కడ ఒక భక్తుడి కోరికపై వారి ఇంట్లో బసచేశారు. ఆ సమయంలో స్వామికి తోడుగా సోదరుడు, శిష్యుడు అయిన నిరంజనానందుడు ఉన్నారు. అతడే స్వామికి అన్నీ సపర్యలు చేస్తూ జాగ్రత్తగా వ్యవహరించెడివాడు. ఒకనాడు వీరిరువురూ కలిసి వ్యాయామం నిమిత్తంగా ప్రొద్దుటే నడుచుకుంటూ పోసాగారు. కొంతదూరంలో వారికి దారి ప్రక్కనే ఒక అభాగ్యుడు రోగగ్రస్థుడై దిక్కులేకుండా పడి ఉన్నాడు.

స్వామి అతని వద్దకు చేరి వివరణ తెలుసుకుని అతడిని సోదరుడి సహాయంతో తాము ఉండే ప్రదేశానికి తెచ్చారు. రక్తంతో తడిచిన దుస్తులతో ఉన్న అతడికి స్నానము చేయించి శుభ్రమైన దుస్తులు ధరింపచేసి సపర్యలు చేశాడు. ఇదంతా చూస్తున్న శిష్యుడు స్వామి దీనజన వాత్సల్యానికి అచ్చెరు వొందాడు. ఈ సందర్భంగా స్వామి వారితో ఇలా చెప్పారు.

"ఎటువంటి ఆచారమునైనా సంఘంలోకి బలవంతంగా ప్రవేశపెట్టే హక్కు అధికారం ఎవ్వరికి లేదు. సామాజిక అవకాశములను బట్టీ, పరిస్థితులను బట్టి సమాజానికి అవి అవసరమైనట్లయితే అనుకూలమైన, శ్రేయస్కరములైన ఆచారములను అవలంబించవచ్చు.

బలవంతంగా ప్రవేశబెట్టిన ఆచారములు తాత్కాలికంగా మంచి ఫలితాలనే ఇచ్చినా కాలక్రమేణా అవి మహోపద్రవ హేతువులు అవుతాయనటంలో ఎటువంటి సందేహం లేదు" ఈ వాక్యములు రోగగ్రస్థుల పట్ల సమాజం చూపుతున్న అమానుష ఆచారములను గూర్చి చెప్పారు.

## నివేదిత

నివేదిత అనగా తను తను అర్పించుకోవటం. స్వామి వివేకానందుడు ఇండియా ప్రతినిధిగా చికాగో వెళ్ళిన సమయములో ఆయనకి ఎంతోమంది మార్గదర్శకులైయ్యారు. విశ్వమత మహాసభలో ప్రపంచ సమైక్యత, మైత్రీబంధము, సోదరసామానత్వముల ఆవశక్యత పట్ల ఆయన ఇచ్చిన ప్రసంగాలకీ, ప్రవచనాలకూ అయిన స్వామి ఆరాధకుల్లో, శిష్యులలో గుర్తించుకోవలసిన ఆరాధకురాలు మార్గరెట్ ఇ నోబెల్.

1867 వ సంవత్సరములో ఈమె దునగనోన్ దేశంలో టైరోన్ అనే ప్రదేశంలో జన్మించింది. చిన్నతనం నుంచి క్రైస్తవ మత సాంప్రదాయాలను





జీర్ణం చేసుకుని ఉంది. ఈమె హాలిఫ్యాక్స్ కాలేజీలో విద్యాభ్యాసాన్ని గావించింది. వింబుల్డెన్‌లో స్వయంగా స్థాపించిన రుస్కిన్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండేది. ఈ స్కూల్‌లో ఫోబెల్ సిద్ధాంతాలలో కూడిన విద్యను నేర్పేవారు.

సత్యం కొరకు అన్వేషిస్తున్న ఆమె అన్వేషణ 1895-96 వ సంవత్సరంలో స్వామి వివేకానందుని వేదాంత ప్రవచనాబోధనల ద్వారా ఫలించింది. ఆ తర్వాత ఆమె ఇండియా చేరింది. శ్రీరామకృష్ణునీ, కాళీనీ, పరమశివుడ్నీ ఆరాధించింది. ఆమె వివేకానందుల వారికి ప్రియ శిష్యురాలై, దేవుడిచ్చిన బిడ్డగా అందరి మన్ననలను పొందింది.

1898వ సంవత్సరం కలకత్తాలో స్వామి వివేకానందులవారు ఆమెకి 'నివేదిత' నామాన్ని ఇచ్చారు. అప్పటి నుండి ఆమె శ్రీరామకృష్ణ-వివేకానందుల నివేదితగా ఇండియాలో మెలిగింది. స్వామి నుంచి హిందూమతాచారాశయాల గూర్చి పెక్కు బోధనలు తెలుసుకుంది.

ఎల్లవేళలా స్వామి వెన్నంటి ఉండే ఆమె తాను రచించిన 'మాస్టర్ యాస్ ఐసా హిమ్' అనగా నాకు గోచరించిన గురువరేణ్యులు" అనే పుస్తకంలో వివేకానందుని జీవిత చరిత్రను, ప్రవచనాలను విశదీకరించి భావితరాల వారికి అందించింది.

స్వామి వివేకానందుడు ఆమెను నిజమైన ఆడసింహమనేవారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌తో 'లోకమాత'గా పిలిపించుకుంది. 1898లో ఇండియా, ఇంగ్లాండ్ల మధ్య సమైక్యత నెలకొని ఉండాలని ప్రయత్నం చేసింది. హిందూమతతత్త్వముతో ఉద్భవించి భారతావనిలో హిందూ ఆచారవ్యవహార నియమాలను పాటించుతూ ఎంతో సామాన్యంగా కఠినమైన జీవనము సాగించింది.

భారతీయులు ఆమె సమాధిపై "తన సమస్తాన్ని భారతదేశానికి సమర్పించిన రామకృష్ణ-వివేకానందులకు దేవుడిచ్చిన బిడ్డ. ఆ సిస్టర్ నివేదిత యొక్క అస్థికలు ఇక్కడ శయనించి ఉన్నాయి" అంటూ వ్రాసి ఆమె జ్ఞాపకాన్ని శాశ్వతం చేశారు.

## భారతస్వాతంత్ర్య పోరాటం గూర్చిస్వామి

స్వాతంత్ర్య పోరటాన్ని దేశంలో జరుపుతున్న రోజులవి. ఒకసారి ఒక శ్రామికుడు వివేకానందుల వారి వద్దకు వచ్చి "స్వామీ! మీరు ఎందుకు స్వతంత్ర్య పోరాటంలో నిమగ్నమై పోరాటాన్ని చేయరు" అని ప్రశ్నించాడు. అంతట స్వామి "నేను మన దేశానికి స్వాతంత్ర్యము రేపటి రోజుకే తెప్పించగలను. కానీ ఆ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకునే సమర్ధత ఎవరికి ఉంది" అన్నాడు.

ఆ మాటలు స్వతంత్ర్య సమరయోధులకూ నిర్మాణశ్రామికులకూ ఎంతో స్ఫూర్తిదాయకమై స్వాతంత్ర్యాలు పట్ల వారి కృషినీ, శ్రమనీ మరింత వృద్ధిపరిచి అంకితభావంతో పనిచేసేలా చేశాయి.

'ప్రతి భారతీయుడుకి స్వతంత్ర్యం పట్ల అవగాహన ఉండి స్వతంత్ర్యం కొరకు పోరాడే భావన కలిగియుండాలి' అన్నది స్వామి ఉద్దేశ్యం. ఈ తత్వాన్ని ప్రజల్లోకి తెస్తున్న వ్యక్తులు మహాత్మాగాంధీ, నెహ్రూ, తిలక్ వంటి వారని భావించారు.

రాజకీయపోరాటం, వ్యక్తిత్వ నిర్మాణం వంటి వాటిని వివేకానందుల వంటివారు బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, ప్రార్థనా సమాజం వంటి సంస్థలద్వారా వ్యక్తులకి శిక్షణ ఇస్తూ భారతావని యొక్క సంపూర్ణ చిత్రాన్ని వారికి తెలిసేలా చేయసాగారు.

వివేకానందుడు విద్యా, సామాజిక సమానత్వం, రాజ్యసంబంధిత ఎత్తుగడలు, పనిపట్ల నిర్మాణవ్యవస్థను పెంచటం వంటి వాటి గూర్చి జాతీయ ఎజెండాలను తయారుచేశారు.

ఆయన ఎల్లప్పుడు ప్రాపంచిక స్వాతంత్ర్యాన్ని కోరుకునేవాడు. ప్రతిదేశము స్వతంత్రత కలిగి ఉండాలని భావించేవారు. ఈ విషయాన్ని స్వామి చికాగోలో విశ్వమత మహాసభలలో కూడా నొక్కి వక్కాణించి చెప్పారు.

ఏది ఏమైనా స్వామి వివేకానందుడు భారతస్వాతంత్ర్యోద్యమంలో సూటిగా ప్రవేశించక పోయినా, స్వాతంత్రోద్యమానికి అన్ని కోణాలలో ప్రేరేపణకు కారకుడైయ్యారు.

## పునర్వివాహ వ్యవస్థ

సామాజిక పరమైన ఆచారముల పట్ల వివేకానందుడు శిష్యులతో చర్చలకు దిగేవారు. ఏ దేశములోనైనా ఆ దేశ పరిస్థితులను బట్టి ఆచారము ఉండటం జరుగుతుంది. ఉదాహరణకు స్త్రీ పునర్వివాహ నిషేధాన్ని చూద్దాం. ఈ ఆచారమును ఎవరు కనిపెట్టినా వారిని దూషించడం అనవసరం. ఎందుకంటే ఈ ఆచారము రావటానికి రెండు కారణములు ఉన్నాయి.

అగ్రజాతుల్లో ఉన్న నిషేధం నిమ్నజాతుల్లో లేదు. స్త్రీ పునర్వివాహాలు శూద్రులలో నిరాటంకంగా జరుగుతున్నాయి. కానీ అగ్రజాతుల్లో జరగటం లేదు. కారణం నిమ్నజాతుల్లో పురుషుల సంఖ్య అధికంగా ఉండటం వల్ల అక్కడ పునర్వివాహం సంభవిస్తుంది. కానీ అగ్రజాతుల్లో పురుషుల సంఖ్య స్త్రీల





సంఖ్య కన్నా అతి స్వల్పం. ఈ పరిస్థితుల్లో స్త్రీకి పునర్వివాహం తలపెడితే మరొక స్త్రీకి 'భర్త' అనే వాడు లభించడం దుర్లభము అవుతుంది.

అందువల్లనే అప్పటి కాలమాన పరిస్థితులు స్త్రీకి పునర్వివాహం నిషేధించటం జరిగింది. కాలక్రమేణ మగవారి సంఖ్య పెరిగినప్పుడు ఆ నిషేధచట్ట ఖండన చేయవచ్చు. ఏ ఆచారమునైనా మార్చవలెనన్న ముందుగా అదిఎంతవరకు అవసరమో యోచించి దాన్ని మార్చిన ఎడల ఆ ఆచారం అదే అంతరిస్తుంది. అంతేగాని ఊరికే ఖండన మండనలవల్ల ఎటువంటి ప్రయోజనములు ఉండవు.

## తత్వశాస్త్ర విషయముల పట్ల అవగాహన

స్వామి కొంత స్వల్ప విశ్రాంతి తర్వాత తిరిగి బేలూరు మఠంలో తాను తలపెట్టవలసిన కార్యనిర్వహణలో నిమగ్నులైనారు. శిష్యులకు ఏ విషయమునైనా ఇతరులకు అర్థమయ్యేలా చెప్పటంలో తర్ఫీదు ఇవ్వసాగారు.

ఏ తత్వశాస్త్రాల గురించి అయినా ఆశువుగా ఉపన్యసించాలంటే ముందుగా విషయంపై సంపూర్ణ పరిజ్ఞానం అత్యవసరం. హక్కును గూర్చి పద్ధతిగా తెలుసుకున్నవాడికి 'ధ్యానం'ను కూడా సమర్థవంతంగా తెలుసుకోగలుగుతాడు. చేయగలుగుతాడు.

ఏకాగ్రత, పరిశుద్ధములేని వంట ఎంత అరుచిగా ఉంటుందో ఏకాగ్రత లేని సన్యాసము సంపూర్ణత్వాన్ని పొందదు. విఫలమౌతుంది. మనిషి మనస్సుకు తోచే ఏ ఆదర్శమైనా ఆచరణములో ఉంచినప్పుడే వాటి పరిమళం అందరికీ అందుతోంది.

ఆత్మవిశ్వాసంతో వారి యొక్క ఆదర్శాలను ఆచరణలో ఉంచిన కొందరు.ఆ కొందరి మానవుల చరిత్రయే ప్రపంచములోని ఏదేశ చరిత్రకయినా మూలం. ఈ విశ్వాసమే విశ్వశక్తి. అంతరాత్మకు ఆచరించే ప్రక్రియలకు పొరపొచ్చు. వైషమ్యాలు సంభవిస్తే ప్రపంచానికి అది అనర్థదాయకమౌతుంది.

ఆ అనర్థం రాకుండా ఆంతరంగిక ప్రేరణకు అవలంబించటం ఎంతైనా అవసరం. మనుష్యుల పట్ల తారతమ్యవిబేధాలను మరచి సమస్త ప్రజావనికి బాహాటంగా మహోన్నతమైన ఆధ్యాత్మిక తత్వాలను నిర్భయంగా తెలిపే సామర్థ్యం తమ శిష్యులు పొందగలగాలని ఆశించేవారు.

## సత్యము

వివేకానందుడు తన శిష్యులు ఎల్లప్పుడు ధైర్యముగా వుండాలని కోరుకుంటాడు. జనాభ్యుదయాన్నీ, విషయపరిజ్ఞానాన్నీ ప్రజలకు అందించవలసిన

ఆవశ్యకత ఎంతైనా ఉంది. సన్యాసి అనేవాడు ధనికులకి అత్యంత దూరంగా ఉండటం అవసరం. సన్యాసి నిర్భయంగా వేదశాస్త్రతత్త్వాలను ప్రజలకు అందచేయాలి.

వారి ప్రేమను నమ్మకాన్ని పొందాలంటే ముందుగా మీరు ఎటువంటి వ్యామోహానికి లోనవకుండా సత్యారాధకులై ఉండాలి. పధ్నాలుగేళ్ళు అచంచల దీక్షతో సత్యాన్ని మాత్రమే మాట్లాడుతూ, ఆచరణలోపెడితే, ఆ తర్వాత ప్రజలూ, మిగతా అందరూ మీరేమి చెప్పినా శిరసావహిస్తారు, ఆచరిస్తారు.

దేశపరిపాలనా వ్యవస్థ పట్ల రాజు అనేవాడు సత్యాన్ని అవలంబిస్తే ఆయనకు జీవితంలో తిరుగు ఉండదు. 14 ఏళ్ళ పాటు మీరు సత్యాన్ని అవలంబించిన తర్వాత నరనరాన జీర్ణించుకున్న ఆ సత్యము మీరు అసత్యాన్ని చెయ్యాలనీ, మాట్లాడాలనీ విశ్వప్రయత్నం చేసినా మనసు మీకు ఖచ్చితంగా ఎదురు తిరుగుతూ ఉంటుంది.

## గృహస్థు జీవనం

సన్యాసి అనేవాడు స్త్రీల నుంచేగాక, స్త్రీ సంసర్గం గలవారి నుంచి కూడా అత్యంత దూరంగా వర్తించాలి. ఇతరుల వస్తువులను తాకకూడదు దూరంగా ఉండటం అత్యంతావశ్యకం.

గృహస్థుల పట్ల, స్త్రీల పట్ల ఎటువంటి నిరసన భావం స్వామికి లేదు. ప్రపంచములో వైరాగ్యం ఒక్కటే భయరహితమైనదని స్వామి భావన. ఎందువలన అంటే న్యాయమార్గంలో గృహస్థ జీవిస్తే మంచిదే. అలా జీవించే వారు ఆనందభరితులే అవుతారు. కానీ గృహస్థ జీవనం సత్యానికీ, త్యాగానికీ దూరం. అటువంటి వారితో సన్యాసికి ఎటువంటి, బంధము అయినా నిరోధకమే అవుతుంది. స్వామి భావాలకు అనుగుణంగా ఉన్న గృహస్థులు గృహస్థ జీవితాన్ని గడుపుతూ స్వామి శిష్యులై ఉంటూనే ప్రజాసేవ చేసేవారు.

## అవిశ్రాంతి

నా ఈ వాక్యాలతో కొంతమంది సన్యాసులు సమర్థత పొందగలిగితే నాకు ఆనందమే. నేను ధనంతో నిమిత్తం లేకుండా నిర్వహించగలిగే కార్యానికి ధైర్యోత్సాహాలను అందచేస్తారు. నా వద్దకు సరిపడ బ్రహ్మచారులు వచ్చినా లేకున్నా అవిశ్రాంతంగా ఏ పనినైయినా పూర్తి చేస్తాను. ఎప్పటికైన కార్యనిర్వహణలోనే ప్రాణం విడుస్తాను. కార్యసూరతయే మన ధర్మం. అట్టి ధర్మాన్ని ఆచరిస్తూ నా జీవితాన్ని నేను అర్పిస్తాను.





శ్రీ రామకృష్ణ ప్రభువులు తన జీవితాన్ని ప్రపంచ శ్రేయస్సుకొరకై ధారపోశారు. నేనూ అదే మార్గాన్ని అవలంబిస్తాను. నేనే కాక నా శిష్యులు కూడా లోకశ్రేయస్సుకొరకై జీవితాన్ని అర్పించుతూ ప్రాణాల్ని ధారపోయాలి. లోకసేవతో పాటు భాగవత్సాక్షాత్కారమే సన్యాసులకు ఆదర్శములు.

భగవంతుడి దరిచేరే సన్యాస మార్గాన్ని మించిన మార్గం వేరొకటి లేదు. స్వేచ్ఛాజీవితంలో ఉన్నవారు లోకసేవ చేయలేరు. సన్యాసి మాత్రమే తప్ప మరెవరు చేయలేరు.

నీ మోక్షం కోసం నీవు ప్రాకులాడితే నీకు లభించేది నరకం. అది ప్రపంచంలో ఆత్మసామ్రాజ్యాన్ని అభిలషించి ధ్యానస్థితులై వసించండి అంటూ తనలో ఉన్న ప్రజాసేవనూ భగవంతుని యెడల ఉన్న భక్తినీ సన్యాసి అవలంబించవలసిన రీతినీ శిష్యులకు విశదీకరించాడు.

## శిష్యుల పయనం

స్వామి శిష్యులకు తగు శిక్షణను ఇచ్చారు. ఆ తర్వాత సోదరశిష్యుల శారదానంద తురీయనందులను గుజరాత్‌నకూ, శివానందుడిని సింహళానికీ (ఇప్పటి శ్రీలంక) రామకృష్ణానందుడిని మద్రాసుకు, మరొక ఇద్దరిని ఢాకా పంపారు. వారు తలపెట్టిన ఉద్యమం వారు వెళ్ళిన ప్రదేశాలలోనే కాక చుట్టు ప్రక్కల కూడా వ్యాపించింది. అందరికి ఆదర్శప్రాయమైంది.

ఒకనాడు వివేకానందుని గృహశిష్యులలో ఉత్తముడైన నాగమహాశయుడు స్వామిని సందర్శించి "సాక్షాత్ పరమశివస్వరూపములైన మీ దర్శన భాగ్యంతో నేను ధన్యుడనైనాను" అనగా స్వామి ఆతడి గూర్చి శిష్యులతో గృహస్థుజీవనం సాగిస్తూ అతడు చేసే లోకసేవ మరియు భగవద్ధ్యాన నిష్ఠాగరిష్టత గూర్చి వివరించారు.

అంతట నాగమహాశయుడు శిష్యులతో "తాను సన్యాసానికి అనుగ్రహించమంటే అనుగ్రహించిక గృహస్థు జీవనం సాగించమని చెప్పారు. తదాజ్ఞాను ప్రకారంగా నేను ఉంటున్నాను.

స్వామి వారసులైన మిమ్మందరిని దర్శించి ధన్యుడనైనాను" అన్నాడు. నాగ మహాశయుడు స్వామిలో పరమశివుడంతటి వానిలో ఉన్నంత దివ్యత్వాన్ని గాంచాడు. అతడే కాక స్వామి శిష్యులు కూడా అదే భావనని కలిగి ఉంటూ స్వామిని పూజించుతూ భక్తిపారవశ్యమును పొందేవారు.

## అద్వైతాశ్రమం

భారతదేశంలో పలుచోట్ల ప్రబోధాత్మకమైన ఆశ్రమాలు వివేకానందుని హయంలో వెలసి ఉన్నాయి. స్వామి ఒకనాడు అద్వైతవేదాంత ప్రచారం నిమిత్తమూ అనుష్ఠానం నిమిత్తమూ హిమాలయములలో దివ్యాశ్రమాన్ని నెలకొల్ప దలచారు. హిమాలయములపై ఆశ్రమం అంటే ఖరీదైన విషయము. కానీ స్వామి తలచినంతనే అత్యంత తక్కువ సమయంలో పాశ్చాత్యశిష్యులైన సెవియరు దంపతుల కారణంగా హిమాలయములలో మాయావతి అనెడి ప్రదేశంలో 6,800 అడుగుల ఉన్నత శిఖరమున అద్వైతాశ్రమం స్థాపించారు.

ఆ తర్వాత శ్రీరామకృష్ణాశ్రమములలోకెల్లా ఈ ఆశ్రమం అత్యంత ప్రఖ్యాతి గాంచింది. "మానవశ్రేయస్సుకొరకై ఈ ఆశ్రమంలో అద్వైత వేదాంతం భోదించారు. అద్వైతమే ఇక్కడ అనుష్ఠింప చేశారు. ఇదే ఆశ్రమ ఉద్దేశ్యము" అని వివేకానందుడు వివరించారు. అక్కడనుండే జగద్విఖ్యాత మాసపత్రిక 'ప్రబుద్ధభారతము' వెలువడి మానవసేవ చేయుచుంది.

## అమెరికాని పునఃదర్శించిన వివేకానందుడు



1899 వ సం॥ జూన్ 20వ తేదీన నివేదిత, తురీయనంద సమేతుడై స్వామి శారదామాతృదేవి ఆశీర్వాదాన్ని పొంది గోల్కొండ అనే ఓడలో పశ్చిమ ఖండప్రదేశమైన అమెరికాకు పయనమైయ్యారు. కొలంబో చేరారు. ఆ ప్రయాణ సమయంలో ఆయన చేసిన ప్రసంగాలను "నాకు గోచరించిన స్వామి" అనెడి పుస్తకంలో నిర్వచించాడు.

### మచ్చుకుకొన్ని ప్రవచనాలు.

– పాశ్చాత్యుల చెప్పే నిత్యకృత్యమైన మాంసభక్షణ అనే విధానాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. వైరంచేత గాని, యుద్ధసమయంలో గాని ఈ నరమాంస భక్షణను ఏ జాతి చేసియుండలేదు. అదే గనుక చేసి ఉంటే ఈ సరికి సాంఘిక జీవనమే అంతరించి ఉండేది.

–ప్రమాదానికి స్వార్థపరమే మధ్య కారణం. ఎప్పుడు స్వార్థచింతనను వదలుతామో అప్పుడు గాని మనము మాట్లాడే మాట లేక చేసే చేత రెండింటిలోను న్యాయము గోచరిస్తుంది.





–యుద్ధం చేత అభివృద్ధి పొందటం అనే భావన పిచ్చిది. అభివృద్ధికి కావలసినది అన్యమతాభిప్రాయ సమన్వయం. ఇదే సనాతన ధర్మ సహజలక్షణం. ఎటువంటి క్రొత్త జాతులు భారతదేశంలో తాండవం చేసినా చివరకు సనాతన ధర్మమును అనుసరించవలసిన అవసరం ఏర్పడుతుంది..... అది తథ్యం.

–పరిపూర్ణమైన మనోనిగ్రహంతో చేసే ఏ కార్యమైనా సఫలం అవుతుంది. అది లేని కార్యము అడవికాచిన వెన్నెలవుతుంది.

–గృహస్థు జీవనాన్ని భార్యాబిడ్డల పట్ల చూపించవలసిన అఖండప్రేమాను రాగాలను వైష్ణవమతం నిరసించదు. మీ బిడ్డని చిన్ని కృష్ణునిగా భావించండి అని వైష్ణవమతం చెబుతోంది. ఇంద్రియాలను నిగ్రహించండి.

–భారతదేశ ప్రజలు దైవభక్తి కలవారు. మా యొక్క దేవుళ్ళు రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు, ఆత్మదృష్టి ఐన బుద్ధుడు.

## మాయా ప్రకృతి

ఇదే సమయంలో సముద్రయానం చేస్తుండగా ఒక శిష్యురాలితో ఈ విధంగా అన్నాడు "ఈ మాయాప్రకృతి ఇంత మనోహరంగా మనస్సులను ఆనందింప చేస్తుంటే ఈ ప్రకృతినీ, విశ్వాన్నీ సృష్టించిన పరమాత్మ యొక్క సౌందర్యము మరెంత మనోహరమో, అద్భుతమో తలంచండి... ఆకాశం.. సాగరము కలిసినట్లుండే మాయా ప్రకృతి ప్రతి ఒక్కరిని తటస్థిస్తుంటే, ఈ కావ్యపఠనాలు, దివ్యోపదేశాలు అవసరమా" అన్నారు.

## స్వామి బాటలో స్వాతంత్ర యోధులు

స్వామి జీవితకాలంలోనే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించారు. కాంగ్రెస్ తమ విధానాలను సరిదిద్దుకోవటానికి స్పష్టంగానైనా ఖచ్చితంగా స్వామి పాత్ర ఉంది. మొట్ట మొదటగా స్వదేశి ఉద్యమం ప్రేరేపణకు కారణమైంది. తిరుగుబాటుతనానికి స్వస్తి పలికారు.

గోఖలే సాంఘిక ఆలోచనలు, నిమ్నజాతి వారి అభివృద్ధికరమైన ఆలోచనల వంటి వాటికి ప్రేరణ వివేకానందుల వారే. బాలగంగాధర తిలక్ 'వివేకానందుడు భారతీయ జాతికి తండ్రివంటివాడు అని వక్కాణించి ప్రతి భారతీయుడు ఈ నూతన భారతావనికి కారకుడైన వివేకానందునికి గూర్చి తెలుసుకోవాలని' 1912 వ సం॥, జనవరి14 న తన పత్రికలో ప్రచురించాడు.

''జాత్యాభిమాన్ని ప్రతి ఒక్కరిలో బలంగా చొప్పించిన ఘనత వివేకానందుడిదే' అని ఐరిష్ యువతి అనిబీసెంట్ తాను వ్రాసిన పుస్తకంలో

చెప్పింది. శ్రీ అరబిందో జాతీయపార్టీ లీడరు, శ్రీరామకృష్ణ పరమహంసను మానవ రూపంలోకి దేవునిగా, వివేకానందుడు ఆయన సిద్ధాంతాలను యావత్తూ తెలిపే శిష్యునిగా అభివర్ణించారు.

భవిష్య భారతావనికి వివేకానందుడు రామకృష్ణుడు తయారుచేసిన ప్రతినిధి అని భావించాడు. వివేకానందుని ప్రవచనాలు పదునైన ఆయుధాలుగా అరబింద్ ఘోష్ చేప్పారు.

## మరికొంత మంది ప్రముఖులు దృష్టిలో

వివేకానందుడి సందేశాలు ప్రతి మానవుడిని పూర్తిగా మేల్కొలిపి పరిపూర్ణమైన మనిషిగా చేసాయి. యువకులు ఈ సందేశాల కారణంగానే దాస్యత్వానికి ఎదురు తిరిగి పరమపవిత్రమైన సేవకు పాత్రులై వారి త్యాగాన్ని పనులద్వారా చూపెట్టారు.

వివేకానందుడి ద్వారా సందేశాలను జీర్ణం చేసుకున్న యువత తమలోని ధైర్యాన్ని ఉద్యమకాలంలో చూపారు. సుభాష్ చంద్రబోస్ సౌత్ఈస్ట్ ఏరియా గురించి చలించి చెప్పిన 'సమైక్యత నమ్మకం', 'అంకితం భావం' వంటి ఆలోచనలకు వివేకానందుడే స్ఫూర్తి దాయకుడు.

'ఎంతమాత్రము అలక్ష్యత చూపని త్యాగనిరతితో ఎడతెగని చురుకుదనంతో, అంతులేని ప్రేమతో, లోతైన చమత్కారపూరితమైన వివేకముతో, అత్యుత్తమభరితమైన భావనలతో నిండి ఉండే వివేకానందుడు ఇప్పటికీ బాలుడే' అని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చెప్పారు.

## మహాత్మాగాంధీపై వివేకానందుడి ప్రభావము

వివేకానందుడి ఆలోచనలూ, బోధనలూ గాంధీజీ ద్వారా సంపూర్ణంగా పనిచేసాయి. ముఖ్యంగా హరిజనోద్యమంలో గమనించవచ్చు. గాంధీజీ దృష్టిలో రామకృష్ణలు, వివేకానందుల వారు ఇరువురూ జీవితాలను ప్రజాసేవకి అర్పించిన సత్ వ్యక్తిత్వం ఉన్న మహనీయులు.

వివేకానందుడి ప్రభావం స్వాతంత్రోద్యమంలో విలీనమైవుంది. భారతస్వాతం త్రోద్యమానికి స్పష్టత చేకూర్చి జాతి పట్ల సంపూర్ణత్వభక్తి ప్రేమలను పెంచి స్వాతంత్ర్యాన్ని పొందాలనే స్ఫూర్తిని మానవులలోకి ప్రవేశింపచేశాడు. ఆయన వచనాలు "లేవండి, మేల్కొనండి, గమ్యాన్ని చేరేవరకు ఆగకుండా పనిచేయండి' అనెడివి. ఇప్పటికి మానవాళిని ఆలోచింప చేస్తున్నాయి.





## వివేకానందుడి రచనలు

స్వామి వివేకానందుడు, యోగ, రాజయోగలతోపాటు జ్ఞానయోగ అనే పుస్తకాలు రచించి యువకులకు నూతన రాజమార్గాన్ని చూపించాడు. ఆయన రచనలు ఎటువంటి పిరికివాడినైనా కూడా ధైర్యవంతుని చేస్తాయి. ఖచ్చితంగా ఆయన రచనలు మనిషిలోని విషాదాన్నీ ఒత్తిడినీ, నిరాశా, వ్యాకులతనీ దూరం చేస్తాయి.

స్వామిజీ తన శిష్యులను వెంట పెట్టుకుని అల్మోరా, పంజాబ్, కాశ్మీర్, అంబాలాలతో పాటు ఇతర ప్రదేశాలకు కాలినడకన చేరి సంస్థ యొక్క లక్ష్యాన్ని తన ప్రవచనాలతో ప్రజలకు తెలిపేవాడు. ఈ వ్యాప్తికి ఆర్యసమాజం ఎంతగానో సహాయపడింది. ఆ తర్వాత కేత్రి మహారాజు ఆహ్వానంతో అక్కడ కొన్ని రోజులు బసచేసి తర్వాత ఆగ్రా చేరారు.

అక్కడ చిన్నతనంలో తనని సాకిన వృద్ధురాలిని కలిసి కొంత సమయము గడిపి ఆమె కుమారుడికి కొంతపైకము ఇచ్చి తిరిగి బయలుదేరారు. ఆ సమయంలో మాయావతిలో సెయింట్ క్యావియర్ మరణించాడని తెలిసి హుటాహుటిన అక్కడికి చేరి సంతాపం ప్రకటించి సెయింట్ క్యావియర్ భార్యని ఉపశమింపచేశాడు. ఆ తర్వాత బేలూరు మఠానికి చేరారు. అత్యంత చలిలో ఉత్తరదేశ ప్రయాణం స్వామీజీ ఆరోగ్యాన్ని మరింత క్షీణింపచేసింది.

## స్వామీజి చివరి రోజులు

స్వామి ఆరోగ్యం వేగంగా క్షీణించసాగింది. శిష్యులు వెన్నంటి ఉండి సపర్యలు చేయసాగారు. నివేదిత వంటి పాశ్చాత్య శిష్యులు కూడా స్వామి ఆరోగ్యం, గురించి కలత చెందారు. శిష్యుల ప్రార్థనలపై స్వామి వైద్యం చేయించుకోవటానికి అంగీకరించారు. వైద్యుడు చెప్పిన కఠిన పత్యాన్ని



పాటించుతూనే మరింత గ్రంథ పఠనం చేస్తూ శిష్యులకు ఉపదేశించే వారు. మఠనంఘోద్దేశాలనూ, కార్యవిధానములనూ, సభ్యులు నిర్వర్తించవలసిన కార్యములనూ 1895 వ సం॥ లో విపులంగా రచించారు. ఈ నియమావళిని పాటించటమే సభ్యులు కర్తవ్యం. స్వామి సమయాన్నంతా భగవద్ధ్యానానికీ శిష్యోపదేశములకూ కేటాయించారు. ఎక్కువ మంది శిష్యులు తనవద్దనుంటానికి ఒప్పుకోని స్వామి అభీష్టము మేరకు వంతులు వారీగా స్వామి వద్ద ఇద్దరు లేక ముగ్గురు చొప్పున

ఉంటూ మిగిలిన వారు కార్యనిర్వహణలలో నిమగ్నులై ఉండేవారు. తానెప్పుడు ఈ లోకాన్ని విడుస్తాడో తెలిసిన స్వామి అప్పగించవలసిన బాధ్యతలూ, ఆచరించవలసిన కార్యములన్నింటినీ జోడించి ఒకనాడు శిష్యుడితో "నేను శరీరాన్ని విడిచిన అనంతరం నన్ను ఆ స్థలంలో దహనం చేయండి" అంటూ ఒక స్థలాన్ని చూపించారు.

## మహాసమాధి

జూలై నాలుగు, 1902 వ సంవత్సరము, సంధ్యాసమయంలో లేచి కాలకృత్యములు తీర్చుకుని పూజామందిరములో ధ్యానం అనంతరం కాళీమాతపై మనోహరమైన కీర్తనలను ఆలాపించారు. చాలా రోజుల నుంచి నడిచే స్థితిలో లేని ఆయన ఆనాడు లేచి తిరుగుతూ అన్ని పనులు చేసుకోసాగారు. అనంతరం ఒక గదిలో ఏకాంతంలో జపమాలతో ధ్యానం చేసుకున్నారు.

ఆ సాయంత్రం వరకు శిష్యులకు పాఠాలు చెప్పారు. ఆ తర్వాత వ్యాహ్యాళికి వెళ్ళివచ్చి గదిలోకి వెళ్ళి ధ్యానం చేసుకోసాగారు. ఒక శిష్యుడు స్వామికి వీవెనతో నెమ్మదిగా విసురుతున్నాడు. ఆ తర్వాత నేలమీద పడుకున్నారు. జపమాలను మాత్రం చేతిలోనే ఉంచుకున్నారు. కనులు మూసుకున్నారు.

ఆ తర్వాత రెండుమూడు సార్లు దీర్ఘశ్వాసలు తీసుకున్నారు. స్వామి సమాధి నిమగ్నులైనారని శిష్యుడు తలంచి వేరే శిష్యుణ్ణి పిలవగా అతడు పరీక్షించి స్వామికి శ్వాసలేదని నాడి నిలిచిపోయిందని చెప్పాడు. మళ్ళీ వైద్యుడు కూడా పరీక్షచేసి మరణించారని ధృవపరిచాడు.

యోగిపుంగవుడు, ఋషీశ్వరుడు, జగద్గురువరేణ్యుడు, సనాతనధర్మపునః ప్రతిష్ఠాపనార్థం జన్మించిన నరోత్తముడైన వివేకానందుడు వేదాంత సాగరంలో విలీనమై శ్రీమన్నారాయణునిలో ఐక్యం అయినారు. స్వామి వివేకానందుడి జీవితము ప్రతిభారతీయుడికి మార్గదర్శకమైంది. ఆయా ప్రవచనాలు మన జీవన శైలిలో ఉన్నతపథంగా మారాయి.

ఎంతో చిన్న వయసులో చనిపోయినా ఆయన సాధించిన కార్యములు భారతదేశాన్ని యావత్తు మేల్కొలిపాయి. విశ్వమత సామరస్యత గురించి స్పష్టమైన ఆలోచనను కలిగించిన ఆ ఉత్తమోత్తముడు మన భారతీయుడు అవటం భారతీయులకు గర్వకారణం.

ప్రతిభారతీయుడు ఆయన చరిత్ర చదివి ఆయన ప్రవచనాలను తన జీవన శైలికి మార్గదర్శకంగా స్వీకరించాలి.





## స్వామి వివేకానందుని ప్రవచనాలలో మచ్చుకు కొన్ని

- విశ్వంలో నిగూఢ రహస్యాలకు ప్రేమ అనేది ద్వారం వంటిది.
- నువ్వు ఇతరులకు జీవితాన్ని ఇస్తే నీకు జీవితం లభిస్తుంది.
- భగవంతుడికీ, రాక్షసుడికీ మధ్య తేడా నిస్వార్థానికీ, స్వార్థానికీ ఉన్న తేడా వంటింది.
- స్వార్థము అనేది అయోగ్యమైనది. నిస్వార్థము యోగ్యమయింది.
- సత్యము అనేది స్వచ్ఛమైంది, జ్ఞానవంతమైంది, శక్తివంతమైంది.
- వివిధ పొరపాట్లను అధిగమించి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి.
- గాలి అనేది కలలో విహరిస్తున్న వ్యక్తులను మేల్కొలపడానికి ఉపయోగపడే ప్రకృతి సాధనం.
- సహనమూ, నిజాయితీ, స్వచ్ఛతలతో పాటు నిలకడ అనేవి విజయానికి అవసరమైన గుణాలు.
- 'సత్యమేవ జయతే' అనెడిది వివేకానందుడి నినాదము.

----------- ----------------